ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

5

ప్రకాశం

జిల్లా వార్తలు

శనివారం 26, జూలై 2025



వేలం కేంద్రం లోపల నోబిడ్ అయిన బేళ్ల రైతుతో మాట్లాడుతున్న ప్రైవేటు వ్యాపారి

పొగాకు రైతులు నిలువు దోపిడీకి గురవుతున్నారు. ఒకపక్క పంట పెట్టుబడి పెరిగిపోవడం, మరోవైపు మార్కెట్ ఒడిదొడుకులతో అల్లాడుతున్నారు. ఇదేసమయంలో వేలం కేంద్రంలో వసూళ్ల దెబ్బకు బిత్తరపోతున్నారు. కొండపిలో బేలు అమ్ముకోవాలంటే వ్యాపారులకు, గుమస్తాలకు డబ్బులు చెల్లించుకోవాల్సిన పరిస్థితి. లేదంటే నోబిడ్ పేరుతో బేలును ఇళ్లకు తెచ్చుకోవడం కానీ, ప్రైవేటు వ్యాపారులకు తెగనమ్ముకోవడం కానీ చేయాల్సి వస్తున్నదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డబ్బులు వసూలు చేయడం నిత్యకృత్యంగా మారిందంటున్నారు. వేలం నిర్వహణలో అవకతవకలు జరుగుతున్నాయని చెప్పినా పట్టించుకునేవారు లేరని వాపోతున్నారు. కాసులిస్తేనే పొగాకు బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



గుమస్తాలకు ఇచ్చేందుకు జేబులో డబ్బులు చాటుగా తీస్తున్న రైతు

నిలువు దోపిడీ

కొండపి వేలం కేంద్రంలో వసూళ్ల రాజ్యం

- పొగాకు బేలుకు వ్యాపారుల బేరం రూ.వెయ్యి
- పట్ట ప్యాసింగ్ సిబ్బందికి రూ.500
- బాహాటంగానే తీసుకుంటున్న వైనం
- కేంద్రంలోనే నోబిడ్ బేళ్లను కొంటున్న ప్రైవేటు వ్యాపారులు
- చేష్టలుడిగి చూస్తున్న బోర్డు అధికారులు
- భారీగా నష్టపోతున్నామంటూ రైతుల ఆందోళన



కొండపి, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : కొండపి పొగాకు వేలం కేంద్రం దళారుల పాలిట కల్పతరువుగా మారింది. అసలే గిట్టుబాటు ధరలు లేక, వ్యాపారులు కొనుగోలు చేయక రైతులు బేళ్లను ఇళ్లకు, వేలం కేంద్రానికి తిప్పలేక అవస్థ పడుతున్నారు. సందట్లో సడేమియా అంటూ వ్యాపారులు, పొగాకు బేళ్లను పరిశీలించే గుమస్తాలు, ప్రైవేటు వ్యాపారులు రైతులను దోచుకుంటున్నారు.

గుమస్తాల గుంజుడు

వ్యాపారులు కొనుగోలు చేసిన బేళ్లను తర్వాత బేలు కట్టుకునే గుమస్తాలు పరిశీలిస్తారు. అయితే బేలు బాగున్నా పొగాకు గ్రేడ్ మారిందని, డ్యామేజ్ అయ్యిందని, రకరకాలుగా వంకలు గుమస్తాలు పెట్టి రైతుల వద్ద నుంచి డబ్బులు దండుకొంటున్నారు. బేలుకు రూ.200 నుంచి రూ.500 వరకూ ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. అసలే నోబిడ్ బేళ్లను వేలం కేంద్రానికి తీసువచ్చి, తీసుకెళితే బేలుకు 5 కేజీల తరుగుపోతోంది. దీంతో రైతులు గుమస్తాలకు డబ్బులు చాటుమాటున సమర్పించుకుంటున్నారు. వేలం కేంద్రంలో సీసీ కెమెరాలున్నా, గుమస్తాలు వసూళ్ల పర్వాన్ని బాహాటంగానే కొనసాగిస్తుండటం వారి బరితెగింపును తెలియజేస్తోంది.

లోపలే ప్రైవేటు వ్యాపారుల కొనుగోలు

వేలం కేంద్రంలో వ్యాపారులు కొన్ని బేళ్లను నోబిడ్ పెడుతుండగా వెంటనే ప్రైవేటు వ్యాపారులు అక్కడే

మిగతా 6వ పేజీలో

కొనుగోలు వ్యాపారులకు బేలుకు రూ.వెయ్యి

పొగాకు వేలం కేంద్రానికి తీసుకువస్తున్న సన్న, చిన్నకారు రైతుల బేళ్ల నోబిడ్‌లుగా ఇళ్లకు వెళ్తున్నాయి. అయితే పెద్ద రైతులు నాలుగైదు బ్యారన్‌లను లీజుకు తీసుకుని 20 నుంచి 30 బేళ్ల వేలంలో ఉంచినప్పుడు వారితో ఆయా కంపెనీల వ్యాపారులు బేరం కుదుర్చుకుని కొనుగోలు చేస్తున్నారని మిగతా వారు ఆరోపిస్తున్నారు. బేలుకు వెయ్యి రూపాయల చొప్పున ఫోన్‌పేలకు కొట్టించుకుంటున్నారని విమర్శిస్తున్నారు. నిక్కచ్చిగా రైతుల పక్షాన మాట్లాడుతున్న వారి బేళ్లు కూడా నోబిడ్ అవుతున్నాయి. కాసులిచ్చిన వారి బేళ్లు వ్యాపారులు జోరుగా కొనుగోలు చేస్తున్నారని వేలం కేంద్రం పరిధిలోని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మత్తుకు చిత్తు

పెడదారి పడుతున్న విద్యార్థులు

- యూట్యూబ్‌లో చూసి మోటార్ సైకిళ్ల చోరీలు
- ఆరునెలల్లో మద్యం సేవించి పట్టుబడిన 35మంది
- గంజాయి వాడకం, విక్రయాల్లో మైనర్లు





ఒంగోలు క్రైం, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాల్సిన విద్యార్థులు మత్తుకు చిత్తవుతున్నారు. పూర్తిగా బానిసలై డబ్బుల కోసం దొంగలుగా మారుతున్నారు. తల్లిదండ్రుల ఆశలపై నీళ్లుచల్లి కొందరు గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తుపదార్థాల విక్రయాలు చేస్తూ జులాయిలుగా మారుతున్నారు. పోలీసులకు దొరికిపోయి జైళ్ల పాలవుతున్నారు. మొత్తంగా చిన్న వయసులోనే మత్తుకు బానిసలై వీధుల వెంట మోటారు సైకిళ్లపై రయ్ రయ్‌మంటూ తిరుగుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. ప్రధానంగా

మిగతా 6వ పేజీలో

భారీగా నోబిడ్‌లు

పలు కేంద్రాల్లో 35నుంచి 40శాతంపైగానే!

ఒంగోలు, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : పొగాకు మార్కెట్లో నోబిడ్ (తిరస్కరణ)లు మళ్లీ పెరుగుతున్నాయి. గత వారం వరకు సగటున రోజువారీ 20శాతానికి అటు ఇటుగా ఉన్న నోబిడ్ బేళ్లు మూడు రోజులుగా 30శాతానికిపైకి చేరాయి. ఇవి కొన్ని కేంద్రాల్లో ఏకంగా 35నుంచి 40శాతానికి పైగానే ఉంటున్నాయి. దక్షిణాదిలోని 11వేలం కేంద్రాలలో శుక్రవారం మార్కెట్‌ను పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతోంది. రెండు రీజియన్లలోని 11వేలం కేంద్రాలకు శుక్రవారం 9,403 బేళ్లను రైతులు అమ్మకానికి తీసుకురాగా 5,749 మాత్రమే వ్యాపారులు

మిగతా 6వ పేజీలో





శ్రావణ శోభ

జిల్లావ్యాప్తంగా శ్రావణ శోభ నెలకొంది. పవిత్రమాసంలోని తొలి శుక్రవారం సందర్భంగా అంతటా ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. మహిళలు పెద్దఎత్తున ఆలయాలకు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఒంగోలులోని కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో ఉన్న అన్నపూర్ణదేవిని శాకంబరిగా అలంకరించారు. ఈ సందర్భంగా మహిళలు సామూహిక వరలక్ష్మీ వ్రతాలు చేశారు. -ఆంధ్రజ్యోతి, ఒంగోలు

వ్యవసాయంలో డ్రోన్ల వినియోగంతో మహిళలకు జీవనోపాధి

- జిల్లాలో 200 మందికి ఇవ్వాలన్నదే లక్ష్యం
- 80 శాతం సబ్సిడీతో పొదుపు సంఘాల సభ్యులకు..
- ఆరోగ్యం, ఆదాయమే లక్ష్యంగా ప్రభుత్వం ముందడుగు

6

సెల్యూట్ సైనికా!

- గిద్దలూరు నియోజకవర్గం నుంచి ఎక్కువమంది సేవలు
- మాజీ సైనికులు కూడా ఈ ప్రాంతం నుంచే అధికం
- నేడే కార్గిల్ విజయ్ దివస్



7



విద్యార్థినులను దత్తత తీసుకుంటున్న ఎర్రగొండపాలెం ఎంఈవో ఆంజనేయులు

మేమున్నామనీ... మీకేం కాదనీ

- ప్రభుత్వ పిలుపునకు స్పందిస్తున్న అధికారులు
- అనాథలను అక్కున చేర్చుకుంటున్న వైనం
- పీ4 పిలుపుతో పలువురు దత్తత
- ఒక్కొక్క బాలికది ఒక్కో దీనగాథ

7

వాళ్లంతా ఒంటరివాళ్లే. చిన్నతనంలోనే తల్లిదండ్రులను పోగొట్టుకున్నారు. తోడుగా ఉండేందుకు తోబుట్టువులు కూడా లేరు. ఒంటరి బతుకులకు తాతయ్య, నానమ్మలే అండగా నిలిచారు. ప్రభుత్వం కల్పించే వసతులతో విద్యాభ్యాసం సాగిస్తున్న వారికి ఇప్పుడు సీఎం చంద్రబాబు పీ4 పేరుతో చేపట్టే కార్యక్రమం ద్వారా అండ లభించింది. ఈ ముగ్గురు పిల్లలను ఎర్రగొండపాలెం మండల విద్యాశాఖాధికారి ఆంజనేయులు దత్తత తీసుకుని వారి బంగారు బాల్యానికి భరోసా ఇస్తానని హామీ ఇచ్చారు.

మధ్యాహ్న భోజనంలో అవకతవకలు

- డైరెక్టర్ ఆగ్రహం
- హెచ్‌ఎంపై చర్యలకు ఆదేశం

ఒంగోలు విద్య జూలై 25 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురం జిల్లా పరిషత్ బాలికల హైస్కూలులో మధ్యాహ్న భోజనం అమలులో అవకతవకలు చోటుచేసుకోవడంపై రాష్ట్ర మధ్యాహ్న భోజన పథకం డైరెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యులైన పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ మేరకు పాఠశాల విద్య గుంటూరు ఆర్జేడీని కోరుతూ ఉత్తర్వులు జారీచేశారు. మార్కాపురం జడ్పీ బాలికల హైస్కూలులో మధ్యాహ్న భోజన పథకం అమలులో అవకతవకలు చోటుచేసుకున్నాయి. వీటిని పాఠశాల ఎస్‌ఎంసీ చైర్మన్ వెలుగులోకి తేవడంతో అక్కడి సబ్ కలెక్టర్, ఉప విద్యాధికారి, మండల విద్యాధికారి పాఠశాలలను సందర్శించి విచారణ నిర్వహించారు. అందులో నివ్వెరపోయే వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి

మిగతా 6వ పేజీలో



మార్కాపురంలోని బాలికల జడ్పీ హైస్కూల్

గంజాయి ముఠా అరెస్టు



7

- పోలీసుల అదుపులో 27 మంది
- వారిలో ఒకరు చైన్ స్నాచర్
- వివరాలు వెల్లడించిన ఒంగోలు డీఎస్పీ శ్రీనివాసరావు



దామోదరం సంజీవయ్య మార్కెట్లోని దుకాణాలు

బినామీలదే పెత్తనం!

- దామోదరం సంజీవయ్య మార్కెట్లో ఇష్టారాజ్యం
- అద్దెకు తీసుకున్నదొకరు.. వ్యాపారం చేస్తుందొకరు
- దుకాణాలు ఖాళీ చేయకుండా ఏళ్ల తరబడి తిష్ఠ
- యథేచ్ఛగా అనుభవిస్తున్న అక్రమార్కులు
- కనీస చర్యలు తీసుకోని కార్పొరేషన్ అధికారులు

ఒంగోలు నడిబొడ్డున ఊరచెరువులోని దామోదరం సంజీవయ్య మార్కెట్‌లో అవకతవకలు చోటుచేసుకున్నాయి. దుకాణాల కేటాయింపు నుంచి అద్దె నిర్ణయం వరకు లోపాలు కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నాయి. కొందరు వ్యాపారులు ఏళ్లతరబడి ఎలాంటి అద్దె చెల్లించకపోగా, మరికొన్ని దుకాణాల్లో బినామీలు పడ్డారు. అద్దెకు తీసుకుంది ఒకరైతే.. వ్యాపారం చేస్తున్నది మరొకరు. ఎవరి పరిధిలో వారు అధికారులతో కుమ్మక్కై, పలుకుబడిని ఉపయోగించుకుని తమ స్వాధీనంలో ఉంచుకున్నారు. ఆపై వేల రూపాయల అద్దెకు ఇచ్చి వసూలు చేసుకుంటూ కార్పొరేషన్‌కు మాత్రం రూపాయి కట్టడం లేదు. ఏళ్ల తరబడి ఈ తంతు నడుస్తున్నా కార్పొరేషన్ అధికారులు కన్నెత్తి చూడడం లేదు.

ఒంగోలు కార్పొరేషన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మార్కెట్ షాపుల కేటాయింపుల్లో గతంలో అక్రమాలు చోటుచేసుకున్నాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అన్యాయం జరిగిందంటూ ఉన్నతాధికారులకు, లోకాయుక్తకు పలువురు ఫిర్యాదు చేశారు. దీంతో 2012 మార్చి నుంచి మార్కెట్‌లో దుకాణాల కేటాయింపు, చోటుచేసుకున్న లోపాలపై సమగ్ర విచారణ చేపట్టి నివేదిక ఇవ్వాల్సిందిగా అప్పటి గుంటూరు రీజనల్ డైరెక్టర్ శ్రీనివాసరావును ఉన్నతాధికారులు ఆదేశించారు. దీంతో చీరాల మునిసిపాలిటీ రెవెన్యూ ఆఫీసర్ బీవీవీ భాస్కర్‌రావు, కావలి మునిసిపాలిటీకి చెందిన ఉద్యోగి పి.సుబ్బారావు, మరో నలుగురు బిల్ కలెక్టర్లతో కూడిన బృందాన్ని విచారణకు ఆర్డీ నియమించారు. వారు స్వయంగా మార్కెట్‌ను పరిశీలించారు. మొత్తం 318 షాపులు ఉండగా వాటిలో 61 మూసివేసి ఉన్నాయని, 33 కేటాయించిన వ్యక్తులు స్వాధీనం

మిగతా 6వ పేజీలో

నిలువు దోపిడీ

(5వ పేజీ తరువాయి)

రైతులపై గద్దల్లా వాలిపోతున్నారు. పొగాకుకి మార్కెట్ లేదని, బేలును పదేపదే ఇంటికి, వేలం కేంద్రానికి తిప్పడం వల్ల తరుగు పోతుందని వారిని భయపెడుతున్నారు. రానుపోను ఖర్చులు అదనంగా అవుతాయని చెప్పి బేళ్లను దళారులు తక్కువ రేటుకు కొనుగోలు చేస్తున్నారు. అప్పటికే విసుగు చెంది ఉన్న రైతులు ప్రైవేటు వ్యాపారుల మాయమాటలకు లొంగిపోయి తక్కువ రేటుకు బేళ్లను తెగనమ్ముకుని వెళ్తున్నారు. వాటిని కొనుగోలు చేసిన వారు ప్రైవేటు లైసెన్స్‌లు బాడుగకు తీసుకుని తిరిగి వేలం కేంద్రంలో కంపెనీల తరఫున పొగాకు కొనుగోలు చేసే వ్యాపారులకు బేలుకు రూ.వెయ్యి ఇచ్చి వేలంకేంద్రంలో అమ్ముకుంటున్నారు. ఈవిధంగా యథేచ్ఛగా నోబిడ్ బేళ్లను ప్రైవేటు వ్యాపారులు కొనుగోలు చేసి లక్షల రూపాయల సంపాదిస్తూ రైతుల నోట్లో మట్టి కొడుతున్నారు.

కేజీకి రూపాయి పెంచాడని బయ్యర్‌పై మిగతా వ్యాపారుల గుర్రు

పొగాకు వ్యాపారులందరూ సిండికేట్‌గా మారి బ్రైట్ రకం పొగాకును కేజీకి రూ.280 ధరకు కొనుగోలు చేస్తున్నారు. రెండు రోజుల నుంచి ఓ కంపెనీకి చెందిన వ్యాపారి కేజీ రూ.281 చొప్పున ఒక రూపాయి పెంచి కొనుగోలు చేస్తున్నాడు. దీంతో మిగతా వారు సదరు వ్యాపారిపై గుర్రుగా ఉన్నారు. సిండికేట్ నిబంధనలను ఎలా అతిక్రమిస్తున్నావని అతనితో కొందరు గొడవపడినట్లు తెలిసింది. గురువారం కూడా తిరిగి ఆ కంపెనీ ప్రతినిధి కామేపల్లికి చెందిన ఓ రైతు బేలును కేజీకి రూ.281 చొప్పున కొనుగోలు చేయడంతో, మరో వ్యాపారి రీబిడ్ పేరుతో అదే బేలును తిరిగి రూ.280కి కొనుగోలు చేశాడు. ఈ విషయమై రైతు వాదనకు దిగాడు. అయితే వేలం కేంద్రం అధికారులు నోరు మెదపడం లేదని సదరు రైతు వాపోయాడు.

నిఘాపెట్టి చర్యలు తీసుకుంటున్నాం

- జి.సునీల్‌కుమార్, వేలం నిర్వహణాధికారి

వేలం కేంద్రంలో రైతులను మోసం చేస్తూ వ్యాపారులు, గుమస్తాలు, ప్రైవేటు వ్యాపారులు నడుపుతున్న వ్యవహారాలపై నిఘా పెడతాం. రెండు రోజుల క్రితం గుమస్తాలతో సమావేశం ఏర్పాటు చేసి కఠినంగా వ్యవహరిస్తానని చెప్పా. పోలీసు కేసులు పెడతానని హెచ్చరించా. వ్యాపారులు రైతుల నుంచి డబ్బులు తీసుకుంటున్న విషయం నాకు తెలియదు. ఫోన్‌పేలు, అకౌంట్‌ల ఆధారంగా పరిశీలించాల్సి ఉంటుంది. నాకు వేలం ప్రక్రియ చూసుకునే సరికే సరిపోతున్నది. వందలాది మందితో జరిగే వ్యవహారంలో కొన్ని లోటుపాట్లు సహజమే. మిగతా విషయాలు నా దృష్టికి రాలేదు.

మత్తుకు చిత్తు

(5వ పేజీ తరువాయి)

ఉన్నత విద్య చదువుతున్న విద్యార్థులు ఎక్కువగా దారితప్పడం గమనార్హం. ఇందుకు ఇటీవల బాపట్ల జిల్లా అద్దంకిలో పట్టుబడ్డ ఇంజనీరింగ్ విద్యార్థులే ఉదాహరణ. ఫైనలియర్ చదువుతున్న వారు మోటారు సైకిళ్ల దొంగలుగా మారడం ఆలోచించాల్సిన విషయం. అలాగే మద్యం తాగి వాహనాలు నడుపుతూ ఆరు నెలల్లో 35మంది విద్యార్థులు పోలీసులకు పట్టుబడ్డారు. అలాగే మైనర్లు గంజాయి విక్రయాలు చేస్తూ దొరికిన ఘటనలు అనేకం ఉన్నాయి. ఇవన్నీ ఆందోళన కలిగించే అంశాలు. కాగా యువతపై సోషల్ మీడియా ప్రభావం అధికంగా కనిపిస్తోంది. చెడు వ్యసనాలకు బానిసలుగా మారేందుకు బాటలు వేస్తోంది.

యూట్యూబ్ చూసి దొంగలుగా మారారు

వివిధ ప్రాంతాలకు చెందిన ఏడుగురు విద్యార్థులు ఒంగోలులో అద్దె రూంలో ఉంటూ ఓ ప్రైవేటు కాలేజీలో ఇంజనీరింగ్ చదువుతున్నారు. మరో ఆరునెలల్లో బీటెక్ పట్టా చేతికి అందుతుంది. అయితే చెడు అలవాట్లకు బానిసలయ్యారు. వ్యసనాలకు, విలాసాలకు డబ్బు అవసరం పెరిగింది. దీంతో సులువుగా డబ్బు సంపాదించడం ఎలా అనే అంశంపై యూట్యూబ్‌లో వెతికారు. బుల్లెట్ మోటార్ సైకిల్‌ను తాళం లేకుండా ఎలా నడపాలి అనే అంశం వారిని బాగా ఆకర్షించింది. దీంతో దొంగతనాల బాట పట్టారు. సునాయాసంగా తాళాలు వేసి ఉన్న బుల్లెట్లు దొంగిలించడం ప్రారంభించారు. అంతే బాపట్ల జిల్లా అద్దంకి ప్రాంతాన్ని దొంగతనాలకు అనువుగా ఎంచుకున్నారు. బాపట్ల, పల్నాడు జిల్లాల్లో 16 బైకులను ఎత్తుకెళ్లారు. పోలీసులకు పట్టుబడి జైలు పాలయ్యారు.

మద్యం సేవించి వాహనాలు నడుపుతూ..

ఆరు నెలలో 35మంది విద్యార్థులు జిల్లావ్యాప్తంగా మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడ్డారు. ఇంకా అనేకమంది ప్రమాదాలకు గురయ్యారు. అలాగే పోలీసులకు దొరకకుండా అనేకమంది మద్యం మత్తులో బైక్‌లపై చక్కర్లు కొడుతున్న వారు ఉన్నారు. అంతేకాదు మద్యం మత్తులో ఘర్షణలకు దిగి జైళ్లకు వెళ్ళిన వారూ ఉన్నారు.

గంజాయి విక్రయాల్లో విద్యార్థులు

గంజాయి మత్తుకు అలవాటు పడిన విద్యార్థులు విక్రయదారులుగానూ మారుతున్నారు. ఇటీవల జిల్లాలో ఎక్సైజ్ టాస్క్‌ఫోర్సు దాడుల్లో గిద్దలూరు ప్రాంతంలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థి గంజాయి విక్రయిస్తూ పట్టుపడ్డాడు. ఒంగోలులో ఓ హాస్టల్ విద్యార్థి గంజాయి అమ్ముతూ పట్టుబడ్డాడు. పొదిలి ప్రాంతానికి చెందిన ఆ విద్యార్థి ఉన్నత విద్యను అభ్యసించేందుకు ఒంగోలు వచ్చి హాస్టల్‌లో ఉంటూ చెడు వ్యసనాలకు బానిసయ్యాడు.

నియంత్రణకు ఈగల్ టీంల ఏర్పాటు : ఎస్పీ దామోదర్

మత్తు పదార్థాల విక్రయాలను నియంత్రించేందుకు జిల్లాలో ఈగల్ టీంలను ఏర్పాటు చేశాం. గంజాయి, మాదక ద్రవ్యాలను అరికట్టేందుకు అనేక చర్యలు తీసుకున్నాం. ఇప్పటికి 42 కేసులు నమోదు చేసి 250 మందిని అరెస్టు చేశాం. కళాశాలల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి డ్రగ్స్ వలన కలిగే దుష్పరిణామాలను వివరిస్తున్నాం. విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా ఉండాలి. అందుకు కళాశాల యాజమాన్యం, తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి.



నూతనంగా నిర్మించిన కూరగాయల మార్కెట్

ఆరేళ్ల తరువాత ఆయనే పూర్తి చేశారు!

- మంత్రి స్వామి చొరవతో రూ.47 లక్షలతో కూరగాయల మార్కెట్ నిర్మాణం
- గత టీడీపీ ప్రభుత్వంలోనే నిధులు మంజూరు
- వైసీపీ ఐదేళ్ల పాలనలో పట్టించుకోని వైనం
- ఇప్పుడు పూర్తికావడంతో చిరువ్యాపారుల హర్షం

సింగరాయకొండ, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో ఆరేళ్ల క్రితం సింగరాయకొండలో కూరగాయల మార్కెట్ నిర్మాణానికి అప్పటి కొండపి ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి శ్రీకారం చుట్టారు. రూ.50 లక్షల నిధులు కూడా మంజూరు చేయించారు. 2019 సార్వత్రిక ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో అప్పట్లో పనులు ప్రారంభించలేకపోయారు. ఆతరువాత వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. మార్కెట్ నిర్మాణానికి నిధులున్నా వైసీపీ నాయకులు పట్టించుకున్న పాపానపోలేదు. దీంతో నిర్మాణం అటకెక్కింది.

● ఏడాదిలోనే పూర్తి

గత సార్వత్రిక ఎన్నికల సమయంలో ప్రచారం సందర్భంగా ట్రంకురోడ్డుకు ఇరువైపులా కూరగాయలు అమ్ముకునే వారితో ఎమ్మెల్యే స్వామి మాట్లాడారు. వర్షాల సమయంలో రోడ్డుపై కూరగాయలు అమ్ముకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని చిరువ్యాపారులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్వామి స్పందిస్తూ తాము అధికారంలోకి వచ్చిన వెంటనే నూతన కూరగాయల మార్కెట్‌ను నిర్మిస్తామని హామీ ఇచ్చారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత చేపల మార్కెట్ ఎదుట కూరగాయల మార్కెట్ నిర్మాణానికి రూరల్ అర్బన్ పథకం కింద రూ.47 లక్షలు మంజూరు చేయించారు. ఆతరువాత టీడీపీ సీనియర్ నేత షేక్ సంధానీబాషా పనులను ప్రారంభించి 12 గదులతో కూడిన మార్కెట్ నిర్మాణాన్ని పూర్తి చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే మరో ఎన్నికల హామీని మంత్రి డాక్టర్ స్వామి నెరవేర్చి విశ్వసనీయతను చాటుకోవడంతో చిరువ్యాపారులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పేదరికం లేని సమాజమే ధ్యేయం

- మారిటైం బోర్డ్ చైర్మన్ సత్య

మర్రిపూడి, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : పేదరికం లేని సమాజ నిర్మాణమే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పనిచేస్తున్నారని రాష్ట్ర మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఆయన శుక్రవారం మండలంలోని చిమట, శివరాయునిపేట గ్రామాల్లో పర్యటించారు. ఇంటింటికీ తిరిగి టీడీపీ కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రభుత్వం సాధించిన ప్రగతిని వివరించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా లేనప్పటికీ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రాధాన్యతను ఇస్తున్నట్లు తెలిపారు. పేద, ధనిక అనే తారతమ్యాన్ని నిర్మూలించేందుకు పీ4 విధానాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రూపొందించారని చెప్పారు. ప్రతి గ్రామంలో సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పలువురు వివిధ సమస్యలను సత్య దృష్టికి తెచ్చారు. మంత్రి స్వామి, తాను కలిసి సమస్యల పరిష్కారానికి వీలైనంత త్వరలో చర్యలు తీసుకుంటామని గ్రామస్థులకు సత్య హామీ ఇచ్చారు.



చిమటలో కరపత్రాలను పంపిణీ చేస్తున్న మారిటైం బోర్డు చైర్మన్ సత్య



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ నారాయణ

వ్యవసాయంలో డ్రోన్ల వినియోగంతో మహిళలకు జీవనోపాధి

- జిల్లాలో 200 మందికి డ్రోన్లు ఇవ్వాలన్నదే లక్ష్యం
- 80 శాతం సబ్సిడీతో పొదుపు సంఘాల మహిళలకు డ్రోన్లు
- ఆరోగ్యం.. ఆదాయమే లక్ష్యంగా ప్రభుత్వం ముందడుగు

ఒంగోలు నగరం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో డ్రోన్ల వినియోగాన్ని పెంచి రైతుల ఆరోగ్యాన్ని కాపాడటమే కాకుండా పొదుపు సంఘాల మహిళల జీవనోపాదులను పెంచే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పొదుపు సంఘాల మహిళలకు 80 శాతం సబ్సిడీపై డ్రోన్లను అందించే కార్యక్రమాన్ని వేగవంతం చేసింది. రూ.10 లక్షల విలువైన డ్రోన్ల యూనిట్‌ను రూ.80 శాతం సబ్సిడీపై పొదుపు సంఘాల మహిళలకు అందించనుంది. జిల్లాలో గత ఏడాది ఆరుగురికి ఈ డ్రోన్లను అందించగా వారు ప్రతినెలా గణనీయ్యమైన ఆదాయాన్ని పొందుతున్నారు. దీంతో జిల్లాలోని 200 మంది మహిళలకు ఈ డ్రోన్ల యూనిట్లను అందించాలని లక్ష్యంగా పెట్టుకుని వెలుగు అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలను పంపించారు. గత ఏడాది ఈ డ్రోన్లను పొందిన జిల్లాలోని ఆరుగురితోపాటు బాపట్ల, పల్నాడు, గుంటూరు జిల్లాలో డ్రోన్లను తీసుకున్న 17 మంది పొదుపు సంఘల మహిళలకు శుక్రవారం నాడు స్థానిక వెలుగు టీటీడీసీ భవనంలో సమావేశం ఏర్పాటు చేశారు. వీరి అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. ఏడాదికి రూ.లక్షన్నరకుపైగానే ఆదాయం పొందుతున్నట్టు పేర్కొన్నారు. డ్రోన్ల వినియోగంలో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలను పరిష్కరించే దిశగా కోరమండల్ సంస్థ టెక్నికల్ సిబ్బంది కూడా ఈ సమావేశంలో పాల్గొని మహిళలకు వివరించారు. ఈ సందర్భంగా వెలుగు జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ నారాయణ మహిళలను ఉద్దేశించి మాట్లాడారు. త్వరలోనే మరో 23 మంది మహిళలకు ఈ యూనిట్లను అందజేయబోతున్నామని పీడీ తెలిపారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలోపు 200ల మందికి ఈ యూనిట్లును అందజేసి జిల్లాలో వ్యవసాయ రంగంలో పొదుపు సంఘాల మహిళల పాత్రను కీలకం చేయబోతున్నామని ఆయన అన్నారు.

పరిమితికి మించి బరువు రవాణా చేస్తే కఠిన చర్యలు

- జాయింట్ కమిషనర్ శివరామప్రసాద్

ఒంగోలు క్రైం, జూలై25(ఆంధ్రజ్యోతి): పరిమితికి మించి బరువు రవాణా చేస్తే కఠినంగా చర్యలు తీసుకుటామని రవాణాశాఖ జాయింట్ కమిషనర్ ఎస్.శివరామప్రసాద్ హెచ్చరించారు. శుక్రవారం ఒంగోలులోని రవాణాశాఖ కార్యాలయంలో జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ చీమకుర్తి ప్రాంతాం నుంచి పరిమితికి మించి బరువు రవాణా చేస్తున్నారని, అందుకు సంబంధించి రవాణాశాఖ చర్యలు చేపట్టిందని చెప్పారు. అధిక లోడు రవాణా చేయడం వల్ల ప్రజల భద్రతతో పాటుగా రోడ్లు దెబ్బతింటాయన్నారు. అందుకోసం నిరంతర నిఘా ఏర్పాటు చేసి కేసులు నమోదు చేస్తామని తెలిపారు. జిల్లా నుంచి రవాణాశాఖకు ఇప్పటికి 80 శాతం ఆదాయం వచ్చిందని, కేసులు నమోదు చేయడంలో లక్ష్యానికి చేరువుగా ఉన్నా వసూలు చేయడంలో కాస్త వెనుకబడి ఉన్నారని పేర్కొన్నారు. వాహనాలకు సంబంధించి లైఫ్ ట్యాక్స్ రూ.3 కోట్లు పెండింగ్‌లో ఉందన్నారు. డీలర్ల వద్ద నుంచి పెండింగ్‌లో ఉన్న లైఫ్ ట్యాక్స్ వసూలు చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని చెప్పారు. అదేవిధగా రహదారులపై బ్లాక్ స్పాట్స్ వద్ద తగిన చర్యలు తీసుకుని ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించినట్లు వెల్లడించారు. సిటిజన్స్ నుంచి వచ్చిన గ్రీవెన్స్ పెండింగ్ లేకుండా పరిష్కరిచేలా ఆదేశించామన్నారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ ఆర్.సుశీల, మార్కాపురం ఆర్టీవో వై.శ్రీచందన, ఎంవీఐ కిరణ్‌ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబాల సాధికారతే లక్ష్యం

- సీఎం చంద్రబాబు

ఒంగోలు(రూరల్), జూలై25(ఆంధ్రజ్యోతి): పేదరిక కుటుంబాల సాధికారితే ప్రభుత్వ లక్ష్యమని సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. శుక్రవారం రాజధాని అమరావతి నుంచి ఆయన జిల్లా కలెక్టర్లు, ప్రజాప్రతినిధులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. 2029 నాటికి రాష్ట్రంలో పేదరికం లేని సమాజం ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం పని చేస్తుందన్నారు. గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని ఆప్రాంతానికి చెందిన ఎన్ఆర్ఐలు, పారిశ్రామికవేత్తలు స్థానిక బంగారుకుటుంబాలను దత్తత తీసుకునేలా ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. ఆగస్టు 15లోపు 15లక్షల మంది బంగారుకుటుంబాలను మార్గదర్శకులు దత్తత తీసుకునేలా చేయాలని ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 5,74,811 బంగారుకుటుంబాలను దత్తత తీసుకున్నట్లు వివరించారు.

కొండపి నియోజకవర్గంలో కొత్తగా 9 పోలింగ్ కేంద్రాలు

కొండపి, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో కొత్తగా 9 పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపినట్లు ఈఆర్వో ఎ.కుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులు, తహసీల్దార్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో ప్రస్తుతం 283 పోలింగ్ కేంద్రాలుండగా పెరిగిన వాటితో కలిపి 292 అవుతాయన్నారు. వసతులు సరిగా లేని ఆరు కేంద్రాలను ప్రస్తుతం ఉన్న ఆవరణలో వసతులున్న గదుల్లోకి మారుస్తూ ప్రతిపాదనలు పంపామన్నారు. 1,200 మంది ఓటర్లకు మించి ఉన్న వాటిని పది పోలింగ్ కేంద్రాలకు సర్దుబాటు చేశామన్నారు. నియోజకవర్గంలో ఓటర్లకు 98శాతం ఆధార్ అనుసంధానం పూర్తయిందని చెప్పారు. పార్టీల నాయకులు బూత్ లెవల్ ఏజెంట్లను నియమించుకొని పేర్లు ఇవ్వాలని ఈఆర్వో కోరారు. సమావేశంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గొర్రెపాటి రామయ్య చౌదరి, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త కనపర్తి మనోజ్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీపతి సతీష్, ఎలక్షన్ డీటీ బ్రహ్మయ్య, తహసీల్దార్లు ఎస్.శ్రీనివాసరావు, పి.మురళి, ఆంజనేయులు, జనార్దన్‌రావు, పుల్లారావు పాల్గొన్నారు.

రైతుల స్థితిగతులపై సమగ్ర సమాచారం సేకరించండి

- పశుసంవర్ధక శాఖ డీడీ డాక్టర్ జగత్‌శ్రీనివాసులు



సర్వేను పరిశీలిస్తున్న పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు

సింగరాయకొండ, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : రైతుల స్థితిగతులపై సమగ్ర సమాచారం సేకరించాలని పశుసంవర్ధక శాఖ డీడీ డాక్టర్ జగత్ శ్రీనివాసులు ఆదేశించారు. మండలంలోని కలికివాయి గ్రామంలో నిర్వహిస్తున్న బ్లాంకెట్ సర్వేను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు ఉన్న పశువులు, జీవాలు, సాగు భూమి, ఆదాయ మార్గాలు, వారికి ప్రభుత్వం అందజేస్తున్న పథకాల వివరాలను నమోదు చేయాలని ఎన్యూమరేటర్లకు సూచించారు. ప్రభుత్వం రాయితీపై అందజేస్తున్న జొన్నలు, దాణా, గడ్డి కత్తిరించే యంత్రాలను రైతులు పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో కొండపి ఏడీ మందలపు రవికుమార్, సింగరాయకొండ పశువైద్యుడు నగళ్ల హజరత్, సిబ్బంది పాల్గొన్నారు.

బ్రిడ్జి, రోడ్ల నిర్మాణానికి రూ.34 కోట్లు మంజూరు

- సీఎం, డిప్యూటీ సీఎంలకు మంత్రి స్వామి కృతజ్ఞతలు

టంగుటూరు (కొండపి), జూలై25 (ఆంధ్రజ్యోతి): రానున్న నాలుగేళ్లలో కొండపి నియోజకవర్గాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి శుక్రవారం తన కార్యాలయం నుంచి విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ప్రధానమైన బ్రిడ్జి, రోడ్ల నిర్మాణానికి రూ.34 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. పాలేరు వాగుపై ముప్పాళ్ల-పైడిపాడు గ్రామాల మధ్యన రోడ్డు కమ్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.28 కోట్లు, టంగుటూరు- పాకల రోడ్డు నిర్మాణానికి రూ.6 కోట్లు కలిపి మొత్తం రూ.34 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందని వివరించారు. నిధులు మంజూరు చేసినందుకు సీఎం చంద్రబాబు నాయుడికి, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు మంత్రి స్వామి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రాభివృద్ధికి సుస్థిర ప్రభుత్వం కొనసాగాలని, కూటమి ప్రభుత్వంలోనే రాష్ట్రం, కొండపి నియోజకవర్గంలో సుస్థిర అభివృద్ధి చూపుతామని స్వామి పేర్కొన్నారు.

విత్తన దుకాణాలలో విజిలెన్స్ తనిఖీలు

- 11.4 మెట్రిక్ టన్నుల ఎరువులు, మిరప విత్తనాలు సీజ్

పెద్దదోర్నాల, జూలై 25(ఆంధ్రజ్యోతి): స్థానిక విత్తనాలు, ఎరువుల దుకాణాలలో విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారులు శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఒంగోలుకు చెందిన విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంటు సీఐ సీహెచ్ రవిబాబు, కే శివనాగప్రసాద్ తనిఖీలు చేయగా అనుమతులు లేని రూ.2,04,300 విలువ చేసే 4.02కేజీ మిరప విత్తనాల తోపాటు 11.4మెట్రిక్ టన్నుల ఎరువులు ఉన్నట్లు గుర్తించారు. స్టాక్ రిజిస్టరులో ఉన్న సరుకుకు వ్యత్యాసం ఉన్నట్లు కనుగొన్నారు. ఆ సరుకు అమ్మకాలను నిలిపివేసినట్లు వ్యవ సాయాధికారి జవహర లాల్ నాయక్ చెప్పారు.

మాతృమరణాలను నివారించాలి : డీఎంహెచ్‌వో

ఒంగోలు కలెక్టరేట్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మాతృమరణాలు జరగకుండా అన్ని ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో డాక్టర్ టి.వెంకటేశ్వర్లు ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో శుక్రవారం మాతృమరణాలపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రమాద సంకేతాలు ఉన్న గర్భిణులను సకాలంలో వైద్యసేవలు అందించాలని, ఆ వివరాలను ఆర్‌సీహెచ్ యాప్‌లో నమోదు చేయాలన్నారు. ప్రతినెలా 10వతేదీన జరిగే ప్రధానమంత్రి మాతృవందన యోజన కార్యక్రమానికి తీసుకువచ్చి వారికి అన్ని రకాల వైద్యపరీక్షలు, స్కాన్ చేయించి వారి కుటుంబసభ్యులకు తెలియజేయాలని సూచించారు. డాక్టర్ సంధ్యారాణి మాట్లాడారు.

బినామీలదే పెత్తనం

(5వ పేజీ తరువాయి)

చేసుకోలేదని, ఎస్సీ రిజర్వేషన్‌కు కేటాయించిన ఒక షాపు ఖాళీగా ఉన్నట్లు గుర్తించారు. నివేదిక తయారుచేసి పంపారు.

అవకతవకల లెక్క ఇదీ...!

మాంసం అమ్మకాల కోసం మొత్తం 25 షాపులు కేటాయించగా ఒక దుకాణం ఖాళీగా ఉంది. మిగిలిన షాపుల్లో అందరూ పాటలో దక్కించుకున్న వ్యాపారులే ఉన్నారు.

పూల వ్యాపారుల కోసం మొత్తం 28 షాపులు కేటాయించారు. వాటిలో రెండు ఖాళీగాను, ఐదింటిలో బినామీలు ఉన్నట్లు తేల్చారు. మిగిలిన షాపుల్లో ఎవరికైతే కేటాయించారో వారు వ్యాపారాలు సాగిస్తున్నారు.

హోల్‌సేల్ కూరగాయల వ్యాపారుల కోసం 69 దుకాణాలు కేటాయించారు. వాటితో తొమ్మిది మూసివేసి వాడుకలో లేకపోగా ఏడు దుకాణాల్లో బినామీలు ఉన్నారు.

రిటైల్ కూరగాయల వ్యాపారులకు 123 షాపులను కేటాయించగా 30 పూర్తిగా వినియోగంలో లేకుండా మూసివేసి ఉన్నాయి. ఒక షాపు ఎస్సీలకు కేటాయించగా ప్రస్తుతం ఎవరూ తీసుకోలేదు. మొత్తం 15 మంది బినామీలు ఉన్నట్లుగా గుర్తించారు. మిగిన షాపుల్లో వేలంలో దక్కించుకున్న వారే కొనసాగుతున్నారు.

పండ్ల వ్యాపారులకు 38 షాపులు కేటాయించగా నాలిగింటిలో బినామీలు ఉన్నట్లుగా విచారణలో తేలింది.

మధ్యాహ్న భోజనంలో అవకతవకలు

(5వ పేజీ తరువాయి)

రోజూ హైస్కూలులో 800 మంది విద్యార్థినులు మధ్యాహ్న భోజనం చేస్తారు. వీరికి ఒక్కొక్కరికి రోజుకు 150 గ్రాముల చొప్పున బియ్యం ఇవ్వాల్సి ఉండగా మొత్తం 70 నుంచి 80 కేజీలు మాత్రమే హెచ్ఎం ఇస్తున్నారు. ప్రతి విద్యార్థికీ ఒక గుడ్డు చొప్పున 800 గుడ్లను ఇవ్వాల్సి ఉండగా కేవలం 400 గుడ్లు మాత్రమే ఇస్తున్నారు. విద్యార్థినులకు ఇవ్వాల్సిన చిక్కీలలో కూడా కోత పెట్టారు. పాఠశాలలో బియ్యం నిల్వల్లో కూడా భారీగా తేడాలు ఉన్నాయి. మధ్యాహ్నం భోజన స్టాక్ రిజిస్టర్ ప్రకారం 2510.50 కేజీల బియ్యం నిల్వ ఉండాల్సి ఉండగా 3,725 కేజీలు ఉన్నాయి. రిజిస్టర్‌లో 238 గుడ్లు నిల్వ ఉన్నట్లు పేర్కొనగా అక్కడ 70 ఉంటాన్ని గుర్తించారు. చిక్కీలు కూడా 986కి గాను అదనంగా 889 ఉన్నాయి. మధ్యాహ్న భోజనంకు సంబంధించిన స్టాక్ బియ్యం, గుడ్లు, చిక్కీలు విక్రయించగా వచ్చిన రూ.2 లక్షలను తన వ్యక్తిగత బ్యాంకు ఖాతాలో జమ చేశారు. మధ్యాహ్న భోజన బియ్యం స్టాక్ విక్రయించినట్లు హెచ్ఎం స్వల్పంగా అంగీకరించినందున సీసీఏ రూల్స్ ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆర్జేడీకి డైరెక్టర్ లేఖ రాశారు. హెచ్ఎం విధి నిర్వహణలో బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడంపై డైరెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే మధ్యాహ్నం భోజనంలో అవకతవకలు, అక్రమాలు ఈనెల 14న వెలుగులోకి రాగా ఇప్పటి వరకు ఎటువంటి చర్యలూ లేవు.

భారీగా నోబిడ్‌లు

(5వ పేజీ తరువాయి)

కొనుగోలు చేశారు. వివిధ కారణాలతో 3656 బేళ్లను తిరస్కరించారు. అందులో 3,032 బేళ్లు నోబిడ్ అయ్యాయి. అంటే ఆ బేళ్లకు పొగాకు బోర్డు అధికారులు సూచించిన ధరను ఇచ్చేందుకు బయ్యర్లు ముందుకు రాక పోవడంతో నోబిడ్‌లుగా ప్రకటించారు. కనిష్ఠ ధరను కిలో రూ.150కి తగ్గించినా పలు రకాల లోగ్రేడ్ బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేయకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. అలా శుక్రవారం మార్కెట్‌లో అమ్మకానికి వచ్చిన బేళ్లలో సగటున 32.11శాతం నోబిడ్ అయ్యాయి. అదే సమయంలో కొన్ని వేలం కేంద్రాలలో నోబిడ్‌లు 40శాతానికి పైగా ఉన్నాయి. ఎస్ఎల్ఎస్ రీజియన్ పరిధిలోని కందుకూరు-2 వేలం కేంద్రంలో 41.30శాతం బేళ్లు నోబిడ్ కాగా, ఎస్‌బీఎస్ రీజియన్‌లోని కొండపి వేలం కేంద్రంలో 40.38శాతం తిరస్కరణ జరిగాయి. కందుకూరు-1 కేంద్రంలో 36.73శాతం, డీసీపల్లిలో 34.55శాతం తిరస్కరించారు. ఇలా మళ్లీ రోజువారీ నోబిడ్‌లు భారీగా పెరుగుతుండటంపై రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.



వీర మరణం పొందిన సైనికుల జ్ఞాపకార్థం బేస్తవారపేట జంక్షన్‌లో నిర్మించిన స్థూపం

సెల్యూట్ సైనికుడా!

- గిద్దలూరు నియోజకవర్గం నుంచి ఎక్కువమంది సేవలు
- మాజీ సైనికులు కూడా ఈ ప్రాంతం నుంచే అధికం
- నేడే కార్గిల్ విజయ్ దివాస్

దేశ రక్షణలో మరీ ముఖ్యంగా ఆర్మీలో అత్యధిక సంఖ్యలో పని చేసిన కుటుంబాలు గిద్దలూరు నియోజకవర్గంలోనే ఉన్నాయి. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలతో పోలిస్తే ఒక్క గిద్దలూరు నియోజకవర్గంలోనే సైనిక, మాజీ సైనిక కుటుంబాలు 15వేలకుపైగా ఉన్నాయి. రాచర్ల, అర్థవీడు, కొమరోలు, గిద్దలూరు, బేస్తవారపేట, కంభం మండలాలన్నింటిలో సైనిక, మాజీ సైనిక కుటుంబాలు ఉన్నాయి. కొన్ని గ్రామాల్లో అయితే ఇంటికొక సైనిక, మాజీ సైనిక కుటుంబాలు ఉన్నాయి. అనేక యుద్ధాల్లో, ఇతర ప్రమాదాలలో కొందరు ప్రాణాలు కోల్పోగా మరికొందరు గాయపడుతున్నప్పటికీ ఈ ప్రాంత యువత ఏమాత్రం భయపడకుండా ఆర్మీలో చేరి ప్రాణాలకు తెగించి శత్రువులతో పోరాడుతూ దేశం కోసం మేము అంటూ ముందుకు వెళుతున్నారు. ఈ క్రమంలో లధక్‌లోని ఉత్తర కార్గిల్ జిల్లాలో గల పర్వత శిఖరాలపై 1999లో కార్గిల్ యుద్ధం జరిగింది. జమ్ముకశ్మీర్‌లోని కార్గిల్ సెక్టార్‌లో శత్రువుల ఆక్రమిత స్థానాలను విజయవంతంగా తిరిగి స్వాధీనం చేసుకున్న భారత సైనికుల ధైర్యం, త్యాగానికి గుర్తుగా ఏటా జూలై 26వ తేదీన కార్గిల్ విజయ్ దివాస్ కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తోంది. కార్గిల్‌లో ఆర్మీ చేసిన త్యాగాలను గౌరవిస్తోంది. మన జిల్లాకు చెందిన సైనికులు యుద్ధంలో పాల్గొన్నారు. ఆ జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు.

- గిద్దలూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి)

బేస్తవారపేట జంక్షన్‌లో స్థూపం

వివిధ యుద్ధాల్లో పాల్గొని వీరమరణం పొందిన సైనికులకు గుర్తుగా బేస్తవారపేట జంక్షన్‌లో చాలా ఏళ్లక్రితమే స్థూపం ఏర్పాటు చేశారు. అయితే ఆప్రాంతంలో ఓవర్ బ్రిడ్జి రావడంతో తిరిగి బ్రిడ్జి కింద కొత్తగా స్థూపం నిర్మాణ దశలో ఉంది. అత్యధికంగా సైనికులు, మాజీ సైనికులు ఉండడంతో గిద్దలూరులో వారి కోసం క్యాంటీన్‌ను, ఆసుపత్రిని కూడా ఏర్పాటు చేశారు. తక్కువ ధరలో అనేక రకాల వస్తువులు సైనిక, మాజీ సైనిక కుటుంబీలకు క్యాంటీన్‌లో అమ్ముతారు. ఆరోగ్య సంరక్షణ కోసం ప్రత్యేకంగా ఆసుపత్రిని ఏర్పాటు చేశారు. క్యాంటీన్, ఆసుపత్రి అద్దె భవనాలలో నడుస్తుండగా సొంత భవనాలు ఏర్పాటు చేయాలని, దానికి ప్రభుత్వాలు స్థలం కేటాయించాలని మాజీ సైనికులు కోరుతున్నారు. సైనిక స్కూల్‌ను కూడా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

దేశసేవలో జాన్సన్

గిద్దలూరు పట్టణంలోని 7వ వార్డులో నివాసం ఉంటున్న రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి మందా జాన్సన్ దేశసేవలో తనదైన ముద్ర వేసుకున్నారు. 1983లో ఆర్మీలో చేరిన జాన్సన్ 1984లో అమృత్‌సర్ బ్లూస్టార్ ఆపరేషన్‌లో పాల్గొన్నారు. 1988 శ్రీలంక ఆపరేషన్, 1999 జమ్మూకాశ్మీర్‌లో జరిగిన ఆపరేషన్‌లో పాల్గొన్నారు. ఈ ఆపరేషన్‌లో నలుగురు జవాన్లు మృతిచెందగా పలువురు గాయపడ్డారు. జాన్సన్ సైతం గాయపడి కోలుకున్నారు. జాన్సన్ దేశం కోసం చేసిన సేవలను గుర్తించిన ప్రభుత్వం గత కార్గిల్ డే రోజు ఒంగోలులో కలెక్టర్ ఘనంగా సన్మానించి ఆయన సేవలను కొనియాడింది.

కార్గిల్ యుద్ధంలో పని చేశా

- పిక్కిలి వెంకటేశ్వర్లు, గిద్దలూరు



గిద్దలూరుకు చెందిన పిక్కిలి వెంకటేశ్వర్లు ఆర్మీలో చేరి సుబేదార్‌గా ఉన్న సమయంలో కార్గిల్ యుద్ధం జరిగింది. అందులో వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఫిరంగులు పేల్చారు. కంప్యూటర్ ద్వారా శత్రువులపైకి మిసైల్స్ వదిలారు. అప్పట్లో కాశ్మీర్‌లోని రాజోడి ఏరియాలో ఇండియాకు, పాకిస్థాన్‌కు మధ్య కంచె కూడా లేదని, ఆ తరువాత కంచె నిర్మించారని, పాకిస్థాన్ అణుబాంబులు వేసి వాటిని మధ్యలోనే ఆపగల మిసైల్స్ దేశం వద్ద ఉన్నాయని ఆనాటి జ్ఞాపకాలను పంచుకున్నారు.

అనేక యుద్ధాల్లో పాల్గొన్నా

- కెప్టెన్ జి.సి.అంకన్న



రాచర్ల మండలానికి చెందిన కెప్టెన్ జి.సి.అంకన్న అనేక యుద్ధాల్లో పాల్గొన్నారు. 1965, 1971, 1999 యుద్ధాల్లో పాల్గొన్నారు. పాకిస్థాన్ సైనికులకు, టెర్రరిస్టులకు అనేక సందర్భాలలో తమ సెక్టార్‌లోని మిగతా సైనికులతో కలిసి చుక్కలు చూపించామని, గుణపాఠాలు చెప్పామని గుర్తు చేసుకున్నారు. పాకిస్థాన్ వక్రబుద్ధి మాత్రం ఇప్పటికీ మార్చుకోవడం లేదని, యుద్ధం జరిగిన ప్రతిసారీ వారు ఓడిపోతున్నప్పటికీ వారిలో మార్పు రావడంలేదని చెప్పారు.

మేమున్నామనీ.. మీకేం కాదనీ..

- ప్రభుత్వ పిలుపునకు స్పందిస్తున్న అధికారులు
- అనాథలను అక్కున చేర్చుకుంటున్న వైనం
- పీ4 పిలుపుతో పలువురు దత్తత
- ఒక్కొక్క బాలికది ఒక్కో దీనగాథ

త్రిపురాంతకం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన పిలుపుతో ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో అనాథలను అక్కున చేర్చుకుని మేమున్నామని పలువురు అధికారులు భరోసా ఇస్తున్నారు. పీ4 పథకంలో భాగంగా స్వచ్ఛందంగా ముందుకు వస్తున్న కొందరు అధికారులు అనాథలనూ, పేదలవర్గాలనూ దత్తత తీసుకునే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా ఎర్రగొండపాలెం మండల విద్యాశాఖాధికారి ఆంజనేయులు స్థానిక కస్తూరిబాగాంధీ పాఠశాలలో ముగ్గురు బాలికలను దత్తత తీసుకున్నారు. ఎంపీడీవో శ్రీనివాసులు మెగా పేరెంట్స్ మీటింగ్ రోజు ముగ్గురు విద్యార్థులను దత్తత తీసుకుంటున్నట్లు ప్రకటించారు. వారు దత్తత తీసుకున్న విద్యార్థినుల కుటుంబ నేపథ్యం గురించి పలకరించిన ఆంధ్రజ్యోతికి ఒక్కొక్కరిది ఒక్కో దీనగాథగా కనిపించింది. కన్నవారు లేకుండా ఇప్పటివరకు కష్టాలను, కన్నీళ్లను దిగమింగి తోటి విద్యార్థుల్లో కలిసిపోయి ప్రభుత్వం కల్పిస్తున్న వసతులు వినియోగించుకుని చదువుకుంటున్నారు.

- ఎర్రగొండపాలెం మండలం పాలుట్లకు చెందిన శివరంజనిబాయి చిన్న వయస్సులోనే ఆమె తండ్రి పాముకాటుతో మరణించాడు. తల్లి మళ్లీ పెళ్లి చేసుకుని వెళ్లిపోయింది. అప్పటి నుంచి శివరంజనిబాయి నానమ్మ వద్ద ఉండి చదువుకుంటోంది. ఎర్రగొండపాలెంలోని కస్తూరిబాగాంధీ పాఠశాలలో విద్యాభ్యాసం కొనసాగిస్తోంది. కష్టాలను కన్నీళ్లను దిగమింగుతూ ఉన్న ఆ బాలికను దత్తత తీసుకున్న ఎంఈవో అవసరమైన వస్తువులను అందజేశారు.
- ఎర్రగొండపాలెం అంబేడ్కర్ నగర్‌కు చెందిన తేజస్వినీ తండ్రి ఆమె చిన్నతనంలోనే వదిలేసి వెళ్లిపోయాడు. ఆ దిగులుతో తల్లి కూడా ఆత్మహత్య చేసుకుని మరణించింది. ఒక్కతే కుమార్తెగా ఉన్న తేజస్విని ఒంటరైంది. అనాథగా మిగిలింది. ప్రస్తుతం కస్తూరిబాగాంధీ బాలికల పాఠశాలలో చదువుతోంది.
- గంగుపల్లి గ్రామానికి చెందిన హర్షిణి పుట్టిన కొద్ది రోజుల్లోనే తండ్రి పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లి కూడా కొంతకాలానికి క్యాన్సర్ బారిన పడి మరణించింది. హర్షిణి ఒంటరిగా మిగిలింది. తల్లిదండ్రులను కోల్పోయిన ఈ అమ్మాయి అనాథగా ఉండి కస్తూరిబాగాంధీ పాఠశాలలో చదువుకుంటోంది.

ఈ ముగ్గురు కూడా ఒంటరివారే. ఎవరికివారు ఒక్కరే సంతానం. ఇలాంటి వారిని దత్తత తీసుకుని వారికి ఆసరాగా నిలిచిన ఎంఈవో ఆంజనేయులను ఆదర్శంగా తీసుకుని ఇంకా పలువురు ఇలాంటి వారికి చేయూత ఇవ్వాలని కలెక్టర్ అన్ని శాఖల అధికారులకు పిలుపునిచ్చారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్‌పై నిత్య పర్యవేక్షణ

- కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశం

ఒంగోలు కలెక్టరేట్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం నిర్దేశించిన కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్(కేపీఐ)పై జిల్లాస్థాయి అధికారులు నిరంతరం సమగ్రంగా పర్యవేక్షణ ఉంచాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. అయా అంశాలలో పురోగతిని కూడా ప్రతివారం సమీక్షిస్తామని కలెక్టర్ తెలిపారు. కేపీఐ లక్ష్యాల పురోగతిపై అవగాహన కల్పించేందుకు శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ సమావేశపు హాలులో అన్నిశాఖల జిల్లా అధికారుల ప్రత్యేక సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ప్లానింగ్ శాఖ నుంచి రాష్ట్ర స్థాయిలో అన్నిశాఖల ఉన్నతాధికారులకు శాఖల వారీగా లక్ష్యాలు వస్తాయని, వీటిని మండల స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లి ఆయా లక్ష్యాలను కాలానుగుణంగా (పీరియాడికల్) చేరుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేసేలా చూడాలన్నారు. మండల స్థాయి అధికారులు చేస్తున్న పనులు, సాధిస్తున్న పురోగతిపై జిల్లా స్థాయి ఉన్నతాధికారులు నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. ఆన్‌లైన్‌లో రియల్ టైమ్‌లో ఈ వివరాలు కనిపిస్తూ ఉంటాయన్నారు. వీటి ఆధారంగానే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులు సమీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. ఇంతటి ప్రాధాన్యం కలిగిన కేపీఐలపై అవగాహన పెంచుకొని వాటి పురోగతిపై జిల్లా స్థాయి అధికారులందరూ ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ, జిల్లా రెవెన్యూ అధికారి బి.చిన ఓబులేషుతో పాటు ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలి

ఒంగోలు విద్య, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : బల్లికురవ మండలం వల్లాపల్లి సీఏ ఎయిడెడ్ అప్పర్‌ప్రైమరీ స్కూలులో ఖాళీగా ఉన్న ఎస్జీటీ పోస్టు భర్తీకి ఈనెల 27న నిర్వహిస్తున్న పరీక్షకు అభ్యర్థులు హాల్ టిక్కెట్లను ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి కిరణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. నర్సరావుపేట ఇంజనీరింగ్ కళాశాలలో జరిగే పరీక్షకు అభ్యర్థులు మరో ప్రభుత్వ గుర్తింపు పత్రంతో హాజరు కావాలన్నారు. పరీక్ష రెండు సెషన్లలో జరుగుతుందని ఆయన తెలిపారు.

నెక్స్‌జెన్‌ను సైనిక్ స్కూలు సొసైటీతో అనుసంధానం చేయాలి

ఒంగోలు కలెక్టరేట్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులో ఉన్న నెక్స్‌జన్ ఇంటర్నేషనల్ స్కూలును సైనిక్‌స్కూలు సొసైటీతో అనుసంధానం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి కోరారు. శుక్రవారం ఢిల్లీలో కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను ఎంపీ మాగుంట కలిశారు. విద్యార్థుల ఉపయోగార్థం రక్షణ శాఖ ఆధ్వర్యంలోని సైనిక్ సొసైటీలో ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం కింద (పీపీపీ) తమ స్కూలును 2026-27 సంవత్సరానికి సైనిక్ స్కూలు సొసైటీలో అనుసంధానం చేయాలని ఆ స్కూలు చైర్మన్ డాక్టర్ కే మురళీధర్‌రెడ్డి లేఖ రాసిన విషయాన్ని కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన కేంద్రమంత్రి సైనిక స్కూలు సొసైటీలో అనుసంధానం చేసేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారని ఎంపీ మాగుంట ప్రకటనలో తెలిపారు.

గంజాయి ముఠా అరెస్టు

- పోలీసుల అదుపులో 27 మంది
- వీరిలో ఒకరు చైన్ స్నాచర్
- వివరాలు వెల్లడించిన ఒంగోలు డీఎస్పీ



ఒంగోలు క్రైం, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : ఒడిశా నుంచి గంజాయి తెచ్చి ఒంగోలులో విక్రయిస్తున్న ముఠాను తాలుకా పోలీసులు ముక్తినూతలపాడు శివారు ప్రాంతంలోని ధరణి వెంచెర్స్‌లో శుక్రవారం అరెస్టు చేశారు. వారి వద్ద కిలోన్నర గంజాయి 145 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠాలో మహిళల మెడల్లో బంగారం గొలుసులు లాక్కెళ్లే దొంగ కూడా ఉన్నట్లు తెలిపారు. స్థానిక ఎస్‌డీపీవో కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో వివరాలను డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు వెల్లడించారు. ఆయన చెప్పిన వివరాల ప్రకారం.. సింగరాయకొండ మండలం సోమరాజుపల్లికి చెందిన గుంజి నరసింహరావు, ఒంగోలు విరాట్ నగర్‌కు చెందిన బొంతల గోపాలకృష్ణ, సంతనూతలపాడు మండలం పేర్నమిట్టకు చెందిన ఏనుగంటి కార్తీక్, ఇస్లామ్‌పేటకు చెందిన షేక్ అల్తాఫ్, జయప్రకాష్ కాలనీకి చెందిన మోటా నవీన్, ఎండ్లూరుకు చెందిన ఆవుల మంద అంకబాబు, మహేంద్ర నగర్‌కు చెందిన ఏకాంబరం నరేంద్ర, వెంకటేశ్వరనగర్‌కు చెందిన తన్నీరు అఖిల్, సుజాతనగర్‌కు చెందిన కుందురు ప్రవీణ్, వడ్డిపాలెంనకు చెందిన షేక్ కృపారావులను అరెస్ట్ చేశారు. ఇంకా 17 మంది గంజాయి తాగేవారిని కూడా అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. ఈ ముఠా సభ్యుడిగా ఉన్న షేక్ కృపారావు గంజాయి విక్రయించడమే కాకుండా దొంగతనాలకు పాల్పడుతూ అనేకచోట్ల మహిళల మెడల్లో బంగారం చైన్లు లాక్కెళ్లాడు. అతని వద్ద 145 గ్రాముల బంగారం ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఇంకా ఈ ముఠాకు అనుబంధంగా గంజాయి సరఫరా చేసే ఒడిశాకు చెందిన నలుగురు పరారీలో ఉన్నారు. మిలన్ దాస్, శంకర్ పటేకర్, హడి, ప్రమోద్, మాణిక్‌లను అరెస్టు చేయాలి.

యువకుడిపై పెట్రోలు పోసి తగులపెట్టిన ఇద్దరు అరెస్టు

ముక్తినూతలపాడు శివారు ప్రాంతంలో ధరణి వెంచెర్‌లో గత నెల 6న అదే గ్రామానికి చెందిన బోడపాటి ద్రోణాచలంపై పెట్రోలు పోసి తగులబెట్టి హత్య చేసిన ఇరువురిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. ఒంగోలు మండలం ముక్తినూతలపాడుకు చెందిన పాతపాటి శ్రీహరి, కేశవరాజుకుంటకు చెందిన గందేటి గణేష్‌లను శుక్రవారం సాయంత్రం కొప్పోలు ఫ్లైఓవర్‌కి తూర్పున గల సర్వీస్ రోడ్డులో అనుమానాస్పదంగా ఉండగా అదుపులోకి తీసుకొని విచారించడంతో నేరం అంగీకరించారు. ద్రోణాచలం మేనకోడలను పాతపాటి శ్రీహరి వెంటపడుతూ వేధిస్తున్నాడు. ద్రోణాచలం పలుమార్లు శ్రీహరిని హెచ్చరించాడు. అయితే అలా హెచ్చరించడం అవమానంగా భావించిన శ్రీహరి ద్రోణాచలంను హత్య చేసేందుకు ప్రణాళిక రూపొందించుకున్నాడు. బెంగళూరులో కారు డ్రైవర్‌గా పనిచేస్తున్న ద్రోణాచలం ముక్తినూతలపాడుకు గత నెలలో వచ్చాడు. ద్రోణాచలంను మద్యం తాగేందుకు శ్రీహరి, గందేటి గణేష్‌లు పిలిచి ధరణి వెంచర్‌లో ఫూటుగా మద్యం తాపించారు. ఆ మత్తులో కింద పడిపోయిన ద్రోణాచలంపై పెట్రోలు పోసి తగులబెట్టారు. అప్పటి నుంచి పరారీలో ఉన్న ఇరువురినీ శుక్రవారం అరెస్టు చేశామని డీఎస్పీ చెప్పారు. ఈ సమావేశంలో ఒంగోలు తాలుకా సీఐ విజయకృష్ణ, ఒంగోలు టూటౌన్ సీఐ మేడా శ్రీనివాసరావు, ఎస్సైలు ఫణిభూషణ్, సాంబశివరావు, సిబ్బంది ఉన్నారు.

వైసీపీ నాయకుడి ఆక్రమిత భూమి స్వాధీనం

- హెచ్చరిక బోర్డు ఏర్పాటు
- నాటిన జామాయిల్ మొక్కల్లో కొన్నింటినే తొలగించిన రెవెన్యూ అధికారులు

తర్లుపాడు, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కలుజువ్వలపాడు హైవే పక్కన ఉన్న ప్రభుత్వ భూమిలో వైసీపీ నాయకుడు నాటిన జామాయిల్ మొక్కలను రెవెన్యూ అధికారులు శుక్రవారం పీకి మరలా ప్రభుత్వ భూమిగా హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. 'బరితెగించిన వైసీపీ నేత' అంటూ ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితం కావటంతో జిల్లా అధికారులు స్పందించారు. వెంటనే మొక్కలను తొలగించి మరలా హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్న వైసీపీ నాయకుడిపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ కేకే కిశోర్ కుమార్‌కు జిల్లా అధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి. ఈ మేరకు తహసీల్దార్, వీఆర్‌వో, సర్వేయర్‌లు ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకున్నారు. వాస్తవంగా వైసీపీ నాయకుడు 2.7 ఎకరాలను ఆక్రమించుకుని ఆ మొత్తంలో జామాయిల్ మొక్కలు నాటాడు. కానీ అధికారులు కొంతమేర మాత్రమే మొక్కలు పీకేయటంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మొక్కలన్నింటినీ వెంటనే తొలగించాలని కలుజువ్వలపాడు గ్రామస్థులు రెవెన్యూ అధికారులను నిలదీశారు. మొత్తం మొక్కలు తొలగించకపోతే సోమవారం కలెక్టర్‌ను కలిసేందుకు వెళ్తామని గ్రామస్థులు చెప్పారు.



ప్రభుత్వ భూమిగా మరలా ఏర్పాటు చేసిన బోర్డు

రెవెన్యూ అధికారులపై అనుమానాలు

కలుజువ్వలపాడు ఇలాకాలో ప్రభుత్వ భూమిలో వైసీపీ నాయకుడు మొక్కలు నాటుతున్న విషయం ముందుగానే తెలిసినప్పటికీ ఏమి తెలియనట్లు రెవెన్యూ అధికారులు వ్యవహరించటం పలు అనుమానాలకు తావిస్తోంది. వైసీపీ నాయకుడి నుంచి రెవెన్యూ అధికారులు భారీ స్థాయిలో ముందుగానే ముడుపులు తీసుకుని మొక్కలు నాటుకో అని చెప్పినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.

సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందించాలి

డీఆర్డీఏ అధికారులకు కేంద్ర బృందం సూచన

పొదిలి, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చర్యలు తీసుకోవాలని ఎన్ఎల్ఎం కేంద్ర బృందం సభ్యులు సూచించారు. శుక్రవారం మండలంలోని ఆముదాలపల్లి, మూగచింతల గ్రామాల్లో డీఆర్డీఏ, డ్వామా, ఉపాధిహామీ, హౌసింగ్ ఇతర శాఖల అధికారులతో కలిసి ఆ బృంద సభ్యులు పర్యటించారు. ఈసందర్భంగా కేంద్ర బృందం సభ్యులు ప్రభాస్‌శర్మ మాట్లాడుతూ పేద, నిరుపేద వ్యవస్థల నిర్మూలించడానికి ప్రభుత్వాలు ఎంతో కృషి చేస్తున్నాయని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ వివిధ రకాల పింఛన్లు, డ్వాక్రా గ్రూపు మహిళలకు రుణాలు ఇస్తున్నామన్నారు. గ్రూపు సభ్యులు తీసుకున్న రుణాన్ని వృథా చేసుకోకుండా వ్యాపారవేత్తలుగా ఎదగాలని సూచించారు. అందుకు డీఆర్‌డీఏ అధికారులు సిబ్బంది గ్రామాల్లో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి మహిళలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం డ్వాక్రాగ్రూపు సభ్యులు, వృద్ధాప్య, వితంతు, దివ్యాంగుల తదితర పింఛన్‌లు తీసుకుంటున్న వారితో సమావేశమయ్యారు. అనంతరం ఎన్ఆర్ఈజీఎస్ పనులను పరిశీలించారు. నీటికుంటలను ఏర్పాటు చేసేవిధంగా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎల్ఎం టీమ్ సభ్యులు నందలాల్ గుర్జార్, డీఆర్‌డీఏ, డ్వామా ఏపీడీలు లక్ష్మీరెడ్డి, బసవ సుబ్బరాజు, ఎంపీడీవో గుత్తా శోభన్‌బాబు, ఏపీవో మహాలక్ష్మి, ఏపీఎం గోపాలక్రిష్ణ, హౌసింగ్ ఏఈ వెంకటరెడ్డి, పంచాయతీరాజ్ ఏఈ రామక్రిష్ణ పాల్గొన్నారు.

అంతటా చెత్తశుద్ధి కరువు !

- వర్షాకాలం.. వెంటాడుతున్న వ్యాధుల భయం..
- మాటేసిన మలేరియా మహమ్మారి
- కనిపించని దోమలపై దండయాత్ర
- మొక్కుబడి పనులకే పరిమితం

ఒంగోలు కార్పొరేషన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాతో పట్టణ ప్రాంత ప్రజల్లో వ్యాధుల భయం వెంటాడుతుంది. పదిరోజులుగా పారిశుధ్య కార్మికులు సమ్మె చేయగా నాలుగు రోజుల క్రితం సమ్మె విరమించారు. కాగా మూడు రోజులైనా నేటికీ ఒంగోలు నగర వీధులు కంపు కొడుతున్నాయి. ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోగా, గత మూడు రోజులుగా కురుస్తున్న వానలకు చెత్త తడిసి కంపు కొడుతుంది. దీంతో పారిశుధ్యం అధ్వానంగా ఉండటంతో పాటు సీజనల్ వ్యాధులపై అందరిలోనూ ఆందోళన కనిపిస్తుంది. ప్రతిరోజూ పారిశుధ్య పనులు చేపట్టి, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటంలో నగరపాలక సంస్థ, మునిసిపాలిటీలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. వాతావరణంలో మార్పులతో వర్షాలు కురుస్తుండగా ప్రబలతున్న వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్న ఆదేశాలను శానిటరీఅధికారులు విస్మరించారు. చేస్తున్నారు.

వైరల్ ఫీవర్స్‌కు అనుకూల వాతావరణం

వర్షాకాలం అంటేనే వ్యాధుల భయం. దోమల వ్యాప్తికి అనుకూలమైన వాతావరణం కావడంతో మలేరియా భయం పట్టణ ప్రజలు వేధిస్తుంది. వార్డుల్లో పర్యటించి, నీటి నిల్వలు లేకుండా, ఇళ్ళమధ్య మురుగు కనిపించకుండా ఖాళీ స్థలాల్లో చెత్తచెదారం లేకుండా ప్రత్యేక ప్రణాళిక రూపొందించాల్సి ఉంది. అంతేగాకుండా ఈ సీజన్‌లో వ్యాధులపై అవగాహన ర్యాలీలు, విద్యార్థులకు చైతన్య కలిగించేలా కరపత్రాలు పంపిణీ, వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దృష్టి సారించాల్సి ఉండగా పట్టణ ప్రాంతాల్లోనూ, పురపాలక సంఘాల్లో అలాంటి వాతావరణం కనిపించడం లేదు. పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలి. ప్రతి రోజు కాలువల్లో మురుగు తొలగింపు, తడి చెత్త నిల్వ లేకుండా చూడాలి. ఖాళీ ప్రదేశాలలో, కాలువల్లో మురుగునీటిపై వ్యాపించే దోమలను లార్వా దశలోనే అంతం చేసేందుకు తగు చర్యలు తీసుకోవాల్సి ఉంది. మామూలు రోజుల్లో ఎలా ఉన్నప్పటికీ ఈ కాలంలో నీ టి నిల్వలపై, ఖాళీ స్థలాల్లో మురుగునీటిపై గంభూ షియా చేపలు విడుదల చేయాలి. వృద్ధి చెందని దోమ లను అంతం చేసేందుకు అబెట్, పైరిత్రిమ్, మలాథి యన్‌తో



మలేరియా జ్వరం వ్యాప్తి ఇలా...

మలేరియా జ్వరం అనేది చాపకింద నీరులా వ్యా పిస్తుంది. నాలుగు రకాలుగా ఉండే ఈ వ్యాధి అ నా ఫిలిస్ అనే దోమకాటుతో వస్తుంది. జూన్ నుంచి అక్టోబర్ వరకు మలేరియా బాధితులు ఎక్కువ. నాలుగు రకాలుగా ఉండే మలేరియా జ్వరంలో మొదటి ది ప్లాస్మోడియం వైవాక్స్ (పీవీ), ప్లాస్మోడియం ఫాల్సీ పారమ్ (పీఎఫ్), ప్లాస్మోడియం ఓవెల్, ప్లాస్మోడియం మలేరియా. వీటిలో అధికంగా సోకేది పీవీ, పీఎఫ్. ఇ వి సోకితే రోజు మార్చి రోజు చలిజ్వరం, తలనొప్పి, చెమటలు పట్టడం, ఒళ్ళునొప్పులు, రక్తహీనత కనిపిస్తాయి. ఈ జ్వరం సోకిన 10 నుంచి 15రోజుల్లో రక్తపరీక్షల ద్వారా మలేరియా బయటపడుతుంది.

కంపుకొడుతున్నాయ్...

మాలేరియా జ్వరాలను నివారించేందుకు ప్రతి రోజు పారిశుధ్య పనులు నిర్వహించడంతోపాటు వ్యాధులు అధికంగా వ్యాప్తి చెందే ప్రాంతాలను గుర్తించి శుభ్రత, స్రే, మలాథ్రియన్ ద్రావణంతో ఫాగింగ్ చేయాలి. వాటితోపాటు ప్రతి వీధిలోనూ చెత్తను తొలగిం చిన పిదప బ్లీచింగ్ చల్లి పరిశుభ్రమైన వాతావరణం కనిపించేలా చూడాలి. కానీ ఇలాంటి పరిస్థితి జిల్లాలోని ఏ పట్టణంలోనూ కనిపించడం లేదు.



ఒంగోలులోని ఆర్అండ్‌బీ కార్యాలయం వద్ద పేరుకున్న చెత్తాచెదారం

నీటి కాలుష్యంతో ముప్పు

నీటి కాలుష్యం కారణంగా డయేరియా, పచ్చకామెర్లు, వైరల్ జ్వరాలు, చికెన్‌పాక్స్ పిల్లల్లో మీజిల్స్ నీళ్ళ విరేచనాలు గవదబిళ్ళలు, పలు రకాల వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశాలు ఎక్కువ, దాంతో ప్రస్తుతం చెరువుల్లో కొత్తగా వస్తున్న నీటిని అధికార యంత్రాంగం కొళాయిల ద్వారా గృహాలకు విడుదల చేయడంతో రోగాలు మరింతగా వచ్చే అవకాశం ఉంది. అయితే కొళాయిల ద్వారా వచ్చే నీటిని ఏరోజుకారోజు నీటి పరీక్షలు చేసి, శుద్ధం అందించాల్సిన యంత్రాంగం కొన్ని ప్రాంతాలలో నీటిశుద్ధి లేకుండా అలాగే వదిలేయడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా శానిటేషన్ అధికారులు వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మత్స్యసంపదను పెంచేలా చర్యలు తీసుకోవాలి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 2025-26 సంవత్సరానికి స్వర్ణాంధ్ర-47లో భాగంగా మత్స్యసంపదను పెంచేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం రాత్రి జిల్లా గ్రామీణాభివృద్ధి, నీటి యాజమాన్య సంస్థ, బీసీ కార్పొరేషన్ అధికారులతో ఆమె మాట్లాడారు. 2025-26 సంవత్సరానికి లక్ష్యాలను సాధించేందుకు ఉపాది పథకం కింద గుర్తించిన అన్ని ప్రజానీటివనరుల్లో క్యాప్టివ్ సీడ్ నర్సరీలను ఏర్పాటు చేసేందుకు మత్స్యశాఖ, డ్వామా అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. మత్స్యకారుల జీవన ప్రమాణాలు మెరుగుపర్చేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో అధికారులు శ్రీనివాసరావు, నారాయణ, జోసఫ్‌కుమార్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కులను కాపాడాలి : జేసీ

ఒంగోలు(రూరల్), జూలై25(ఆంధ్రజ్యోతి): వినియోగదారుల హక్కులను కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని జేసీ గోపాలకృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో వినియోగదారులు రక్షణ సంఘ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సంఘ ప్రతినిధులు పలు అంశాలు జేసీ దృష్టికి తీసుకెళ్లారు. ఆర్టీసీ బస్టాండ్‌లలో మురుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉంటున్నాయని, వాటి వద్ద డబ్బులు వసూలు చేస్తున్నారని తెలిపారు. నగరంలో విద్యుత్ తీగలు, ఇతర వైర్లు ప్రమాదకరంగా కిందగా వేలాడుతున్నాయని, అలాగే కుక్కలు, కోతులు కూడా ఇబ్బందులు చేస్తున్నాయని, పరిశుభ్రత క్షీణదశలో ఉందని, ఆయా సమస్యలు తక్షణమే పరిష్కరించాలని కోరారు. ఆయా అంశాలపై జేసీ పలుశాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరాలశాఖ అధికారి ఎస్.పద్మ, డీఎంహెచ్‌వో టి.వెంకటేశ్వర్లు, నగర కమిషనర్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

రేపు ఉచిత మెగా వైద్యశిబిరం

పొన్నలూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఒంగోలుకు చెందిన వెంకటరమణ నర్సింగ్ హోం ఆధ్వర్యంలో ఈనెల 27న పొన్నలూరులో ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శిబిరం కొనసాగుతుందన్నారు. షుగర్ వ్యాధి నిపుణుడు డాక్టర్ కె.సీతారామయ్య, న్యూరాలజిస్టు డాక్టర్ చంద్రశేఖర్, ప్యాకో స్పెషలిస్ట్ వి.సుబ్రహ్మణ్యేశ్వరి, గుండె వ్యాధి నిపుణుడు డాక్టర్ వరుణ్‌మిత్ర, ఊపిరితిత్తుల వైద్యుడు అహమ్మద్ హాజరై వైద్య సేవలు అందిస్తారని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

డెంగ్యూ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఒంగోలు(రూరల్), జూలై25(ఆంధ్రజ్యోతి): ప్రజలు డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని ఫార్మసిస్టల యూనియన్ జిల్లా మాజీ అధ్యక్షుడు ఎంపీ.రత్నకుమార్ కోరారు. శుక్రవారం ఒంగోలు నగరం త్రోవగుంట వద్ద గల జీపీఐ పొగాకు గ్రేడింగ్ కేంద్రంలో మహిళా కూలీలకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రత్నకుమార్ దోమకాటు వల్ల డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులు వస్తాయన్నారు. అందువల్ల ఇళ్ల పరిసరరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. రాత్రులు దోమతెరలు వాడుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

అచ్యుతానందన్ జీవితం ఆదర్శప్రాయం

కొండపి, జూలై 25 (ఆం ధ్రజ్యోతి): కేరళ మాజీ సీఎం అచ్యుతానందన్ జీవితం ఆదర్శప్రాయమని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కంకణాల ఆంజనేయులు అన్నారు. పెరిదేపిలోని ఎంఎస్ విజ్ఞానకేంద్రంలో శుక్రవారం అచ్యుతానందన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సమావేశంలో ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి, సీపీఎం మండల కార్యదర్శి మల్లెల కొండయ్య, నాయకులు ముప్పరాజు చిన్నబ్రహ్మయ్య, మల్లెల పేతురు, పరిమళ, సుకన్య, మమత పాల్గొన్నారు.

చోడవరం సొసైటీ అధ్యక్షురాలు బాధ్యతల స్వీకరణ

కొండపి, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చోడవరం పీఏసీఎస్ అధ్యక్షురాలిగా గోగినేనివారిపాలెం గ్రామానికి చెందిన బొద్దులూరి లక్ష్మీప్రసన్న శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ సంఘ అభివృద్ధికి, రైతుల సంక్షేమం కోసం పనిచేస్తానన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సభ్యులు రావి నారాయణ, కమ్మ వెంకటేశ్వర్లు, కొండపి ఏఎంసీ మాజీ చైర్మన్ గొర్రెపాటి రామయ్యచౌదరి, టీడీపీ నాయకులు బత్తుల నారాయణస్వామి, కొర్రపాటి వసంతరాయుడు, దామా మురళి పాల్గొన్నారు.



బాధ్యతలను స్వీకరిస్తున్న లక్ష్మీప్రసన్న

నేడు మల్లవరంలో ఎమ్మెల్యే, జేసీ పర్యటన

మద్దిపాడు, జూలై 25(ఆంధ్రజ్యోతి): మద్దిపాడు మండలం మల్లవరం గ్రామంలోని గుడిమెట్ల మరియమ్మ కుటుంబాన్ని జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ దత్తత తీసుకున్నారు. ఈ సందర్భంగా శనివారం ఉదయం 8 గంటలకు మరియమ్మ ఇంటి వద్ద జరిగే కార్యక్రమానికి ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్, జేసీ ఆర్.గోపాలకృష్ణ హాజరవుతారని తహసీల్దార్ ఆదిలక్ష్మి, ఎంపీడీవో వి.జ్యోతి శుక్రవారంఒక ప్రకటనలో తెలిపారు. మండల అధికారులు హాజరుకావాలని వారు కోరారు.

ఏకేయూ పీజీ సెమిస్టర్ ఫలితాలు విడుదల

ఒంగోలు(విద్య), జూలై25(ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం పరిధిలోని పోస్ట్ గ్రాడ్యుయేషన్ మొదటి సెమిస్టర్ ఫలితాలను శుక్రవారం సాయంత్రం స్థానిక యూనివర్సిటీలో వైస్ చాన్సలర్ డీవీఆర్.మూర్తి విడుదల చేశారు. 2024-2025 విద్యా సంవత్సరానికి సంబంధించి మొదటి సెమిస్టర్ పరీక్షలకు 1025మందికి 932మంది పరీక్షలకు హాజరయ్యారు. వీరిలో 752 మంది (80.7శాతం) ఉత్తీర్ణులైనట్లు ఆయన చెప్పారు. ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ బి.హరిబాబు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ సోమశేఖర్, వి.భారతీదేవి, ఆర్.శ్రీనివాస్, శివరామ్, సిబ్బంది పాల్గొన్నారు.



పరీక్షా ఫలితాలను విడుదల చేస్తున్న వీసీ మూర్తి

గుండ్లాపల్లి సచివాలయం తనిఖీ

మద్దిపాడు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): గుండ్లాపల్లి గ్రామ సచివాలయాన్ని ఎంపీడీవో వి.జ్యోతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. శుక్రవారం ఉదయం ఆమె 10.30 గంటలకు సచివాలయానికి చేరుకుని 11 గంటల వరకు అక్కడే ఉన్నారు. ఈక్రమంలో హాజరు పట్టీ తనిఖీ చేయగా సుమారు 9 రోజుల నుంచి గ్రామ కార్యదర్శి హాజరు వేసి ఉండకపోవడాన్ని గుర్తించారు. ఫోన్ ద్వారా ప్రయత్నించినా అందుబాటులోకి రాలేదు. అనంతరం సిబ్బంది హాజరు పరిశీలించగా పలువురు ఉద్యోగులు విధులకు ఆలస్యంగా రావడం పట్ల ఎంపీడీవో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆన్‌లైన్‌లో నమోదైన హాజరును పరిశీలించి సిబ్బందికి వేతనాలు ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు. పంచాయతీ కార్యదర్శికి షోకాజ్ నోటీస్ ఇస్తామని, దానికి స్పందించకపోతే ఉన్నతాధికారులకు సరెండర్ చేస్తామని ఎంపీడీవో పేర్కొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీవో జ్యోతి

చెస్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ఒంగోలు కలెక్టరేట్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెల్లూరులో నిర్వహించిన చెస్ పోటీల్లో ఒంగోలు నగరం లాయర్‌పేటలోని నారాయణ సీవో అండ్ ఒలంపియాడ్ స్కూలు విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. ఈ పోటీల్లో బాలమహేష్‌రెడ్డి ద్వితీయ, లక్కిరెడ్డి సుదీక్షరెడ్డిలు తృతీయ స్థానాలను కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక స్కూలులో శుక్రవారం ప్రిన్సిపాల్ నాగూర్‌వలి, నారాయణ స్కూల్స్ జిల్లా ఏజీఎం నర్రావుల పెద్దిరెడ్డిలు విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులను విద్యపరంగానే కాకుండా క్రీడల్లో కూడా ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు.



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

34 మంది ఐటీఐ విద్యార్థులకు ఉద్యోగాలు

ఒంగోలు విద్య, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు సమీపంలోని శ్రీశివసాయి ఐటీఐలో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 34మంది ఐటీఐ విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. 56 మంది జాబ్‌మేళాకు హాజరు కాగా వారిలో 34 మంది ఉద్యోగాలకు పలు కంపెనీలకు చెందిన ప్రతినిధులు ఎంపిక చేశారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి నెలకు రూ.12నుంచి రూ.15 వేల వేతనం లభిస్తుందని కంపెనీ ప్రతినిధులు జయదేవ్, వెంకటరమణ తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ బాలుర ఐటీఐ ట్రైనింగ్ ఆఫీసర్, జిల్లా అప్రంటీస్ అడ్వయిజర్ కె.కృష్ణమూర్తి, శ్రీశివసాయి ఐటీఐ కరస్పాండెంట్ కారుమూడి శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ ఎం.ప్రభాకరరావు, అంజనేయులు, రాజేష్, రమ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు యూటీఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా

ఒంగోలు విద్య, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం శనివారం సాయంత్రం స్థానిక డీఈవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు షేక్ అబ్దుల్ హై, డి.వీరాంజనేయులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో టీచర్ల బదిలీలు, ఉద్యోగోన్నతుల ప్రక్రియ పూర్తయ్యి రెండు నెలలు కావాస్తున్నా ఇంత వరకు ఇంకా క్యాడర్ స్ట్రెన్త్, పోజిషన్ ఐడీలు రాని ఫలితంగా రెండు నెలలుగా టీచర్లకు జీతాలు లేవన్నారు. ప్రస్తుతం ఖాళీగా ఉన్న 600 ఎస్‌జీటీ పోస్టుల్లో తాత్కాలికంగా అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను నియమించి విద్యార్థులకు బోధన జరిగేలా చర్యలు తీసుకోవాలని, బదిలీ అయిన టీచర్లను రిలీవ్‌చేయాలని, ఉపాధ్యాయులకు పెరిగిన బోధనేతర కార్యక్రమాలు తగ్గించాలని డిమాండ్లతో ధర్న చేపట్టినట్లు తెలిపారు. ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

కొత్తపట్నం, జూలై 25(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న మహిళ మృతి చెందారు. ఈతముక్కల ఎస్సీ కాలనీకి చెందిన భార్యభర్తలు రూబేను, లుథియా ప్రతిరోజూ మోటార్‌సైకిల్‌పై బేల్దారు పనులకు ఒంగోలుకు వస్తుంటారు. ఈ నెల 24వ తేదీన ఉదయం పనికి పోతుండగా సంకువానికుంట వద్ద వారి వాహనానికి అడ్డుగా పంది రావటంతో ఇద్దరూ కింద పడిపోయారు. ఈ ప్రమాదంలో ఇద్దరి గాయాలయ్యాయి. అయితే తీవ్రంగా గాయపడిన లుథియాను మెరుగైన వైద్యం కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం చనిపోయింది. కొత్తపట్నం ఎస్ఐ సుధాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కూటమి ప్రభుత్వంలో ప్రజారంజక పాలన

- ఎమ్మెల్యే విజయ్‌కుమార్

నాగులుప్పలపాడు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలో ప్రజారంజక పాలన అందిస్తున్నట్లు ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. అమ్మనబ్రోలు గ్రామంలోని ఎస్టీకాలనీలో శుక్రవారం రాత్రి జరిగిన సుపరిపాలనకు తొలిఅడుగు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. స్థానిక టీడీపీ నాయకులు, గ్రామస్థులు బీఎన్‌కు పూలవర్షంతో ఘన స్వాగతం పలికారు. అక్కడి ప్రజలతో మమేకమై ఇంటింటికి వెళ్లి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల కరపత్రాలను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే బీఎన్ మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతిపాలయిందని విమర్శించారు. పరిపాలన అస్తవ్యస్తం చేశారన్నారు. కూటమి ప్రభుత్వ పాలనలోనే రాష్ట్రం అభివృద్ధిలో పరుగులు తీస్తుందన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు రాష్ట్రాభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్నారని, ఆయనకు మనమందరం మద్దతుగా నిలవాలని కోరారు. నియోజకవర్గంలో ఎక్కువ మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందించిన ఘనత తమదేనన్నారు. కుటుంబంలో అందరి పిల్లలకు అమ్మవందనం ద్వారా నగదు అందించిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందని చెప్పారు. గ్రామంలో ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు తేళ్ల మనోజ్‌కుమార్, కోశాధికారి మెట్టు సుబ్బయ్యనాయుడు, చవటపాలెం ఎంపీటీసీ ముప్పవరపు సుచిత్రచౌదరి, గ్రామ అధ్యక్షుడు గుడిపూడి రాజారావు, కార్యదర్శి ఈదర సుబ్బారావు, క్లస్టర్ ఇన్‌చార్జి ఈదర వెంకటకృష్ణారావు, యూనిట్ ఇన్‌చార్జి వలేటి పాండురంగారావు, సొసైటీ అధ్యక్షులు మారెళ్ల జనార్దనరావు, దొడ్డా శేషయ్య, కన్నా వెంకటేశ్వరరావు, దొడ్డా సీతారామయ్య, ఆళ్ల నాగార్జున, ముద్దన రవిబాబు, స్వర్ణ కిషోర్, మహ్మద్ బేగ్, ఏడుగుండ్ల వెంకటేశ్వరావు పాల్గొన్నారు.



కరపత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్, సుచిత్రచౌదరి

కాంట్రాక్టు విధానాలను ఉపసంహరించుకోవాలి

- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు

ఒంగోలు కలెక్టరేట్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీల్లో కార్మికులను కాంట్రాక్టర్‌కు అప్పగించే విధానాలను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని మునిసిపల్ కార్మికుల యూనియన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. ఒంగోలులోని సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం మునిసిపల్ కార్మికుల యూనియన్ జనరల్ బాడీ సమావేశం జి.నరసింహ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు మాటాడుతూ నెల్లూరు నగర పాలక సంస్థలో రెండు డివిజన్ల పరిధిలో వర్క్ అవుట్‌సోర్సింగ్ విధానాన్ని తీసుకువచ్చి చాపకింద నీరులాగా ఆప్కాస్‌ను ఎత్తివేసేందుకు ప్రయత్నాలు చేస్తుందని ఆరోపించారు. ఈ విషయంలో ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్టు కింద టెండర్లను పిలవడం దారుణంగా ఉందన్నారు. ఈనెల 12నుంచి రాష్ట్రవ్యాప్తంగా పారిశుధ్య కార్మికులు పది రోజుల పాటు సమ్మె చేయడం వల్ల ప్రభుత్వం సమస్యలను పరిష్కరించేందుకు ముందుకు వచ్చిందన్నారు. మంత్రి వద్ద జరిగిన చర్చల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే వచ్చేనెల 5వ తేదీ తర్వాత రిలే దీక్షలు చేపడతామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు చీకటి శ్రీనివాసరావు, కె.నాగభూషణం, జ్యోతిబసు, కె.సామ్రాజ్యం, రత్నకుమారి, కె.శ్రీనివాసరావు, విజయమ్మ, ఆనంద్, వై.రవి, ఎం.బాబు, జేమ్స్ వంశీ, మోహన్‌రావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

భక్తిశ్రద్ధలతో శ్రావణ శుక్రవార పూజలు

ఒంగోలు కల్చరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం తొలి శుక్రవారాన్ని ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ఇక దేవాలయాలలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు, విశేష పూజలు జరిగాయి. అదేవిధంగా ఒంగోలు నగరంలోని పలు దేవీ ఆలయాలకు శుక్రవారం ఉదయం, సాయంత్రం వేళల్లో మహిళలు పెద్దసంఖ్యలో వచ్చి అమ్మవార్లను దర్శించుకున్నారు. స్థానిక కేశవస్వామిపేట శ్రీవిజయదుర్గా అమ్మవారి దేవస్థానం, బీవీఎస్ థియేటర్ దగ్గర ఉన్న శ్రీమహాలక్ష్మి ఆలయం, బాలాజీరావుపేట శ్రీపార్వతీదేవి ఆలయం, గంటాపాలెం శ్రీమహాలక్ష్మి ఆలయం, గద్దలగుంటలోని శ్రీరాజరాజేశ్వరి త్రిశక్తిపీఠం దేవాలయాలలో శ్రావణ శుక్రవారం సందర్భంగా అమ్మవారికి విశేష అలంకరణలు చేశారు.

చీమకుర్తి : శ్రావణమాస ప్రారంభాన్ని పురస్కరించుకొని చీమకుర్తి పట్టణంలో సాక్షిరామలింగేశ్వరస్వామి ఆలయంలో కనకదుర్గ అమ్మవారిని అర్చకులు ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారికి అభిషేకాలు నిర్వహించారు. మహిళాభక్తులు విశేష పూజల్లో పాల్గొన్నారు.



శ్రీవిజయదుర్గా అమ్మవారికి పూజలు

శర్మ కళాశాల విద్యార్థుల రక్తదానం

ఒంగోలు విద్య, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులోని సీఎస్ఆర్ శర్మ కళాశాలలో బీకాం ద్వితీయ, తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు శుక్రవారం రిమ్స్‌లోని ప్రభుత్వ బ్లడ్‌బ్యాంకులో రక్తదానం చేశారు. డాక్టర్ వెన్నెల, రిమ్స్ బ్లడ్‌బ్యాంకు కౌన్సిలర్ సుధాశర్మ వారిని అభినందించి ప్రశంసాపత్రాను అందజేశారు. ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసరావు అధ్యాపకురాలు గాయత్రిలను అభినందించారు.

టెన్త్‌లో ఉత్తీర్ణత శాతం పెంచాలి : డీఈవో

నాగులుప్పలపాడు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది పదో తరగతి పబ్లిక్ పరీక్షలలో విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈవో కిరణ్‌కుమార్ సూచించారు. శుక్రవారం చేకూరపాడులోని శ్రీవేణుగోపాలస్వామి ఓరియంటల్ స్కూల్, మద్దిరాలపాడులోని పెనుబోతు వీరయ్య చౌదరి ఎయిడెడ్ పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. అనంతరం రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హెచ్ఎంలు అనిత, కరిముల్లా పాల్గొన్నారు.

పేద విద్యార్థినికి లయన్స్‌క్లబ్ చేయూత

చీమకుర్తి, జూలై25 (ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థిని ఉన్నత చదువులకు లయన్స్ క్లబ్ ఆఫ్ చీమకుర్తి చేయూత నందించింది. కంప్యూటర్ సైన్స్‌లో ఇంజనీరింగ్ చదువుతున్న విద్యార్థిని యజలరాశికి అవసరమైన ల్యాప్‌టాప్‌ను అందించారు. శుక్రవారం చీమకుర్తిలో క్లబ్ డిస్ట్రిక్ చైర్‌పర్సన్ బదరీనా రాయణ, వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ జవహర్, అధ్యక్షుడు చలువాది పార్థసారధి చేతులమీదుగా విద్యార్థిని తండ్రి మురుగన్‌కి బహూకరించారు. కార్యక్రమంలో హేమసుందరం, చలువాది రమేష్, అంజిరెడ్డి పాల్గొన్నారు.



ల్యాప్‌టాప్‌ను అందజేస్తున్న బదరీనారాయణ, డాక్టర్ జవహర్

విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వం

ఒంగోలు కలెక్టరేట్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తోందని వైసీపీ రాష్ట్ర కార్యదర్శి కేవీ.రమణారెడ్డి ఆరోపించారు. ఒంగోలులోని వైసీపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. సమావేశంలో నాయకులు కేవీవీ.ప్రసాద్, రొండా అంజిరెడ్డి, పల్నాటి రవీంద్రారెడ్డి పాల్గొన్నారు.

సొసైటీ త్రీసభ్య కమిటీ సభ్యుల బాధ్యతల స్వీకరణ

నాగులుప్పలపాడు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మసముద్రం, అమ్మనబ్రోలు సహకార సంఘాల త్రీమెన్‌కమిటీ సభ్యులు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. తిమ్మసముద్రం సొసైటీ అధ్యక్షుడిగా మన్నెం శివనాగేశ్వరరావు, డైరెక్టర్లుగా పెంట్యాల కోటేశ్వరరావు, మండవ మురహరితో ఇంకొల్లు సహకార బ్యాంక్ మేనేజర్ చాగంటి వెంకటేశ్వరరావు ప్రమాణ స్వీకారం చేయించారు. అలాగే అమ్మనబ్రోలు సొసైటీ అధ్యక్షుడిగా మారెళ్ల జనార్దనరావు, డైరెక్టర్‌లుగా దొడ్డా శేషయ్య, కన్నా వెంకటేశ్వరరావులతో సొసైటీ కార్యదర్శి రాజేష్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులను కూటమి నాయకులు రైతులు అభినందించారు. కార్యక్రమంలో నాయకులు ముద్దన రవిబాబు, ఈదర వెంకటకృష్ణారావు, మంగమూరి మధుబాబు, గుడిపూడి రాజారావు, జనసేన పార్టీ మండల అధ్యక్షుడుభూపతి మురళీ, కదుళ్ల వెంకటరాయుడు, ఈదర సుబ్బారావు, దొడ్డా సీతారామయ్య, వలేటి పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు.



తిమ్మసముద్రంలో కమిటీని అభినందిస్తున్న నాయకులు



అమ్మనబ్రోలు సొసైటీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరిస్తున్న జనార్దనరావు

90మందికి వైద్యసేవలు

పొన్నలూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : వెంకుపాలెం గ్రామంలో శుక్రవారం తానికొండ మహేంద్ర ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఒంగోలు రాయల్ ఆసుపత్రి వారు 90 మందికి నేత్ర పరీక్షలు చేసి 30మందికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారు. కార్యక్రమంలో డాక్టర్లు జగదీష్, నాగసుధామణి, హర్షిత, అనిత, జి.కమలహాసన్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిక

చీమకుర్తి, జూలై25(ఆంధ్రజ్యోతి): చీమకుర్తి పట్టణానికి చెందిన వ్యాపారవేత్త దాసరి నారాయణ శుక్రవారం కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్.షర్మిల సమక్షంలో ఆయన పార్టీలో చేరారు. పార్టీ అభివృద్ధి కోసం పాటుడాలని ఆమె కోరారు. కార్యక్రమంలో వెంకటకృష్ణారెడ్డి, మహ్మద్ రఫీ, వెంకటనరసయ్య, చందునాయక్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందజేత

ఒంగోలు కలెక్టరేట్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): హెచ్ఐవీ, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి ప్రతినెలా పౌష్టికాహారం అందించడం శుభపరిణామమని డీఎంహెచ్‌వో డాక్టర్ టి.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. లక్ష్మీకోటయ్య మెమోరియల్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఒంగోలులో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి పౌష్టికాహార కిట్లను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ అండ్ టీబీ అధికారి డాక్టర్ బి.శ్రీవాణి, సొసైటీ అధ్యక్షుడు శ్రీనుబాబు, క్లస్టర్ ప్రోగ్రామ్‌మేనేజర్ కిరణ్ పండిట్, రిసోర్స్ పర్సన్స్ విజయ్, వినయ్, సెక్రటరి సీహెచ్‌వీ.రాఘవ, సభ్యులు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలి

ఒంగోలు కార్పొరేషన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వశాఖల పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని ఫోరం ఆఫ్ సివిల్ పెన్షనర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం ఒంగోలులోని తపాలా కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ వ్యాలిడేషన్ చట్టాన్ని రద్దు చేయాలని, 8వ వేతన సంఘాన్ని వెంటనే నియమించాలని కోరారు. సమాన పని, సమాన పింఛను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు జి.శేషయ్య, సీహెచ్.లక్ష్మీనారాయణ వెంకటేశ్వర్లు, రంగారావు, దామా శ్రీనివాసరావు, రాంబాబు పాల్గొన్నారు.

నేడు ఆటో మ్యూటేషన్‌పై శిక్షణ

ఒంగోలు కార్పొరేషన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు నగరపాలక సంస్థ, రిజిస్ట్రేషన్‌శాఖ ఆధ్వర్యంలో శనివారం ఆస్తుల రిజిస్ట్రేషన్‌పై అమలు చేయనున్న ఆటో మ్యూటేషన్‌పై శిక్షణ నిర్వహించనున్నట్లు కమిషనర్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. స్థానిక ఎన్టీఆర్ కళాక్షేత్రంలో ఉదయం 10-30 నిర్వహించే కార్యక్రమంలో కార్పొరేషన్ సిబ్బంది, సచివాలయ సెక్రటరీలు, సబ్ రిజిస్ట్రార్ శాఖ ఉద్యోగులు పాల్గొంటారని పేర్కొన్నారు.

ఎంపీడీవోను సస్పెండ్ చేయాలి

ఒంగోలు కలెక్టరేట్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): తర్లుబాడు మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో మహిళా సిబ్బందిపై లైంగికవేధింపులకు పాల్పడుతూ మానసికంగా ఇబ్బందులకు గురిచేసిన ఎంపీడీవో చక్రపాణిప్రసాద్‌ను సస్పెండ్ చేయాలని మాదిగ సంక్షేమ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము సుజన్ మాదిగ డిమాండ్ చేశారు. ఒంగోలులోని అంబేడ్కర్ భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తన కార్యాలయంలో పనిచేసే మహిళా ఉద్యోగి పట్ల ఈ విధంగా వ్యవహరించడం దుర్మార్గంగా ఉందని, శాఖపరమైన విచారణ చేసి తక్షణమే సస్పెండ్ చేయాలని ఆయన కోరారు.

మొదలైన శ్రావణమాస పూజలు


ప్రత్యేక అలంకరణలో జగదాంబ

గిద్దలూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : శ్రావణమాసం మొదటి శుక్రవారం సందర్భంగా గిద్దలూరులోని వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారు రాజరాజేశ్వరి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా సామూహిక పారాయణం, పూజలు నిర్వహించారు. మహిళా భక్తులతో దేవాలయాలన్నీ కిటకిటలాడాయి. ఈ కార్యక్రమంలో దేవస్థాన కమిటీ అధ్యక్షులు వాడకట్టు రంగసత్యనారాయణ, కార్యదర్శి తుమ్మలపెంట సత్యనారాయణ, కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

● జగదాంబకు శ్రావణ శుక్రవారం పూజలు

మార్కాపురం వన్‌టౌన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురంలోని శ్రీ జగదాంబ సమేత మార్కండేశ్వర స్వామి ఆలయంలో జగదాంబకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణ మాసం ప్రారంభం సందర్భంగా అర్చకులు ఆంజనేయ శర్మ, వరుణ్‌తేజ శర్మలు అమ్మవారి మూలవిరాట్‌కు అభిషేకాలు, అలంకరణ, ప్రత్యేక పూజలు చేశారు. ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి కార్యక్రమాలను పర్యవేక్షించారు.

మంచి ప్రభుత్వాన్ని ఆదరించండి

రాచర్ల, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : సుపరిపాలన అందిస్తున్న ప్రజాప్రభుత్వాన్ని ఆదరించాలని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కటిక యోగానంద్ కోరారు. గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని గౌతవరం గ్రామంలో శుక్రవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఏడాది పాలనలో ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు చిత్తశుద్ధితో నెరవేరుస్తుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ శ్రేణులు జి. జీవనేశ్వర్ రెడ్డి, పి. సనావుల్లా ఖాన్, ఎస్. కళ్యాణ్ రెడ్డి, పి. శ్రీనివాసులు, డి. కాశి రెడ్డి, ఎం.వి. సాయి, ఎస్.రామారావు పాల్గొన్నారు.


కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

గిరిజనులు.. సమస్యలతో విలవిల


నేడు పలువురు మంత్రులు దోర్నాలకు రాక

పరిష్కారం కోసం ఎదురు చూస్తున్న ఆదివాసీలు

పెద్దదోర్నాల, జూలై 25(ఆంధ్రజ్యోతి) : దోర్నాలలో టీడీపీ వ్యవస్థాపకులు మాజీ ముఖ్యమంత్రి దివంగత ఎన్‌టీఆర్ కాంస్య విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఆ పార్టీ నేతలు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు పర్యవేక్షణలో నిర్వహిస్తున్న కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు గుమ్మడి సంధ్యారాణి, డోలా వీరాంజనేయ స్వామి, గొట్టిపాటి రవికుమార్, ఆనం రామనారాయణ రెడ్డి, ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసరెడ్డితో పాటు శాసనసభ్యులు హాజరవుతున్నారు.

అధిక సంఖ్యలో ఆదివాసీలు.. సమస్యలూ అంతే...

మంత్రుల పర్యటన నేపథ్యంలో మండలంలో పలు సమస్యలు పరిష్కారం కోసం ఎదురు చూస్తున్నాయి. వెనుకబడిన చెంచు గిరిజనులు మండల పరిధిలో అధికసంఖ్యల్లో నివసిస్తున్నారు. అనాదిగా నల్లమల అటవీ ప్రాంతంలో ఉంటూ అభివృద్ధి లేక కునారిల్లుతున్నారు. ఇప్పటివరకు అంతోఇంతో అభివృద్ధి జరిగిందంటే టీడీపీ హయాంలోనే. నేటికీ వారు నివాసిత గ్రామాలకు ప్రధాన రహదారులతో సంబంధం లేదు. మర్రిపాలెం, పెద్దచామ, చెరువుగూడెం, బంధంబావి తదితరాలకు రహదారుల్లేక చెంచులు ఇబ్బందులు పడుతున్నారు. అదేవిధంగా పక్కా గృహాలు నిర్మించుకునేందుకు అటవీ అనుమతులు లేక నిలిచిపోయాయి. కొన్ని గ్రామాలకు ఇప్పుడిప్పుడే విద్యుత్తు సౌకర్యం ఏర్పాటు చేస్తున్నారు. చాలామందికి రేషన్ కార్డులు, పింఛన్లు మంజూరు కాలేదు. ఆర్‌వోఎఫ్‌ఆర్ కింద పోడు భూములకు పట్టాలు ఇవ్వలేదు. జలసిరి బోరుబావులు మంజూరు కాలేదు. వారి జీవనాధారమైన వ్యవసాయం కుంటుబడింది. విద్య అంతంతమాత్రంగానే సాగుతోంది. కోటిరూపాయలకు పైగా వెచ్చించి నిర్మాణం పూర్తయిన పాఠశాల భవనం నేటికీ తలుపులు తెరవనే లేదు. ప్రస్తుతం అది శిథిలావస్థకు చేరుతోంది. ఏపీ గిరిజన బాలికల, బాలురు పాఠశాలలు మంజూరై ఐదేళ్లు దాటినా, స్థలం కేటాయించినా భవన నిర్మాణాలకు నిధులు మంజూరు లేక తరగతులు హాస్టళ్ల గదులలో నిర్వహిస్తున్నారు. ఇరుకు గదుల్లో సరైన వసతులు లేక విద్యార్థులు నానాఅవస్థలు పడుతున్నారు. గిరిజనులకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రారంభించిన సూపర్ స్పెషాలిటీ వైద్యశాల నిర్మాణం గత ఏడాదికే పూర్తి కావాల్సి ఉన్నా ఇంకా పనులు మందకొడిగానే సాగుతున్నాయి. అనేక సమస్యలతో గిరిజనులు అల్లాడిపోతున్నారు.


నత్తనడకన సూపర్ స్పెషాలిటీ వైద్యశాల నిర్మాణం

● వేధిస్తున్న విద్యుత్ సమస్య

విద్యుత్తు సమస్య కూడా వేధిస్తోంది. దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన స్తంభాలు, తీగలు కావడంతో ఎక్కడపడితే అక్కడ తెగిపోతున్నాయి. స్తంభాలు విరిగిపోవడం లేదా రోడ్డు పెరగడంతో ఎత్తు తగ్గి తీగలు చేతులకు అందే విధంగా మారాయి. నూతనంగా స్తంభాలు, తీగలు ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇలా పలు సమస్యలు మండలంలో తిష్ట వేశాయి. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లేందుకు మంత్రుల రాక కోసం మండల ప్రజలు ఎదురు చూస్తున్నారు.

● సరైన బస్టాండ్ లేక ఇబ్బందులు

మండల ప్రజల చిరకాలవాంఛ ఆర్‌టీసీ బస్టాండు నిర్మాణం. దోర్నాల కేంద్రంగా రోజూ వందల కొద్దీ ఆర్‌టీసీ బస్సుల రాకపోకలు సాగిస్తున్నాయి. శ్రీశైలం, పుట్టపర్తి, విజయవాడ, కర్నూలు వంటి మహానగరాలకు నిత్యం యాత్రికులు ప్రయాణిస్తుంటారు. సరైన వసతులు లేక వృద్ధులు, పిల్లలు, మహిళలు అనేక ఇక్కట్లకు గురవుతున్నారు. వానకు, ఎండలకు నిలిచేందుకు కూడా సరైన జాగా లేదు. తాగేందుకు నీళ్లు కూడా దొరకవు. మరుగుదొడ్లు తదితర వసతుల లేమితో ఇబ్బందులు పడుతున్నారు. దూపాడు నుంచి సాగర్ జలాలు ఈ ప్రాంతవాసులకు అందించాలని 1997లోనే అప్పటి టీడీపీ ప్రభుత్వం ఊరూరా వాటర్ ట్యాంకులు నిర్మించింది. నేటికీ చుక్క నీరు దోర్నాలకు చేరనేలేదు. ట్యాంకులు మాత్రం శిథిలావస్థకు చేరుకున్నాయి.

అవీఇవీ

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు తీవ్రగాయాలు


గాయాలతో సుబ్బారెడ్డి


గాయపడిన సుశీల

కొనకనమిట్ల, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చినారికట్ల జంక్షన్ సమీపంలోలని హెచ్‌పీ పెట్రోల్ బంకు వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు తీవ్రంగా గాయపడ్డారు. అందిన వివరాల ప్రకారం... చినారికట్ల గ్రామానికి చెందిన సోము సుబ్బారెడ్డి, సుశీల ఇరువురు పొలం పనులు ముగించుకొని టీవీఎస్ మోటర్‌సైకిల్‌పై స్వగ్రామమైన చినారికట్ల వెళ్లేందుకు రోడ్డు ఎక్కుతుండగా పొదిలి వైపు నుంచి గిద్దలూరు వైపు వెళుతున్న కెనరా బ్యాంక్ క్యాష్ పికప్ వాహనం బలంగా ఢీకొట్టింది. ఈప్రమాదంలో సుబ్బారెడ్డి, సుశీలకు కాళ్లు చేతులు విరిగి తీవ్రగాయాలతో చెల్లాచెదురుగా రోడ్డు పక్కన పడ్డారు. టీవీఎస్ మోటర్‌సైకిల్ క్యాష్ వాహనం కింద బాగాన ఇరుక్కు పోయి కొంత దూరం లాక్కెళ్లింది. వెంటనే స్థానికులు 108 సమాచారం అందించడంతో క్షతగాత్రులను పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తరలించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలం చేరుకొని ప్రమాదానికి గల కారణాలను ఆరాతీశారు. ఈఘటనపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.

మరుగుదొడ్లకు మరమ్మతులు చేయండి


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈవో

రాచర్ల, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొన్ని పాఠశాలల్లో టాయిలెట్స్ సరిగా లేవని వాటిని తక్షణమే సరిచేయించాలని మండల విద్యాశాఖ అధికారి గిరిధర్ శర్మ చెప్పారు. మండలంలోని రాచర్ల ఏబీఎం పాలెం ఎంపీపీఎస్ పాఠశాలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో టాయిలెట్స్ సరిగా లేకపోవడం, అపరిశుభ్రంగా ఉండడంతో సిబ్బందిపై అసహనం వ్యక్తంచేశారు. తక్షణమే వాటికి మరమ్మతులు చేయించాలని సూచించారు. శానిటరీ ఆయాతో రోజుకు రెండు పర్యాయాలు శుభ్రం చేయించాలని తెలిపారు. చోళవీడు జడ్‌పీహెచ్‌ఎస్ పాఠశాలను తనిఖీ చేసి టెన్త్‌క్లాస్ విద్యార్థుల విద్యావిధానాన్ని పరిశీలించారు. విద్యార్థుల స్థాయి, సిలబస్ వివరాల గురించి అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి క్రమం తప్పకుండా మెనూ ప్రకారం అందించాలని సిబ్బందికి తెలిపారు. స్పందన పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయుల వివరాలు సేకరించి 12(1)ని పూర్తి చేయాలని యాజమాన్యానికి తెలియజేశారు. అనంతరం పాఠశాలల రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

28న సాధన కళాశాలలో జాబ్ మేళా

మార్కాపురం వన్‌టౌన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : స్థానిక శ్రీ సాధన డిగ్రీ కళాశాలలో ఈనెల 28వ తేదీ జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.మధుసూదన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ ఔషధాల తయారీ సంస్థ దివీస్ ఆధ్వర్యంలో నిర్వహించే జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని వివరాలకు 9440748307, 8309870161 సంప్రదించాలని సూచించారు.

సీపీఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి


మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్రనాథ్

మార్కాపురం వన్‌టౌన్, జూలై 25 ఆంధ్రజ్యోతి : సీపీఐ రాష్ట్ర 28వ మహాసభలను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ పిలుపునిచ్చారు. స్థానిక పూలసుబ్బయ్య శాంతి భవన్‌లో మున్సిపల్, కాంట్రాక్ట్, శానిటరీ వర్కర్స్ యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పీఆర్‌సీ జరిగిన తర్వాత జీతాల పెంచుతారన్నారు. శానిటరీ వర్కర్లకు రూ.25వేలతో పాటు రూ.6వేలు ఇస్తారని, ఇంజనీరింగ్ వర్కర్లకు రూ.15వేలు ఇస్తారని తెలిపారు. నాయకులు అందె నాసరయ్య, ఏఐటీయూసీ నాయకులు కాశీం వై.వెంకటరెడ్డి పాల్గొన్నారు.

రెండు బైక్‌ల ఢీ.. ముగ్గురికి గాయాలు

పొదిలి, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాదిరెడ్డిపాలెం సమీపంలో శుక్రవారం రాత్రి రెండు బైకులు ఎదురెదురు ఢీకొన్నాయి. కొనకనమిట్ల మండలం మునగపాడుకు చెందిన శివ టైలర్‌పని చేసుకుంటూ పొదిలిలో నివాసం ఉంటున్నాడు. స్వగ్రామం వెళ్లి తిరిగి పొదిలి వస్తున్న క్రమంలో కొనకనమిట్ల గ్రామానికి చెందిన అఖిల్, రవి అనే యువకులు మోటార్ బైకుపై వస్తున్నారు. మాదిరెడ్డిపాలెం దగ్గరకు వచ్చే సరికి రెండు బైకులు ఢీకొన్నాయి. ఈప్రమాదంలో శివ పాదం నుజ్జునుజ్జు కావడంతోపాటు చేయి విరిగింది. సమాచారం తెలుసుకున్న 108 సిబ్బంది క్షతగాత్రులను పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స చేశారు. మెరుగైన వైద్యం కోసం శివను ఒంగోలు తరలించినట్లు డాక్టర్ శివపార్వతి తెలిపారు. అఖిల్, రవిల ఇద్దరికి ఒకరికి మోకాలు, ఒకరికి చేయికి గాయాలు కావడంతో చికిత్స చేస్తున్నారు.

పొదిలి ఏఎంసీ పీఠంపై మైనారిటీ నేత ఇమాంసాహెబ్

తొలిసారిగా అవకాశమిచ్చిన టీడీపీ


ఇమాంసాహెబ్‌ను అభినందిస్తున్న ప్రముఖులు

పొదిలి, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : పొదిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పీఠాన్ని తొలిసారిగా ఓ మైనారిటీ నేత దక్కించుకున్నారు. టీడీపీ ఆవిర్భావం నుంచి సామాన్య కార్యకర్తగా పనిచేసిన సయ్యద్ ఇమాంసాహెబ్ పొదిలి పట్టణ రాజకీయాల్లో అంచెలంచెలుగా ఎదిగారు. దివంగత మాజీ మంత్రి కాటూరి నారాయణస్వామి, మాజీ ఎంపీపీ కఠారి రాజుల అనుచరుడిగా పేరుతెచ్చుకున్నారు. పట్టణంలో గ్రామీణ వైద్యునిగా పేద వర్గాలలో గుర్తింపు పొందారు. ఎంపీటీసీ సభ్యునిగా రాజకీయ అరంగేట్రం చేసి ఆ ప్రాదేశి నియోజకవర్గం అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారు. మైనారిటీ నేతగా శాసన సభ్యులు కందుల నారాయణరెడ్డికి ముఖ్య అనుచరుడిగా కొనసాగుతున్నారు. పార్టీ అధిష్టానం నిర్వహించిన అంతర్గత సర్వేలో సైతం టీడీపీ శ్రేణుల నుంచి ఇమాంసాహెబ్‌కు మద్దతు లభించింది. నారాయణరెడ్డి ఆశీస్సులతో చైర్మన్ పీఠాన్ని దక్కించుకున్నారు.

పొదిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ 1976లో ఏర్పడింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు 9మంది చైర్మన్‌లుగా వ్యవహరించారు. తొలి చైర్మన్‌గా పొదిలి పట్టణానికి చెందిన ఆర్యవైశ్య సామాజికవర్గానికి చెందిన కొంపీటి సత్యనారాయణ, గాదంశెట్టి వెంకట నరసింహారావులు పనిచేయగా, రెడ్డి సామాజిక వర్గం నుంచి ఎన్ వెంకటరమణారెడ్డి, పాతకోట్లు క్రిష్ణారెడ్డి, గుజ్జుల రమణారెడ్డిలు, కమ్మ సామాజిక వర్గం నుంచి యర్రమోతు శ్రీనివాసులు, చప్పిడి రామలింగయ్యలు చైర్మన్లుగా పనిచేశారు. బీసీ సామాజిక వర్గం నుంచి గుర్రపుశాల కోటేశ్వరి తొలి మహిళా అధ్యక్షురాలిగా రెండు పర్యాయాలు పనిచేశారు. నూతన చైర్మన్‌గా ఎంపికైన సయ్యద్ ఇమాంసాహెబ్ లాంఛనంగా శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆయనను కార్యదర్శి రవీంద్రారెడ్డి, డైరెక్టర్లు రోళ్ల శ్రీనివాసులు, సోమిశెట్టి శ్రీదేవిలు సత్కరించారు.

గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలి

పుల్లలచెరువు మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీడీవో

వైసీపీ హయాంలో కబ్జాకు గురైన జడ్పీ స్థలాన్ని వెనక్కి తీసుకోవాలని కోరిన దాతలు



మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసులు,ఎంపీపీ వెంకటయ్య

పుల్లలచెరువు, జూలై 25(ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో అభివృద్ధి పనులు చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎంపీడీవో శ్రీనివాసులు కోరారు. శుక్రవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలో ఉపాధి హామీ పథకం ద్వారా కోట్ల రూపాయల నిధులతో ప్రభుత్వం ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తోందన్నారు. పంచాయతీ పాలకులు కూడా నిధులు దుర్వినియోగం కాకుండా ప్రజలకు అవసరమైన పనులు చేపట్టాలని సూచించారు. అలాగే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అపరిశుభ్ర ప్రదేశాలకు ఎప్పటికప్పుడు శుభ్రం చేసి బ్లీచింగ్‌ను చల్లించాలని చెప్పారు. పుల్లలచెరువులో జడ్పీకి ఇచ్చిన స్థలాన్ని వైసీపీ ప్రభుత్వ హయాంలో కబ్జా చేసి అమ్ముకున్నారని స్థల దాత వారసులు రఘు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే ఆ భూమిలో అక్రమణలు తొలగించి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని కోరారు. వైస్ ఎంపీపీ రాములు మాట్లాడుతూ పుల్లలచెరువులో కాలం చెల్లిన విద్యుత్ లైన్లు, స్తంభాలను మార్చాలని విజ్ఞప్తిచేశారు. ఎంపీటీసీ సభ్యుడు రాధక్రిష్ణ మాట్లాడుతూ చెరువు కట్టపై దిబ్బలు తొలగించాలని ఎన్నిసార్లు అధికారులకు చెప్పినా పట్టించుకోవడంలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీవ వెంకటయ్య, జడ్పీటీసీ సభ్యుడు వాగ్యానాయక్ పాల్గొన్నారు.

ఎయిడెడ్ పాఠశాలలను తనిఖీచేసిన ఎంఈవోలు


మాట్లాడుతున్న ఎంఈవో

కొమరోలు, జూలై 25(ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎస్‌బీఎస్‌ఆర్‌ఎం ఎయిడెడ్ పాఠశాలలను, ఏబీఎం ఎయిడెడ్ పాఠశాలలను శుక్రవారం ఎంఈవోలు ఆకస్మికంగా తనిఖీచేశారు. విద్యార్థుల రోలు, మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఎంఈవోలు కావడి వెంకటేశ్వర్లు, బొర్రా వెంకటరత్నంలు ఎస్‌బీఎస్‌ఆర్‌ఎం ఎయిడెడ్ పాఠశాలల్లో తనిఖీలు నిర్వహించారు. పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజనం అమలుతీరుతెన్నులను, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. అనంతరం గోపానిపల్లిలోని ఏబీఎం ఎయిడెడ్ పాఠశాలలను తనిఖీలు చేయగా కరస్పాండెంట్ అందుబాటులో లేరు. ఉన్న సిబ్బంది రికార్డులు కూడా చూపకపోవడంతో ఎంఈవోలు పాఠశాలల కరస్పాండెంట్‌కు నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. ఈ విషయాన్ని జిల్లా ఉన్నతాధికారులకు నివేదించినట్లు తెలిపారు.

ఎంపీడీవోను అరెస్ట్ చేయాలి


ఆందోళన చేస్తున్న దళిత సంఘం నాయకులు

తర్లుపాడు, జూలై 25 ఆంధ్రజ్యోతి: మహిళపై లైంగిక వేధింపులకు పాల్పడ్డ ఎంపీడీవో చక్రపాణి ప్రసాదును వెంటనే అరెస్ట్ చేయాలని ఎంపీడీవో కార్యాలయం ఎదుట దళిత సంఘం నాయకులు శుక్రవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా దళిత సంఘం నాయకులు జయరాజు మాట్లాడుతూ కార్యాలయంలో రోజువారి వేతనంతో పనిచేస్తున్న దళిత మహిళపై ఎంపీడీవో లైంగిక వేధింపులకు పాల్పడటం సిగ్గుచేటన్నారు. ఇలాంటి అధికారిని వెంటనే విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్ కె.కె.కిశోర్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పిచ్చయ్య, యోహాన్ పాల్గొన్నారు. ఎంపీడీవోపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బ్రహ్మనాయుడు తెలిపారు. ఎంపీడీవోపై విచారణకు దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణ కూడా త్వరలో రానున్నట్లు ఆయన చెప్పారు.

మొదటి నుంచి ఆయన ప్రవర్తన ఇంతే

తర్లుపాడు ఎంపీడీవోగా విధుల్లో చేరిన 8 నెలల నుంచి ఈయన కార్యాలయ సిబ్బందిపై దురుసుగా ప్రవర్తిస్తున్నట్లు సమాచారం. తాను చెప్పిందే వేదం అన్నట్లు ప్రవర్తించారు. నెల క్రితం పంచాయతీ కార్యదర్శులపై అసభ్య పదజాలంతో దూషించటంపై మండలంలోని మొత్తం పంచాయతీ కార్యదర్శులు సెలవుపై వెళ్తున్నట్లు ప్రకటించి డీఎల్‌పీవోకు వినతిపత్రం ఇచ్చారు. జిల్లా అధికారులు జోక్యం చేసుకుని ఎంపీడీవో పనితీరుపై ఆగ్రహించి కార్యదర్శులు యథావిధిగా విధుల్లో చేరాలని ఆదేశించారు. ఈయన విధుల్లోకి ఎప్పుడు వస్తాడో, ఎప్పుడు పోతాడో తెలియని పరిస్థితి.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

తర్లుపాడు, జూలై 25 ఆంధ్రజ్యోతి: మండలంలో వివిధ గ్రామాలకు చెందిన అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స చేసుకున్నవారికి సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సతీమణి వసంత లక్ష్మీ లబ్దిదారులకు స్వయానా ఇంటికి వెళ్లి శుక్రవారం పంపిణీ చేశారు. తర్లుపాడు గ్రామానికి చెందిన బి.లింగమ్మకు రూ.65వేలు, బి.వెంకటలక్ష్మమ్మకు రూ.42,324, రాగిసముద్రం గ్రామానికి చెందిన చిన్న రాజయ్యకు రూ.40,392, చెన్నారెడ్డిపల్లె గ్రామానికి చెందిన జ్యోతి అంజలికి రూ.41,200 చెక్కులను మొత్తం మండలంలో రూ.1,88,938 విలువగల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా వసంతలక్ష్మీ వారి ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకుని కూటమి ప్రభుత్వం ఎప్పుడు పేదలకు అండగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు చిన్నపురెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, వెంకట్, గోపినాథ్, వెంకటరెడ్డి, సుబ్బయ్య, లక్ష్మయ్య, ఈర్ల వెంకటయ్య, శ్రీనివాసులు, వెన్నా వెంకటరెడ్డి పాల్గొన్నారు.

నేడు ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ

భారీగా తరలి రావాలని టీడీపీ కార్యకర్తలకు నేతల పిలుపు


మాట్లాడుతున్న చేకూరి సుబ్బారావు

ఎర్రగొండపాలెం, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : దోర్నాలలో శనివారం జరగనున్న మాజీ ముఖ్యమంత్రి దివంగత నందమూరి తారక రామారావు విగ్రహావిష్కరణకు మండలం నుంచి భారీగా నాయకులు, కార్యకర్తలు, ఎన్టీఆర్ అభిమానులు తరలిరావాలని మండల టీడీపీ అధ్యక్షుడు చేకూరి సుబ్బారావు కోరారు. టీడీపీ స్థానిక కార్యాలయంలో శుక్రవారం మండల నాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశం నిర్వహించారు. ప్రతి గ్రామం నుంచి రెండు వాహనాలు ఏర్పాటు చేసుకొని సమష్టిగా ఉదయం 9 గంటలకు రావాలని కోరారు. ఈ సమావేశంలో మండల ముఖ్యనాయకులు పాల్గొన్నారు.

వాసవి పాఠశాల విద్యార్థికి నవోదయలో సీటు


సాయి వెంకట నిఖిల్

మార్కాపురం వన్‌టౌన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక వాసవి విద్యానికేతన్‌లో చదువుతున్న ఎం.సాయి వెంకట నిఖిల్‌కు నవోదయలో సీటు లభించింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రంగయ్య మాట్లాడుతూ తమ పాఠశాలలో చదువుతున్న నిఖిల్ జవహర్ నవోదయ పాఠశాలలో ప్రతిభ చాటి సీటు దక్కించుకున్నారని తెలిపారు. జోన్‌ల వారీగా కేవలం 7 సీట్లు మాత్రమే ఉన్నాయని, వాటిలో తమ విద్యార్థి ప్రతిభ చాటడం అభినందనీయం అన్నారు.

సీపీఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి

దొనకొండ, జూలై 25(ఆంధ్రజ్యోతి): భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) 28వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆర్. కరుణానిధి పిలుపునిచ్చారు. శుక్రవారం దొనకొండ, రుద్రసముద్రం గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా కరుణానిధి మాట్లాడుతూ దొనకొండను పారిశ్రామిక కారిడార్‌గా అభివృద్ధి చేసి నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. ఆగస్టు 23న ఒంగోలులో జరిగే బహిరంగ సభకు ఈప్రాంత ప్రజలు అధికసంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి చెన్నుబోయిన గురుమూర్తి, కూరేటి బాలయ్య, జూపల్లి కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

కళలను ఆదరించాలి

దర్శి, జూలై 25(ఆంధ్రజ్యోతి): కళారంగాన్ని ప్రజలు ఆదరించాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. దర్శి పట్టణంలోని అద్దంకి రోడ్డులోగల కనకదుర్గమ్మ ఆలయం ఆవరణలో శుక్రవారం దక్షిణ కాళీ అనే పౌరాణిక చిత్ర నిర్మాణానికి క్లాప్ కొట్టి ప్రారంభించారు. శ్రీనిధి క్రియేషన్ సంస్థ ఆధ్వర్యంలో దర్శకుడు తోట కృష్ణ, నిర్మాత మీసాల వాణి ఆధ్వర్యంలో ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దర్శిలో చిత్ర నిర్మాణం చేపట్టటం ఆనందదాయకమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, దారం సుబ్బారావు, మాగం వాసు, నారపుశెట్టి హనుమంతరావు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

తాళ్లూరు, జూలై 25(ఆంధ్రజ్యోతి): డెంగ్యూ, విషజ్వరాలపై తగుజాగ్రత్తలు పాటించాలని తూర్పుగంగవరం పీహెచ్‌సీ వైద్యురాలు మౌనిక తెలిపారు. బొద్దికూరపాడు పంచాయతీ చింతలపాలెం గ్రామంలో డెంగ్యూ, విషజ్వరాలపై శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ అధిక మోతాదులో జ్వరం వచ్చిన వెంటనే సమీప పీహెచ్‌సీకి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. దోమల నివారణకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఈవో గోపీనాయక్, ఎంఎల్‌హెచ్‌పీ మరియమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పంటల యాజమాన్యంపై శిక్షణ

ముండ్లమూరు, జూలై 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని మారెళ్ల గ్రామంలో శుక్రవారం జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారిణి ఏశైలజారాణి రైతులకు శిక్షణ ఇచ్చారు. జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో ప్రధానమంత్రి రాష్ట్రీయ కృషి వికాస్ యోచన 2025 క్రింద ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసే పంటల్లో చేపట్టాల్సిన మేలైన యాజమాన్య పద్ధతులపై శిక్షణ ఇచ్చారు. అనంతరం రైతులకు శిక్షణ కరదీపికలను అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి తిరుమలరావు, వీఏఏలు బాలవెంకటయ్య, రాధారాణి, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల గ్రంథాలయ అభివృద్ధికి పుస్తకాల అందజేత

ముండ్లమూరు, జూలై 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని మారెళ్ల జడ్పీ ఉన్నత పాఠశాలకు రూ.5వేలు విలువచేసే గ్రంథాలయ పుస్తకాలను రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు పుట్టమరాజు శ్రీరామచంద్రమూర్తి శుక్రవారం అందజేశారు. ఈసందర్భంగా ప్రధానోపాధ్యాయుడు కుందుర్తి శ్రీనివాసరావు మాట్లాడుతూ పఠనమనేది విద్యార్థి జీవితాన్ని ప్రభావితం చేసే శక్తివంతమైన సాధనమన్నారు. శ్రీరామచంద్రమూర్తి అందించిన పుస్తకాలు విద్యార్థులకు ఎంతో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక బాపట్ల జిల్లా ప్రధానకార్యదర్శి శ్రీనివాసరావు, పాశం కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలి

తాళ్లూరు, జూలై 25(ఆంధ్రజ్యోతి): భూసార పరీక్షలతో వచ్చిన ఫలితాలతో మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలని జిల్లా వనరుల కేంద్రం సాంకేతిక వ్యవసాయాధికారి వి.శేషమ్మ అన్నారు. తాళ్లూరు-1, తాళ్లూరు-2 రైతు సేవా కేంద్రాల పరిధిలోని రైతులకు రాష్ట్ర కృషి వికాస్ యోజనలో భాగంగా శుక్రవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా వ్యవసాయాధికారి ప్రసాదరావు మాట్లాడుతూ వ్యవసాయశాఖ అమలుచేస్తున్న పలు పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో వీఏఏ సాయి, ఫిషరీస్ అసిస్టెంట్ మణిశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

పీసీపల్లి, జూలై 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని నేరేడుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల నుంచి ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను శుక్రవారం ఘనంగా సన్మానించారు. పాఠశాల ఆవరణలో జరిగిన ఈకార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా పాల్గొన్న ఎంఈవోలు ఆర్.శ్రీనివాసులు, సంజీవి మాట్లాడుతూ ఉద్యోగులకు బదిలీలు, పదోన్నతులు, పదవీ విరమణలు తప్పనిసరి అని అన్నారు. అనంతరం బదిలీపై వెళ్లిన హెచ్ఎం అంజనీదేవి, ఉపాధ్యాయులు శేషారావు, హరిక్రిష్ణ, అమర్‌నాధ్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, గురవయ్య, కోటేశ్వరరావు, పద్మావతి, పి.వెంకయ్య, శివకుమార్‌ను సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ మల్లికార్జున, ప్రధానోపాధ్యాయులు ఎస్.శ్యాంప్రసాద్, ఎస్ఎంసీ చైర్మన్ మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

పునాదుల్లోనే క్రీడావికాస కేంద్రం

- గత వైసీపీ పాలకుల నిర్లక్ష్యమే కారణం
- కూటమి ప్రభుత్వంపై విద్యార్థుల ఆశలు

దర్శి, జూలై 25(ఆంధ్రజ్యోతి): యువకులు, విద్యార్థులు క్రీడల్లో రాణించేందుకు సాధన నిమిత్తం నిర్మించ తలపెట్టిన క్రీడా వికాసకేంద్రం ఏళ్ల తరబడి పునాదుల్లోనే నిలచిపోయింది. గత వైసీపీ పాలకుల నిర్లక్ష్యంతో ఐదేళ్లల్లో అనేక అభివృద్ధి పథకాలు నిలిచిపోయాయి. ఇందులో క్రీడా వికాసకేంద్రం కూడా ఉంది. గత టీడీపీ హయాంలో స్థానిక ఎన్ఎస్‌పీ కాలనీలో రూ.2కోట్ల వ్యయంతో క్రీడా వికాసకేంద్రం నిర్మాణం చేపట్టారు. పునాదులు నిర్మించి పిల్లర్లు వేసే సమయానికి 2019 ఎన్నికలు వచ్చాయి ఆతర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ పథకాలన్నింటినీ నిలిపివేసింది. అప్పటినుంచి అడుగు ముందుకు పడలేదు.



పునాదుల్లో నిలిచిపోయిన క్రీడావికాస కేంద్రం



చిల్లచెట్లలో శిలాఫలకం

క్రీడా వికాసం కేంద్రం నిర్మాణ ప్రదేశంలో చిల్లచెట్లు పెరిగి రూపురేఖలు మారిపోయాయి. శంకుస్థాపన శిలాఫలకం కూడా చెట్లలో కనపడకుండా ఉంది. దర్శి ప్రాంతంలోని యువత, విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లో కూడా రాణించి ఉన్నతస్థాయికి వెళ్లేందుకు మౌలిక వసతుల కల్పనలో భాగంగా గత తెలుగుదేశం ప్రభుత్వం క్రీడా వికాసకేంద్రం నిర్మాణం చేపట్టింది. ప్రస్తుతం సీఎం చంద్రబాబు మళ్లీ అధికారంలోకి రావటంతో క్రీడా వికాసకేంద్రం నిర్మాణం పునఃప్రారంభమవుతుందని విద్యార్థులు ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నారు.

ఇటీవల టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి నిలిచిపోయిన క్రీడా వికాసకేంద్రాన్ని పరిశీలించారు. ఖాళీగా ఉన్న మరికొంత భూమిని ఇందులో చేర్చి విశాలమైన క్రీడాకేంద్రాన్ని ఏర్పాటుచేసే విధంగా కృషి చేస్తున్నారు. ఈమేరకు ఎనిమిది ఎకరాల విస్తీర్ణంలో క్రీడా వికాసకేంద్రం నిర్మించాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. త్వరలో నిధులు విడుదలయ్యే అవకాశం ఉంది. ఇది పూర్తయితే క్రీడాకారులైన విద్యార్థులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది.

పేదరికంలేని సమాజమే ప్రభుత్వ లక్ష్యం

- టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

దర్శి, జూలై 25(ఆంధ్రజ్యోతి): పేదరికంలేని సమాజం ఏర్పాటుచేయటమే ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన పీ-4 విజన్ 2047 సదస్సులో ఆమె మాట్లాడారు. పేదరికంలేని సమాజం కోసం కృషి చేసేందుకు స్వచ్ఛంద సంస్థలు, వ్యాపార సంస్థలు ముందుకు రావాలని కోరారు. సమాజం బాగుంటేనే అందరం బాగుంటామన్న విషయాన్ని గుర్తించాలన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సారథ్యంలో కూటమి ప్రభుత్వం పేదరిక నిర్మూలనకు ఎంతో కృషి చేస్తుందన్నారు. దర్శి నియోజక వర్గంలో అభివృద్ధి పథకాలు శరవేగంగా ముందుకు సాగుతున్నాయన్నారు. అమృత్ పథకం ద్వారా రూ.130.6 కోట్లతో దర్శి పట్టణ ప్రజలకు ఇంటింటికి కొళాయి ఏర్పాటుచేసి స్వచ్ఛమైన తాగునీరు అందించటం జరుగుతుందన్నారు. ప్రజలందరూ అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు.

కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేకాధికారి జాన్సన్, మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే ధ్యేయం.

దర్శి, జూలై 25(ఆంధ్రజ్యోతి): ఏడాది పాలనలో జరిగిన అభివృద్ధిని చూసి కూటమి ప్రభుత్వాన్ని ఆదరించాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. శుక్రవారం సాయంత్రం దర్శి పట్టణంలోని 9వ వార్డులో జరిగిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీచేశారు. ఈసందర్భంగా డాక్టర్ లక్ష్మి మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో నిలిచిన అభివృద్ధి పథకాలను పునర్నిర్మిస్తున్నామన్నారు. దర్శిలో నిలిచిన డ్రైవింగ్ స్కూల్, క్రీడా వికాసకేంద్రం, తదితర పనులను త్వరలో ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. రూ.130.6 కోట్లతో అమృత్ పథకం అమలుకు టెండర్లు పిలిచినట్టు చెప్పారు. త్వరలో పనులు ప్రారంభిస్తారని తెలిపారు. దర్శి నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక మార్కెట్ యార్డు కార్యాలయాన్ని డాక్టర్ లక్ష్మి సందర్శించారు. ఏఎంసీ చైర్‌పర్సన్ దారం నాగవేణి, సుబ్బారావు దంపతులు ఆమెకు ఘనస్వాగతం పలికారు. ఈసందర్భంగా డాక్టర్ లక్ష్మి మాట్లాడుతూ రైతుల అభ్యున్నతికి నూతన కార్యవర్గం చిత్తశుద్ధితో కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కోటా హనుమంతరావు, తదితరులు పాల్గొన్నారు.



వృద్ధుడికి కరపత్రం అందజేసి యోగక్షేమాలు తెలుసుకుంటున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

దొనకొండ జడ్పీ పాఠశాలకు ప్రత్యేక గుర్తింపు

దొనకొండ, జూలై 25(ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం ఎంపికచేసిన పీఎంశ్రీ పాఠశాలల్లో జరిగిన అభివృద్ధి, విద్యార్థుల విద్యాభివృద్ధిపై ఇటీవల అధికారుల బృందం చేపట్టిన పరిశీలనలో జిల్లాలో దొనకొండ జడ్పీ పాఠశాలకు గుర్తింపు లభించింది. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించేందుకు, విద్యార్థుల్లో విద్యాభివృద్ధి పెంపొందించేందుకు 2022లో కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా(పీఎంశ్రీ) పథకంలో జిల్లాలో ఎంపికైన 41 పాఠశాలల్లో దొనకొండ జడ్పీ ఉన్నత పాఠశాల ఉంది.

పీఎంశ్రీ పథకం కింద మంజూరైన నిధులతో దొనకొండ జడ్పీ పాఠశాలలో స్కిల్ ఒకేషనల్ కోర్సుల్లో భాగంగా బ్యాంకింగ్, టైలరింగ్, ఎలక్ట్రానిక్స్ కోర్సులు ఏర్పాటుచేశారు. క్రీడల్లో విద్యార్థులను ప్రోత్సహించేలా ఖోఖో, వాలీబాల్, కబడ్డీ కోర్టులు ఏర్పాటుతోపాటు కిచెన్ గార్డెన్ ఏర్పాటుచేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వీవీ రామాంజనేయులు రూ.20వేలు సొంత నిధులతో పీఎంశ్రీ పాఠశాలగా స్టీల్ లెటర్స్‌తో ఏర్పాటు చేసిన బోర్డు ఆకర్షణీయంగా నిలిచింది. ఇటీవల రాష్ట్ర సమగ్ర శిక్ష పీఎంశ్రీ వింగ్ అధికారి రమేష్, ఇతర అధికారుల బృందం దొనకొండ జడ్పీ పాఠశాలను పరిశీలించారు. అలాగే, ఈనెల 21న జిల్లా సమగ్రశిక్ష ఏఎంవో నాగరాజు, చీమకుర్తి ఎంఈవో శివాజీల బృందం పాఠశాలలో డిజిటల్ బోధన, విద్యార్థుల్లో విద్యా సామర్థ్యం, క్రీడలు తదితర అంశాలను పరిశీలించారు.




దొనకొండ జడ్పీ పాఠశాల

పీఎంశ్రీ నిధులతో పాఠశాలల్లో చేపట్టిన మౌలిక సౌకర్యాలు, విద్యాభివృద్ధి తదితర అంశాలను మొదటి విడతగా పరిశీలించిన అధికారుల బృందం రాష్ట్రంలోని 26 జిల్లాల్లో జిల్లాకు ఒక పాఠశాల ఎంపికచేశారు. ప్రకాశం జిల్లా నుంచి దొనకొండ జడ్పీ పాఠశాల ఎంపికైంది. అధికారుల బృందం పీఎంశ్రీ పాఠశాలలను మరో విడత పరిశీలించి రాష్ట్రంలో రెండు పాఠశాలలను జాతీయస్థాయికి ఎంపికచేసి ప్రధానమంత్రి చేతులమీదుగా పురస్కారం అందజేయనున్నట్టు సమాచారం.

వెలిగండ్ల సొసైటీ అభివృద్ధికి కృషి

- డీసీఎంఎస్ చైర్మన్ శ్యామల కాశిరెడ్డి

వెలిగండ్ల, జూలై 25(ఆంధ్రజ్యోతి): వెలిగండ్ సొసైటీ అభివృద్ధికి కృషిచేస్తానని పర్సన్ ఇన్‌చార్జ్, డీసీఎంఎస్ చైర్మన్ శ్యామం కాశిరెడ్డి అన్నారు. శుక్రవారం సొసైటీ కార్యాలయంలో ఆయనతోపాటు సభ్యులు బొప్పరాజు లక్ష్మీనారాయణ, సలోమన్ రాజు బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా కాశిరెడ్డి మాట్లాడుతూ తనకి ఈ అవకాశం ఇచ్చిన ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డికి, జిల్లా తెలుగు దేశం పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. రైతులు సంక్షేమం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అనేక పథకాలను ప్రవేశపెట్టారని అన్నారు. వాటిని రైతులు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. మండల ప్రజలకు, రైతులకు తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానన్నారు. సొసైటీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని చెప్పారు. అర్హతఉన్న రైతులకు రుణాలు మంజూరుచేసి వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు అందిస్తానన్నారు. ఈసందర్భంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆయనను సన్మానించారు.



శ్యామల కాశిరెడ్డిని సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ముత్తిరెడ్డి వెంకటరెడ్డి, కేలం ఇంద్రభూపాల్ రెడ్డి, కొండు భాస్కర్‌రెడ్డి, చిలకల వెంకటేశ్వరరెడ్డి, కార్నటి భాస్కర్ రెడ్డి, కేసరి రమణా రెడ్డి, మీనిగ కాశయ్య, సాన జయపాల్‌రెడ్డి, పుల్లారెడ్డి కామిరెడ్డి, మెటాటి సుబ్బారెడ్డి, చిన్ని, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు

- మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి ఆదేశం

కనిగిరి, జూలై 25(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం మున్సిపల్, సచివాలయ శానిటేషన్ అధికారులు, సిబ్బందితో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపాల్టీ పరిధిలోని ప్రతి వార్డులో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలను అప్రమత్తం చేసేవిధంగా ప్రత్యేక సమావేశాలు చేపట్టాలని సూచించారు. పట్టణ శివారు ప్రాంతాలు, నివేశాల మధ్య ఉన్న ఖాళీ స్థలాల్లోని పిచ్చి మొక్కలను తొలగించేవిధంగా శానిటేషన్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మురుగుకాల్వలు, చెత్త కుప్పలు ఎప్పటికప్పుడు తొలగించి బ్లీచింగ్ చల్లించాలని ఆదేశించారు. సచివాలయాల్లోని వైద్య సిబ్బంది ప్రతి ఇంటిని సందర్శించి సీజనల్ వ్యాధుల వల్ల వచ్చే అనారోగ్యాలను ప్రజలకు వివరించాలని సూచించారు. డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధుల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. జ్వరపీడితులకు వైద్య సిబ్బంది మందులు అందజేయాలన్నారు. కాచి చల్లార్చిన నీటి తాగేవిధంగా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఇంటి పరిసరాల్లో, ఆవరణల్లో ప్లాస్టిక్ వస్తువులు, ఖాళీ సీసాలు, టైర్లు, ఖాళీ నీటి తొట్టెలు లేకుండా చూడాలన్నారు. సమావేశంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాయబ్‌రసూల్, హెల్త్ అసిస్టెంట్ చెన్నకేశవులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి



మాట్లాడుతున్న డిప్యూటీ ఎంపీడీవో సుందరామయ్య

పేద కుటుంబాలను ఆదుకోవాలి

పామూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): పేదరికంలేని సమాజ లక్ష్యం కోసమే రాష్ట్ర ప్రభుత్వం పీ4 పథకాన్ని రూపొందించిందని డిప్యూటీ ఎంపీడీవో కె.సుందరరామయ్య అన్నారు. పట్టణంలోని 1,2,3,4, సచివాలయాల పరిధిలోని అంకాలమ్మవీధి, డీవీపాలెం, గోపాలపురంలోని ఎస్సీ కాలనీల్లో గ్రామ పంచాయతీ కార్యదర్శి జీవీ అరవిందారెడ్డి ఆధ్వర్యంలో పీ4 బంగారు కుటుంబాలపై శుక్రవారం గ్రామ సభలు నిర్వహించారు. పీ4లో ఎంపికైన లబ్ధిదారుల బంగారు కుటుంబం కోసం ఆర్థికస్థితిమంతులు తమ వంతు సమాకారం అందించాలని కోరారు. దారిద్ర్యరేఖకు దిగువనున్న కుటుంబాలను గుర్తించి వారికి ప్రభుత్వపరంగా అన్ని సహాయసహకారాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు, ఉప్పలపాటి హరిబాబు, వై.రహీముల్లా ఆకుపాటి వెంకటేష్, అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

'హామీలన్నింటినీ అమలుచేస్తున్నాం'

పామూరు, జూలై 25(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీలను ఏడాది కాలంలోనే కూటమి ప్రభుత్వం అమలుచేస్తుందని సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు బసరెడ్డి జయరామిరెడ్డి అన్నారు. సుపరిపాలనలో తొలి ఏడాది సందర్భంగా శుక్రవారం పట్టణంలో ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలోనే అన్నివర్గాల ప్రజలకు మేలు చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో ఉప్పలపాటి హరిబాబు, పాలపరి వెంకటేశ్వర్లు, బండ్ల నారాయణ, తదితరులు పాల్గొన్నారు. షేక్ గౌస్‌బాషా ఆధ్వర్యంలో పట్టణంలోని పేట ఏరియాలో జరిగిన కార్యక్రమంలో తెనాలి మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

దేవాలయ భూములను ఆక్రమిస్తే చర్యలు



ఆక్రమణల తొలగింపును పర్యవేక్షిస్తున్న అధికారులు

పామూరు, జూలై 25(ఆంధ్రజ్యోతి): దేవస్థానానికి చెందిన భూములను ఆక్రమిస్తే చర్యలు తీసుకొంటామని దేవదాయ శాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ పానకాలరావు అన్నారు. పట్టణంలోని విరాట్ నగర్‌లో గల సర్వే నెంబర్ 441/1,2,3, 442/1,2,3లోని 28 ఎకరాల దేవస్థాన భూమిలోని ఆక్రమణలను ఎక్స్‌కవేటర్ సహాయంతో శుక్రవారం ఆక్రమణల తొలగింపునకు శ్రీకారం చుట్టారు. విరువూరు రోడ్డులో గల సర్వేనెంబర్ 256/2లోని 29.33 ఎకరాల భజంగేశ్వరస్వామి దేవస్థానానికి చెందిన భూముల్లో నకిలీ డాక్యుమెంట్లతో చేపట్టిన నిర్మాణాలను తొలగించారు. కార్యక్రమంలో ఈవో నరసింహబాబు, సీఐ ఎం .భీమానాయక్, ఎస్ఐ టి.కిశోర్‌బాబు, బండ్లా నారాయణ, గుర్రం వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

కాలినడకన తిరుమలకు బయలుదేరిన వెంగళాయపల్లి భక్తులు

పీసీపల్లి, జూలై 25(ఆంధ్రజ్యోతి): సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి పాడి పంటలతో ప్రజలకు మేలు జరగాలని లోకకల్యాణార్థం వేంకటేశ్వర స్వామిని దర్శించుకునేందుకు శుక్రవారం కాలినడకన తిరుమలకు భక్తులు బయలుదేరారు. వెంగళాయపల్లి గ్రామానికి చెందిన 22మంది భక్తులు గత ఏడు సంవత్సరాలుగా వెళుతున్నారు. ప్రతిఏటా శ్రావణమాసంలో 272 కిలోమీటర్లు నడిచి వెళ్లి వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటారు. శుక్రవారం శ్రావణమాసం మొదలు కావడంతో ప్రతిఏటాలాగే కాలినడకన బయలుదేరారు. ముందుగా గంగమ్మ ఆలయంలో పూజలు చేశారు.

నేడు ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరం

దర్శి, జూలై 25(ఆంధ్రజ్యోతి): దర్శిలోని శ్రీశ్రీనివాస పద్మావతి కల్యాణ మండపంలో శనివారం పేలప్రోలు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదిత్య కేరళ వైద్యశాల ఉచిత ఆయుర్వేత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దర్శి పరిసర ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పేదవారికి చేయూతనివ్వాలి



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శివపార్వతి

కనిగిరి, జూలై 25(ఆంధ్రజ్యోతి): ఆర్థిక సంపన్నులు పేదకుటుంభాల ఆర్థిక పురోగతికి చేయూత అందించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శివపార్వతి అన్నారు. మండలంలోని బల్లిపల్లి గ్రామంలో శుక్రవారం పీ4 కార్యక్రమంలో భాగంగా గ్రామసభ నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద కుటుంబాల్లోని పిల్లలు ఉన్నత విద్యావంతులుంటే వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా సంపన్నులు సహకరించాలని కోరారు. కనీసం ఇళ్ళు కూడా లేనివారికి ప్రభుత్వం ద్వారా అందించే పథకాలను వర్తింపచేసేలా సహకారం అందించాలని కోరారు. గ్రామాల్లో ఎవరైనా సంపన్నులు విదేశాల్లో ఉన్నతస్థాయిలో వుంటే వారి వివరాలను అందజేయాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.


త్వరితగతిన గృహాలు నిర్మించుకోవాలి

ముండ్లమూరు, జూలై 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో పక్కా గృహాలు మంజూరైన లబ్ధిదారులు త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని హౌసింగ్ డీఈ సురేష్‌బాబు అన్నారు. శుక్రవారం మండలంలోని పూరిమిట్ల, మారెళ్ల, భీమవరం గ్రామాలను సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహాలు మంజూరైన ప్రతిఒక్కరూ నిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు. సిమెంట్, ఇనుము గోడౌన్‌లలో సిద్ధంగా ఉందన్నారు. వివిధ దశల్లో లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమచేయటం జరుగుతుందన్నారు. అనంతరం స్థానిక ఏఈ కార్యాలయాన్ని సందర్శించి సిబ్బందితో మాట్లాడారు. ప్రతిరోజు గ్రామాలను సందర్శించి లబ్ధిదారులను చైతన్యపర్చాలన్నారు. ఆగస్టు నెలాఖరు నాటికి గృహ నిర్మాణాలను 80శాతం పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈ పి.వెంకటేశ్వరరెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్ చెన్నకేశవులు, తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు అందని సాయం

దొనకొండ, జూలై 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆరవళ్లిపాడు గ్రామంలో తల్లికి వందనం పథకం నమోదులో చేసిన తప్పిదంతో అర్హులకు అందలేదు. పాఠశాలల సిబ్బంది ఆన్‌లైన్ నమోదులో ఆధార్‌కార్డు సంఖ్యను తప్పుగా నమోదు చేయటంతో తాము పథకాన్ని కోల్పోయామని పలువురు తల్లులు ఆరోపిస్తున్నారు. గ్రామంలో రెండు నుంచి ఐదో తరగతి వరకు 20 మంది, ఆరు నుంచి పదో తరగతి వరకు 81 మంది విద్యార్థులకు చెందిన తల్లుల ఖాతాల్లో తల్లికి వందనం పథకం నగదు జమకాలేదని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అర్హత ఉన్న తమ పిల్లలకు తల్లికి వందనం పథకం అందేలా చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

ఈవిషయమై ఎంఈవో సాంబశివరావును వివరణ కోరగా ఆరవళ్లిపాడు గ్రామంలో తల్లికి వందనం పథకం అందని విద్యార్థుల వివరాల నమోదును సరిచేసి ఉన్నతాధికారులకు పంపామన్నారు. గ్రీవెన్స్ లాగిన్‌లోనూ జాబితాను నమోదుచేశామన్నారు.







అభివృద్ధికి సహకరించాలని మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

జగన్ పాలనలో ఆర్థిక విధ్వంసం

- చంద్రబాబు హయాంలో అభివృద్ధి, సంక్షేమం
- పర్చూరు సభలో మంత్రి పయ్యావుల కేశవ్

పర్చూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రంలో ఆర్థిక విధ్వంసం జరిగిందని మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. మండలంలోని పర్చూరు, నాగులపాలెం గ్రామాల్లో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుతో కలసి మంత్రి పర్యటించారు. పర్చూరు నెహ్రూకాలనీలో రూ.కోటితో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొని ఇంటింటికీ తిరిగి సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను అందజేశారు. స్వయం సహాయక సంఘాలకు రూ.4 కోట్ల శ్రీనిధి చెక్కులు, 145 మందికి రూ.85 లక్షల సీఎం సహాయ నిధి చెక్కులను అందజేశారు. అగ్రికల్చర్ డ్రోన్‌ను మంత్రి పయ్యావుల, ఎమ్మెల్యే ఏలూరి ప్రారంభించారు. అనంతరం మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ ఆర్థిక సంక్షోభంలో ఉన్న రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు గాడిన పెడుతున్నారన్నారు. అభివృద్ధి, సంక్షేమం దిశగా రాష్ట్రంలో పాలన సాగుతుందన్నారు. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మాట్లాడుతూ రాష్ట్రాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలపడం చంద్రబాబుకే సాధ్యమన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పొగాకు రైతులను ఆదుకునేందుకు మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో గ్లోరియా, స్పెషల్ ఆఫీసర్ లవన్న, ఏఎంసీ చైర్మన్ గుంజి వెంకట్రావు, వైస్ చైర్మన్ శంకరశెట్టి చిరంజీవి, పార్టీ మండల అధ్యక్షులు షేక్. షంషుద్దీన్, నాయుడు హనుమంతురావు, పొద వీరయ్య, నల్లపనేని రంగయ్య చౌదరి, తాటి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

తల్లికేనా వందనం



అర్హత ఉన్నా అదృష్టం లేదు

గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో మా కుమారుడు గౌతమ్ మణికంఠ 2వ తరగతి చదువుతున్నాడు. 2022లో భార్య చనిపోయింది. అప్పటి నుంచి నా సంరక్షణలో కుమారుడు ఉన్నాడు. తల్లికి వందనం పథకాన్ని అమలు చేయాలని జూన్‌లో అర్జీ పెట్టుకున్నాను. అయితే ఇంతవరకు ఎలాంటి స్పందన రాలేదు. ప్రభుత్వం ఈ పథకాన్ని తమ లాంటి వారికి కూడా అమలు చేయాలి.

- పద్మారావు, పోతుమర్రు

కుటుంబంలో బడికి వెళ్లే పిల్లలు ఎందరు ఉన్నా.. అందరికీ తల్లికి వందనం ఇస్తామని సూపర్ సిక్స్‌లో కూటమి ప్రభుత్వం ప్రకటించింది. చెప్పి నట్లుగానే గత నెలలో తల్లికి వందనం పథకాన్ని ప్రభుత్వం వర్తింప చేసింది. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో ఐదుగురు పిల్లలు ఉన్న తల్లుల ఖాతాల్లో కూడా తల్లికి వందనం నగదు జమ చేశారు. చెప్పి నట్లుగానే నగదు జమ అవడంతో ఆయా కుటుంబాల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. అయితే వివిధ కారణాల వల్ల తల్లులు దూరమైన పిల్లలు ఈ అదృష్టానికి నోచుకోలేక పోయారు. తల్లి మృతి చెందిన పిల్లలు తండ్రులు, అమ్మమ్మ, నానమ్మల ఆశ్రయంలో ఉంటూ బడికి వెళ్తున్నా వారికి తల్లికి వందనం పథకం అమలు కాలేదు. ఈ పరిస్థితుల్లో తల్లి లేని పిల్లలకూ అంటే తండ్రులకూ ఈ పథకాన్ని వర్తింప చేయాలని పలువురు ఆయా సచివాలయాల్లో, తహసీల్దార్, కలెక్టర్ గ్రీవెన్స్‌ల్లో అర్జీలు అందజేస్తున్నారు.

- తల్లి మృతి చెందిన పిల్లలకు అందదా
- తండ్రులకూ వర్తింప చేయాలని గ్రీవెన్స్‌లో అర్జీలు

వేమూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): గత ఎన్నికల ప్రచారంలో చెప్పినట్లుగా కూటమి ప్రభుత్వం గత నెలలో తల్లికి వందనం పథకం అమలు చేసింది. కుటుంబంలో ఎంతమంది



విద్యార్థిని అనన్యతో తండ్రి రజనీకాంత్

పిల్లలు ఉన్నా వారందరికీ రూ.13 వేలు చొప్పున నగదు జమచేసింది. అయితే అన్ని అర్హతలు ఉన్నా కేవలం తల్లి మృతి చెందిన కారణంగా పలువురు పిల్లలకు ఈ పథకం అమలు కాలేదు. తల్లి దూరమైనా వారి సంతానం తండ్రి వద్ద ఆశ్రయం పొందుతుంటోంది. అయితే ఈ పథకానికి అర్హత తల్లి పేరుతో బ్యాంకు ఖాతా ఉండటంతో తండ్రి ఆశ్రయంలో ఉంటున్న పిల్లలకు నగదు జమ కాలేదు. తల్లి లేని విద్యార్థులకు తండ్రి బ్యాంకు ఖాతాల ద్వారా పథకాన్ని వర్తింపజేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ ప్రకారం సాయం అందించాల్సి ఉండగా ఆ విషయాన్ని ప్రభుత్వం మరిచింది. అనర్హుల జాబితాలో తమ పిల్లల పేర్లు చూసుకున్నవారు, నగదు జమ కాని తండ్రులు గ్రీవెన్స్ ద్వారా అర్జీలు దాఖలు చేశారు. అయితే రెండో విడత ఈ నెల 10న పలువురికి నగదు జమ చేశారు. ఇందులోనూ నగదు జమ కాకపోవడంతో తండ్రులు నిరాశకు గురయ్యారు. గ్రీవెన్స్‌ల్లో తాము ఇచ్చిన అర్జీలకు స్పందన లేకపోవడంపై

(మిగతా 6వ పేజీలో)

బైపాస్.. జఠిలం

- 167ఏ రహదారి భూసేకరణలో ప్రతిష్ఠంభన
- పరిహారంపై రైతులను ఒప్పించిన రెవెన్యూ అధికారులు
- లిఖిత పూర్వక హామీపై సానుకూలంగా స్పందించని హైవే అథారిటీ

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

బాపట్ల జిల్లా ఓడరేవు - పల్నాడు జిల్లా పొందుగల 167ఏ జాతీయ రహదారి నిర్మాణంలో జాప్యం జరుగుతోంది. రహదారి పనులు బాపట్ల జిల్లా పరిధిలో వేగవంతంగా జరుగుతుండగా పల్నాడు జిల్లాలో భూసేకరణ సమస్య కారణంగా పనులు నిలిచిపోయాయి. నరసరావుపేట బైపాస్ మినహా మిగతా ప్రాంతాల్లో భూసేకరణ ప్రక్రియ దాదాపు పూర్తి కావచ్చింది. జాతీయ రహదారుల సంస్థ(ఎన్‌హెచ్) ఆధ్వర్యంలో రెండు ప్యాకేజీలుగా పనులు చేపట్టగా ప్యాకేజి ఒకటిలో పనులు చురుగ్గా సాగుతున్నాయి. అయితే నరసరావుపేట బైపాస్‌కు భూసేకరణ విషయంలో అధికార యంత్రాంగం, రైతుల మధ్య వివాదం కొనసాగుతోంది. బాధిత రైతులు, స్థల యజమానులు హైకోర్టును ఆశ్రయించడంతో ఐదేళ్లుగా భూసేకరణ నిలిచిపోయింది. అయితే ఇటీవల బైపాస్‌కి అవసరమైన 279.16 ఎకరాలకు సంబంధించి పరిహారంపై రెవెన్యూ అధికారులు సూచించిన పరిహారానికి రైతులు అంగీకరించారు. నరసరావుపేట పట్టణ పరిధిలో ఉన్న వ్యవసాయ భూమికి రిజిస్ట్రేషన్ విలువపై రెండు రెట్లు, జొన్నలగడ్డ, కేసానుపల్లి, రావిపాడు, గుంటగర్లపాడు గ్రామాల పరిధిలోని భూములకు రెండున్నర రెట్లు పరిహారం చెల్లిస్తామని రెవెన్యూ అధికారులు బాధిత రైతులను ఒప్పించారు. ఇళ్ల స్థలాలకు గజానికి రూ.19,000, రహదారికి లోపల ఉన్న ఇళ్ల స్థలాలకు రూ.16,000 చెల్లిస్తామని ఆ సమావేశంలో ఆర్డీవో తెలిపారు. ఈ మేరకు భూములు, ఇళ్ల స్థలాలు కోల్పోయే వారి నుంచి సంబంధిత పత్రాలను రెవెన్యూ అధికారులు స్వీకరించారు. అయితే హైవే అథారిటీ అధికారుల నుంచి సానుకూలత కానరావడం లేదు.

లిఖిత పూర్వక హామీపై రైతుల పట్టు

రెవెన్యూ శాఖ తెలియజేసిన ప్రకారం పరిహారం చెల్లిస్తే భూములు ఇస్తామని బాధిత రైతులు చెబుతున్నారు. పరిహారం ఎంత చెల్లిస్తారో లిఖిత పూర్వకంగా ఒప్పంద పత్రాలు రాసిస్తేనే తాము కోర్టులో పిటిషన్లను ఉపసంహరించు కుంటామంటున్నారు. అయితే పరిహారంపై లిఖిత పూర్వకంగా తాము హామీ ఇవ్వలేమని రెవెన్యూ అధికారులు చెప్తున్నారు. హైవే అథారిటీ అధికారులకు సమాచారం ఇచ్చామంటున్నారు. ఈ నేపథ్యంలో కోర్టులో పిటిషన్లను ఉపసంహరించుకునేందుకు రైతులు అంగీకరించడంలేదు. రైతులు కోర్టులో వేసిన కేసును ఉపసంహరిస్తేనే భూసేకరణ ముందుకు సాగే పరిస్థితి నెలకొంది.

మెడికిల్ ప్రాక్టీషనర్లు

- ప్రాణాలపైకి తెస్తోన్న ఆర్‌ఎంపీల వైద్యం
- నిబంధనలకు విరుద్ధంగా అన్ని జబ్బులకు చికిత్సలు

జ్వరం అని వెళ్తే ఊపిరిపోయింది..

ఇటీవల తెనాలి ప్రాంతంలో చిరు వ్యాపారి అయిన ఓ మహిళ జ్వరం, ఒళ్లు నొప్పులు ఉన్నాయని స్థానిక ఆర్‌ఎంపీని ఆశ్రయించారు. రెండు ఇంజక్షన్లు చేయగా జ్వరం, నొప్పులు మాయమయ్యాయి. మరుసటి రోజు మళ్లీ జ్వరం వచ్చింది. తిరిగి ఆర్‌ఎంపీని సంప్రదించగా ఇంజక్షన్లు ఇచ్చారు. ఇలా నాలుగురోజులు చేశారు. రోగి మరింత నీరసించిపోగా బంధువులు ఆర్‌ఎంపీని నిలదీయడంతో పెద్దాసుపత్రికి వెళ్లమని సలహా ఇచ్చాడు. దీంతో జిల్లా ప్రభుత్వవైద్యశాలను సంప్రదించగా వైద్యులు పరీక్షలు చేసి డెంగ్యూ జ్వరంగా గుర్తించారు. అయితే అప్పటికే ప్లేట్‌లెట్స్ 25 వేలకు పడిపోవడంతో గుంటూరుకు తరలించారు. జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది.



రేపల్లె, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ప్రథమ చికిత్స మాత్రమే చేయాల్సిన రూరల్ మెడికల్ ప్రాక్టీషనర్లు(ఆర్‌ఎంపీలు) ఎంబీబీఎస్, ఎంఎస్ వైద్యుల తరహాలో వైద్యం అందిస్తున్నారు. వైద్య సలహాలకే పరిమితం కావాల్సిన వారు ఒక్క శస్త్ర చికిత్సలు మినహా మిగిలిన అన్ని తరహా చికిత్సలు చేస్తున్నారు. ప్రైవేటు వైద్యశాలల్లో దోపిడీ తట్టుకోలేక, ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యంపై అనుమానంతో పలువురు సామాన్యులు, మధ్య తరగతి వారు ఎక్కడి కక్కడ అందుబాటులో ఉన్న ఆర్‌ఎంపీలను ఆశ్రయిస్తున్నారు. ఇదే అవకాశంగా ఆర్‌ఎంపీలు రెచ్చిపోతున్నారు. మిడిమిడిజ్ఞానంతో అందిస్తున్న వైద్యం చివరకు రోగుల ప్రాణాలపైకి తెస్తోంది. జ్వరం అని వచ్చే రోగులకు సాధారణ వైద్యం అందిస్తూ పిండేసుకుంటున్నారు. చివరకు అది డెంగ్యూ, మలేరియా జ్వరాలను తేలేసరికి బాధితులు ప్రాణాలు కోల్పోతున్నారు. జిల్లా పరిధిలో మారుమూల గ్రామం నుంచి జిల్లా, మున్సిపల్ కేంద్రాల్లో పలువురు ఆర్‌ఎంపీలుగా అవతారం ఎత్తి ఏ రోగానికైనా చికిత్సలు అందిస్తున్నారు. ప్రజల అమాయకత్వాన్ని ఆసరగా చికిత్సల పేరుతో రకరకాల ఇంజక్షన్లు చేస్తూ, సెలైన్లు ఎక్కిస్తూ, స్టెరాయిడ్స్ వినియోగిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఎంతకీ రోగం తగ్గక పోవడంతో

(మిగతా 6వ పేజీలో)



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జె.వెంకటమురళి

విపత్తులపై అప్రమత్తంగా ఉండాలి

తుఫాన్ హెచ్చరికలపై అధికారులకు కలెక్టర్ ఆదేశాలు

బాపట్ల, జూలై 25 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో విపత్తులను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ వెంకటమురళి అధికారులను ఆదేశించారు. విపత్తు నిర్వహణ, నిర్మూలనా ప్రణాళికపై జిల్లా, మండల స్థాయి అధికారులతో కలెక్టరేట్‌లో శుక్రవారం కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎగువ ప్రాంతాల్లో అధికంగా వర్షాలు కురుస్తున్నందున కృష్ణానదికి వరదలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కరకట్టపై నివాసం ఉంటున్న గృహాలపై సర్వే చేయాలన్నారు. కరకట్టకు గండ్లు పడకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. ఇసుక, కంకర బస్తాలు సిద్ధం చేసుకుని కట్టను బలోపేతం చేయాలన్నారు. నిత్యావసర సరుకులు సిద్ధంగా ఉంచుకోవాలని చెప్పారు. తీరానికి 10 కిలోమీటర్ల మేర తుఫాన్ ప్రభావం చూపే అవకాశం ఉందని, గర్భిణులు, వృద్ధులు, దీర్ఘకాల వ్యాధిగ్రస్తులు, చిన్నారుల వివరాలు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. పునరావాస కేంద్రాల ఏర్పాటు, గ్యాస్ సిలెండర్, డీజీల్, కిరోసిన్, జనరేటర్లు, చెట్లు తొలగించడానికి యంత్రాలను కూడా సిద్ధం చేసుకోవాలన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి జేసీ గంగాధర్‌గౌడ్ పాల్గొన్నారు.

బంగారు కుటుంబాల దత్తత త్వరగా పూర్తి చేయాలి

- కలెక్టర్‌కు సూచించిన సీఎం చంద్రబాబు

బాపట్ల, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : బంగారు కుటుంబాల దత్తత కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని సీఎం చంద్రబాబు శుక్రవారం వీడియోకాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ జె.వెంకటమురళికి సూచించారు. పీ4 కార్యక్రమం అమలుపై కలెక్టర్ వెంకటమురళి, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, స్థానిక అధికారులతో ముఖ్యమంత్రి వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. పీ4 కార్యక్రమంలో నేనున్నానంటూ కుప్పం నియోజకవర్గంలో 250 కుటుంబాలను దత్తతు తీసుకున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌ను 2047 నాటికి స్వర్ణాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దటమే నిర్దేశిత లక్ష్యాలను పెట్టుకున్నట్లు తెలిపారు.

వైసీపీ పాలనలో ఆర్టీసీ అధోగతి

- పునరుత్తేజంతో సంస్థ అభివృద్ధికి చర్యలు
- బాపట్లలో మోడల్ బస్టాండ్, స్టేడియం నిర్మాణం
- రాష్ట్ర రవాణా, క్రీడల శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

బాపట్ల, జూలై 25 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఐదేళ్ల పాలనలో ఆర్టీసీ అధోగతిపాలైందని రాష్ట్ర రవాణా, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. బాపట్ల ఆర్టీసి డిపోను శుక్రవారం మంత్రి సందర్శించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ డిపోలకు కొత్తబస్సులతో పాటు బస్టాండ్లలో ప్రయాణికులకు అవసరమైన సౌకర్యాలపై దృష్టి సారించామన్నారు. పునరుత్తేజంతో ఆర్టీసీ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఆర్టీసీకి పూర్వవైభవం వస్తుందన్నారు. బాపట్ల డిపోకు 20 ఎలక్ట్రిక్ బస్సులు రానున్నాయన్నారు. బాపట్ల డిపోను మోడల్ బస్టాండ్‌గా అభివృద్ధి చేస్తామన్నారు. కూటమి వచ్చాక కార్గో సర్వీస్‌లు అందుబాటులోకి తేవడంతోపాటు కార్పొరేషన్ కంటే మెరుగైన సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్మికుల పక్షపాతి



సభలో మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

గా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. వచ్చే నెల 15 నుంచి ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం అమలు చేస్తామని చెప్పారు. జిల్లా కేంద్రమైన బాపట్లలో 7.2 ఎకరాల్లో అధునాతన హంగులతో స్టేడియం నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ మాట్లాడుతూ బాపట్ల డిపోలో మోడరన్ టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని కోరారు. డిపోకు 12 బస్సులు కావాలన్నారు. బెంగళూరు, హైదరాబాద్, తిరుపతిలకు సర్వీస్‌లు ఏర్పాటు చేయాలన్నారు. ఉత్తమ సేవలందించిన కార్మికులకు మంత్రి ప్రశంసపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బాపుడా చైర్మన్ సలగల రాజశేఖర్‌బాబు, ఇన్‌చార్జి జేసీ జి.గంగాధర్‌గౌడ్, మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి, ఆర్టీసీ ఈడీ నాగేంద్ర ప్రసాద్, ఆర్‌ఎం డి.సామ్రాజ్యం, డీఎం బి.శ్రీమన్నారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొండమూది బంగారుబాబు, పరిశీలకుడు బి.శివసాంబిరెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, తహసీల్దార్ షేక్.సలీమా, ఆర్టీసీ యూనియన్ నాయకులు అన్నం నాగేశ్వరరావు, సాంబయ్య, బీటీ వలి, టి.రజని తదితరులు పాల్గొన్నారు.

వీడిన చిక్కుముడులు

- కొత్తపేట పంచాయతీ ఎన్నికలకు సిద్ధం
- పలు కారణాలతో 2018లో ఎన్నికలకు ఆటంకం
- 13 ఏళ్ల తర్వాత పంచాయతీలో ఎన్నికల పండుగ

చీరాల, జూలై 25 (ఆంధ్రజ్యోతి): వేటపాలెం మండలం కొత్తపేట పంచాయతీ ఎన్నిక చిక్కుముడులు వీడాయి. కోర్టు ఆదేశాల నేపథ్యంలో వచ్చే నెలలో ఎన్నికలకు అధికారులు సిద్ధమవుతున్నారు. 2018లో ఎన్నికలు జరగాల్సి ఉండగా అనివార్య కారణాలతో ప్రక్రియ వాయిదా పడింది. అదే సమయంలో పరిపాలనా సౌలభ్యం కోసం పునర్విభజనకు అధికారులు ప్రతిపాదనలు చేశారు. ఈ క్రమంలో 2019లో విభజన, కలుపుకోవడం అడ్డదిడ్డం గా జరిగింది. ఈ క్రమంలో పట్టణానికి సమీపంలో ఉండే కొత్తపేట మూ డు ముక్కలైంది. కొత్తపేటలోని ప్రసాద్‌నగర్‌లో కొంత భాగం, రోశయ్య కాలనీ, ప్రతిభభారతినగర్, వడ్డెర సంఘం ప్రాంతాలను సుదూరంగా ఉండే పాపాయిపాలెంలో కలిపారు. భౌగోళికంగా వాడరేవు పంచాయతిలో ఉన్న కీర్తివారిపాలేన్ని ఐదు కిలో మీటర్లు దూరంలో ఉన్న బుర్లవారిపాలెంలో అనుసంధానం చేశారు. ఇందుకు సంబంధించి 2019 డిసెంబరులో అధికారులు ఉత్తర్వులు కూడా జారీ చేశారు. ఆ తర్వాత 2020లో ఎన్నికల నోటిఫికేషన్ కూడా జారీ చేశారు. దీంతో ఆగ్రహించిన కీర్తివారిపాలెం మాజీ పీడీసీసీ బ్యాంకు మాజీ డైరక్టర్ గడ్డం శ్రీనివాసరావు, కొత్తపేట

కొత్తపేట వ్యూ



మాజీ సర్పంచ్ చుండూరి వాసులు కోర్టులో వేర్వేరుగా రిట్ పిటిషన్ దాఖలు చేశారు. దీంతో ఆయన జోక్యంతో అప్పట్లో ఎన్నికలు నిలిచాయి. పాత పద్ధతిలోనే గ్రామాలను ఉంచి ఎన్నికలు జరపాలని నాలుగు నెలలకే తీర్పు ఇచ్చింది. అయితే అప్పటి పాలకులకు గెలుపు ధీమా లోపించడంతో ఎన్నికలకు వెళ్లలేదు. ఈ క్రమంలో తాజాగా గ్రామస్థులు కోర్టును ఆశ్రయించగా కోర్టు ఆదేశాలతో ఎన్నికలకు అధికారులు సన్నద్ధమయ్యారు. ఇప్పటికే ఓటరు పబ్లికేషన్ జరిగింది. నోటిఫికేషన్ త్వరలో రానున్నట్లు అధికారులు చెబుతున్నారు. 13 సంవత్సరాల తర్వాత గ్రామంలో ఎన్నికల పండుగ వాతావరణం నెలకొనన్నుది.

ఆర్థిక సంఘం నిధులు నై..

2013 నుంచి కొత్తపేట పంచాయతీలో ఎన్నికలు జరగలేదు. ఇదేవిధంగా నియోజకవర్గ పరిధిలో మేజర్, చిన్న పంచాయతీలకు కలుపుకుని సుమారు రూ.100 కోట్ల ఆర్థిక సంఘం నిధులు ఆగిపోయాయి. నిధులు లేకపోవడంతో తాగునీటి వసతులు సహా ఇతర మౌలిక వసతులు సైతం కనుమరుగై ప్రజలు అల్లాడారు. రహదారుల మరమ్మతులతో పాటు విద్యుత్ దీపాల వెలుగులకు ఆయా గ్రామాలు నోచుకోలేదు.

ఆమడ దూరంలో.. ఆపదకు అడ్డుగోడ

మడ వృక్షాల పెంపకానికి ప్రభుత్వం కృషి

బాపట్ల/రేపలె, జూలై 25 (ఆంధ్రజ్యోతి): సముద్ర తీర ప్రాంతంలో రక్షణ కవచంగా, పర్యావరణ రక్షణకు దోహదపడే మడ మొక్కలు పెంపకంపై అటవీశాఖ దృష్టి సారించింది. తీర ప్రాంతంలోని బాపట్ల జిల్లాల్లో మడ అడవుల అభివృద్ధికి చర్యలు చేపట్టింది. గతంలో నాటిన మొక్కలు ఏపుగా పెరిగి దేశంలోనే అత్యధిక స్థాయిలో మడ అడవుల పెంపకంలో తీర ప్రాంతం ముందంజలో ఉంది. జిల్లాలో నిజాంపట్నం నుంచి చినగంజాం వరకు 67 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో మడ అడువులు వ్యాపించి ఉండేవి. రెండు దశాబ్దాలుగా నరికివేతకు గురవుతున్నాయి. నిజాంపట్నం అడవుల దీవి, రేపల్లె, కర్లపాలెం, బాపట్ల, మండలాలలో నరికివేతతో కనుమరుగయ్యాయి. దీనికితోడు చెట్లను నరికివేసి రొయ్యల చెరువులుగా మార్చేసుకున్నారు. తుపాను తీవ్రత తగ్గించేందుకు, తీరప్రాంత గ్రామాల్లో భూగర్భ జలాలు క్షారమయం కాకుండా కాపాడేందుకు, వివిధ పక్షి జాతులు, క్రిమికీటకాలు, చేపల వృద్ధికి దోహదపడుతున్న మడ చెట్లను విచక్షణా



రహితంగా నరికివేస్తున్నారు. అమూల్యమైన మడ అడువులను వంట చెరకు కోసం, చేపల, రొయ్యల చెరువుల సాగు కోసం, ఇళ్ల చుట్టూ దడి కట్టేందుకు నరికివేస్తున్నారు. తమకు పరోక్షంగా జీవనోపాధి కల్పిస్తున్న విషయాన్ని మత్స్యకారులు సైతం గ్రహించలేక పోతున్నారు.

తీరప్రాంతానికి రక్షణ కవచం..

మడ అడువులు తుఫాన్‌లు, సునామీలు, వరదల నుంచి తీరప్రాంతాలను రక్షిస్తాయి. కార్బన్‌ను నిల్వ చేసి వాతావరణ మార్పులను ఎదుర్కోవడంలో సహాయపడతాయి. మడ వృక్షాలు 20 నుంచి 30 అడుగుల ఎత్తు పెరిగి.. సముద్రజీవులకు సంతానోత్పత్తి ప్రదేశాలను కూడా అందిస్తాయి. కోతను తగ్గిస్తాయి. నీటిని శుద్ధి చేయడంలో సహాయపడుతాయి. గతంలో లైలా, ఓగ్ని, పైలిన్, లెనిన్, నీలం తుఫాన్‌ల నుంచి మడ అడవులు ఎలాంటి నష్టం సంభవించకుండా అడ్డుగోడగా నిలిచాయి. 2012లో సంభవించిన నీలం తుఫాన్ రేపల్లె మండలం లంకెవానిదిబ్బ సమీపంలోని మడ అడవుల మధ్య చిక్కుకుని బలహీన పడి తీరం దాటిన సంగతి విధితమే.


ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న జిల్లా సైన్స్ అధికారి మహ్మద్ సాధిక్

పర్యావరణంపై విద్యార్థులకు అవగాహన

వేటపాలెం(చీరాల), జూలై 25 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని జిల్లా సైన్స్ అధికారి మహ్మద్ సాదిక్ అన్నారు. శుక్రవారం వేటపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. ఈసందర్భంగా విద్యార్థులకు శాస్త్రీయ పరిజ్ఞానంపై అవగాహన కల్పించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై పలు సూచనలు చేశారు. అయితే అవగాహన పొందిన అంశాల కొనసాగింపులో ఉపాధ్యాయులు ప్రత్యేక భూమిక పోషించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని సరోజిని, సోమశేఖర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


ముగ్గు వేసిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న వేలమూరిపాడు గ్రామస్థులు

వేలమూరిపాడులో క్షుద్ర పూజల కలకలం

● అమావాస్య రోజు అర్ధరాత్రి సమయంలో ముగ్గుతో మహిళ బొమ్మ వేసి పూజలు

అద్దంకి,జూలై25(ఆంధ్రజ్యోతి):అమావాస్య రోజు అర్ధరాత్రి సమయంలో మహిళ బొమ్మను ముగ్గుతో గీసి పూజలు చేయటం మండలంలోని వేలమూరిపాడులో కలకలం రేపింది. వివరాలలోకి వెళితే.. మండలంలోని వేలమూరిపాడు ఎస్సీ కాలనీ నుంచి గుండ్లకమ్మ నది సమీపంలోని శ్మశానానికి వెళ్లే దారిలో దింపుడు కల్లం వద్ద గురువారం అర్ధరాత్రి కారులో వచ్చిన వ్యక్తులు పూజలు నిర్వహించారు. అనంతరం కొద్దిసేపటికి ఎస్సీ కాలనీలో నుంచి అద్దంకి వైపు వచ్చారు. అయితే స్థానికులు పెద్ద గా పట్టించుకోలేదు. శుక్రవారం ఉదయం ఎస్సీ కాలనీ వాసులు అటు వైపు వెళ్లగా దారి మధ్యలో ముగ్గుతో మహిళ బొమ్మ వేసి ఉంది. అక్కడే పూజలు చేసిన ఆనవాళ్లతో పాటు సమీపంలో మహిళ ధరించిన తడిచిన చీర, ఇతర దుస్తులు కూడా ఉన్నాయి. సుమారు 101 నిమ్మకాయలు కోసి పడవేశారు. పసుపు, కుంకుమలతో పూజలు చేసిన ఆనవాళ్లు ఉన్నాయి. విషయం తెలుసుకున్న గ్రామస్థులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. క్షుద్ర పూజలు చేసిన విషయం తెలుసుకొని గ్రామస్థులు ఆందోళనకు గురవుతున్నారు.

పేద ముస్లింలకు న్యాయపరమైన సహాయ, సహకారాలు


మాట్లాడుతున్న ఎండబ్ల్యూఏపీపీ రాష్ట్ర లీగల్ సెల్ ఇన్‌చార్జి అబ్దుల్‌జబ్బార్

అద్దంకిటౌన్, జూలై 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయిలో అనేక మంది పేద ముస్లింలు సివిల్, క్రిమినల్ కేసులకు సంబంధించి సమస్యలు వచ్చినప్పుడు అ వగాహన లేక ఇబ్బందులు పడుతూ , మానసికంగా, ఆర్థికంగా నష్టపోతున్నారని, వారందరికీ న్యాయపరమైన సహాయ సహకారాలు అందిస్తామని ఎండబ్ల్యూఏపీపీ రాష్ట్ర లీగల్ సెల్ ఇన్‌చార్జి షేక్ అబ్దుల్ జబ్బార్ అన్నారు. శుక్రవారం స్థానిక జూనియర్ కళాశాల సమీపంలోని ముస్లిం సంక్షేమ సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ జిల్లా స్థాయిలో సేవలు అందించేందుకు ప్రతి జిల్లాకు ఎండబ్ల్యూఏపీపీ ఇన్‌చార్జిలను త్వరలో నియమిస్తామన్నారు. ముందుగా ఉమ్మడి ప్రకాశం జిల్లా ఒంగోలు, బాపట్లలో నియామకం అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఏర్పాటు చేసి పేద ముస్లింలకు సహాయసహకారాలు అందిస్తామని తెలిపారు.

కారును ఢీ కొన్న లారీ


లారీ ఢీ కొనడంతో దెబ్బతిన్న కారు

మేదరమెట్ల, జూలై 25(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిలో చెన్నై వైపు వెళ్తున్న లారీ వెనుక టైరు బోల్టులు ఊడడంతో అదుపుతప్పి డివైడర్‌పై నుంచి చిలకలూరిపేట వైపు వెళ్లున్న కారును ఢీ కొంది. శుక్రవారం పల్నాడు జిల్లా దాచేపల్లి నుంచి పౌడర్ లోడుతో చెన్నై వెళ్తున్న లారీ తిమ్మనపాలెం సమీపంలో ఎడమ వైపు టైరుకు ఉన్న నట్లు ఊడాయి. దీంతో అదుపుతప్పి డివైడర్ పైగా అవతలివైపునకు వెళ్లి అటు వైపు నుంచి వస్తున్న కారును ఢీ కొంది. ఈ ప్రమాదంలో కారులోని, లా రీలోని వ్యక్తులకు ఎటువంటి గాయాలు కాలేదు. కారు మాత్రం దెబ్బతింది. మేదరమెట్ల పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

34 మంది ఐటీఐ విద్యార్థులకు ఉద్యోగాలు

ఒంగోలు విద్య, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు సమీపంలోని శ్రీశివసాయి ఐటీఐలో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 34మంది ఐటీఐ విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. 56 మంది జాబ్‌మేళాకు హాజరు కాగా వారిలో 34 మంది ఉద్యోగాలకు పలు కంపెనీలకు చెందిన ప్రతినిధులు ఎంపిక చేశారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి నెలకు రూ.12నుంచి రూ.15 వేల వేతనం లభిస్తుందని కంపెనీ ప్రతినిధులు జయదేవ్, వెంకటరమణ తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ బాలుర ఐటీఐ ట్రైనింగ్ ఆఫీసర్, జిల్లా అప్రంటీస్ అడ్వయిజర్ కె.కృష్ణమూర్తి, శ్రీశివసాయి ఐటీఐ కరస్పాండెంట్ కారుమూడి శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ ఎం.ప్రభాకరరావు, ఆంజనేయులు, రాజేష్, రమ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు యూటీఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా

ఒంగోలు విద్య, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం శనివారం సాయంత్రం స్థానిక డీఈవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు షేక్ అబ్దుల్ హై, డి.వీరాంజనేయులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో టీచర్ల బదిలీలు, ఉద్యోగోన్నతుల ప్రక్రియ పూర్తయ్యి రెండు నెలలు కావాస్తున్నా ఇంత వరకు క్యాడర్ స్ట్రెన్త్, పోజిషన్ ఐడీలు రాని ఫలితంగా రెండు నెలలుగా టీచర్లకు జీతాలు లేవన్నారు. ఉపాధ్యాయులకు పెరిగిన బోధనేతర కార్యక్రమాలు తగ్గించాలని డిమాండ్లతో ధర్నా చేపట్టినట్లు తెలిపారు.

ఆయకట్టు చివరి భూములకూ సాగర్ నీరు

● మంత్రి రవికుమార్


మక్కెనవారిపాలెంలో స్కూలు విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేసిన అనంతరం వారితో మాట్లాడుతున్న మంత్రి రవికుమార్

అద్దంకి,జూలై25(ఆంధ్రజ్యోతి): చివరి ఆయ ఎకట్టు వరకు సాగు నీరు అందిస్తామని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. సంతమాగులూరు మండలంలోని మక్కెనవారిపాలెంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్య క్రమంలో మంత్రి రవికుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే మేజర్, మైనర్ కాలువలకు మరమ్మతులు, పూడికతీత పనులు పూర్తి చేశామన్నారు. ఇంకా కాలువలకు ఎక్కడైనా పూడిక తీత పనులు చేయాల్సి ఉంటే రైతులు సమాచారం అందిస్తే వెంటనే చేయిస్తామన్నారు. గత ఏడాది సొంత నిధులతో కాలువల పూడిక తీత పనులు చేపట్టిన విషయాన్ని ఈ సందర్భంగా రైతులకు రవికుమార్ గుర్తు చేశారు.త్వరలో రైతుల ఖాతాలలో రైతు భరోసా డబ్బులను ప్రభుత్వం జమ చేస్తుందన్నారు.విద్యాభివృద్ధికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. మక్కెనవారిపాలెం యూపీ పాఠశాలలో 104 మంది విద్యార్థులకు, మక్కెనవారిపాలెం హైస్కూల్ లో 349 మంది విద్యార్థులకు సీఎస్ఆర్ నిధుల ద్వారా సైకిళ్ల పంపిణీ చేశారు. అద్దంకి నియోజకవర్గంలో 6 నుంచి 10 వ తరగతి చదువుతున్న 10 వేల మంది విద్యార్థులకు డిసెంబర్ నాటికి 10 వేల సైకిళ్ల పంపిణీ పూర్తి చేస్తామన్నారు. ఈ సందర్భంగా సీఎస్ఆర్ నిధులతో సైకిళ్లు అందజేసిన కార్పొరేట్ సంస్థ ఉపాధ్యక్షుడు రఘురామ్‌ను మంత్రి రవికుమార్ అభినందించారు. మక్కెనవారిపాలెం హైస్కూల్‌లో వాటర్‌ప్లాంట్ అవసరమని చెప్పటంతో వెంటనే ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అసంపూర్తి భవనాలు పూర్తి చేయటంతో పాటు అవసరమైతే అదనపు భవనాలు నిర్మిస్తామన్నారు. 30 లక్షల రూపాయలతో నిర్మించిన సీసీ రోడ్లను మంత్రి రవికుమార్ ప్రారంభించారు. 46 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్‌లను మంత్రి అందజేశారు. ఇంటింటికీ తిరిగి ఏడాదిలో కూటమి ప్రభుత్వం అందించిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను రవికుమార్ వివరించారు. ఈ కార్య క్రమంలో ఏఎంసీ చైర్మన్ తేలప్రోలు రమేష్, టీడీపీ నాయకులు మక్కెన జగదీష్, ఏలూరి శ్రీనివాసరావు, కోయి నరసింహారావు, బాషా, మస్తాన్‌వలి తదితరులు పాల్గొన్నారు.

రక్షణ గోడ లేని కల్వర్టు

● ప్రమాదాల బారిన వాహనదారులు


దైవాలరావూరు - మేదరమెట్ల మధ్య రక్షణ గోడ పడిపోయి ప్రమాదకరంగా ఉన్న కల్వర్టు

మేదరమెట్ల, జూలై 25(ఆంధ్రజ్యోతి): మేదరమెట్ల నుంచి రాచపూడి వెళ్లే రోడ్డులో దైవాలరావూరు వద్ద కల్వర్టు రక్షణ గోడ పడిపోయి ప్రమాదకరంగా మారింది. మేదరమెట్ల నుంచి రావినూతల వెళ్లేటప్పుడు దైవాలరావూరు దాటగానే రోడ్డు మలుపు తిరుగుతుంది. ఆ మలుపులో ఉన్న కల్వర్టుకు ఉన్న రక్షణ గోడ పడిపోయి సుమారు ఐదు సంవత్సరాలు పైగా అయింది. కొత్తగా ఈ రోడ్డున వచ్చే ద్విచక్రవాహన దారులు, కార్లలో ప్రయాణించే వారు మలుపు వద్ద కల్వర్టు ఉన్న విషయం తెలియక ప్రమాదాలకు గురవుతున్నారు. కల్వర్టు గోడ పడిపోయిన చోట దాదాపు పది అడుగుల గొయ్యి ఉంది. పలువురు ద్విచక్రవాహన దారులు కింద పడడంతో తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదాలు జరుగుతుండడంతో స్థానికులు కర్రలు పాతి వాటికి గుడ్డలు కట్టారు. నిత్యం ఈ రోడ్డులో తిరిగే వారు మినహా కొత్తగా వచ్చే వారు వేగం అదుపు కాక ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ రోడ్డులో నిత్యం వందలాది వాహనాలు తిరుగుతుంటాయి. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి రక్షణ గోడ నిర్మించాలని వాహనచోదకులు కోరుతున్నారు.

అష్టలక్ష్మి ఆలయంలో విశేష పూజలు


అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న మహిళా భక్తులు

పర్చూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : తొలి శ్రావణ శుక్రవారం సందర్భంగా పర్చూరులో వేంచేసియున్న శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి సమేత అష్టలక్ష్మీ అమ్మవారి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమంలో భాగంగా అమ్మవారికి మణిద్వీప వర్ణన పారాయణం, కల్యాణ కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొని అమ్మవారికి పూజలు చేసి భక్తిని చాటుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

వాసవి కన్యాకాపరమేశ్వరి ఆలయంలో

అద్దంకి,జూలై25(ఆంధ్రజ్యోతి): శ్రావణ శుక్రవారం పూజలను అద్దంకి పట్టణంలోని వాసవికన్యకాపరమేశ్వరి దేవాలయంలో వైభవంగా నిర్వహించారు. శ్రావణ మాసం తొలి శుక్రవారం సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు.


ప్రత్యేక అలంకరణలో అద్దంకిలోని కన్యకాపరమేశ్వరి అమ్మవారు

కాంట్రాక్టు విధానాలను ఉపసంహరించుకోవాలి

● రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు


సమావేశంలో మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

ఒంగోలు కలెక్టరేట్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీల్లో కార్మికులను కాంట్రాక్టర్‌కు అప్పగించే విధానాలను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని మునిసిపల్ కార్మికుల యూనియన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. ఒంగోలులోని సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం మునిసిపల్ కార్మికుల యూనియన్ జనరల్ బాడీ సమావేశం జి.నరసింహ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు మాటాడుతూ నెల్లూరు నగర పాలక సంస్థలో రెండు డివిజన్ల పరిధిలో వర్క్ అవుట్‌సోర్సింగ్ విధానాన్ని తీసుకువచ్చి చాపకింద నీరులాగా ఆప్కాస్‌ను ఎత్తివేసేందుకు ప్రయత్నాలు చేస్తుందని ఆరోపించారు. ఈ విషయంలో ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్టు కింద టెండర్లను పిలవడం దారుణంగా ఉందన్నారు. ఈనెల 12నుంచి రాష్ట్రవ్యాప్తంగా పారిశుధ్య కార్మికులు పది రోజుల పాటు సమ్మె చేయడం వల్ల ప్రభుత్వం సమస్యలను పరిష్కరించేందుకు ముందుకు వచ్చిందన్నారు. మంత్రి వద్ద జరిగిన చర్చల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే వచ్చేనెల 5వ తేదీ తర్వాత రిలే దీక్షలు చేపడతామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు చీకటి శ్రీనివాసరావు, కె.నాగభూషణం, జ్యోతిబసు, కె.సామ్రాజ్యం, రత్నకుమారి, కె.శ్రీనివాసరావు, విజయమ్మ, ఆనంద్, వై.రవి, ఎం.బాబు, జేమ్స్, వంశీ, మోహన్‌రావు పాల్గొన్నారు.

చెస్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ఒంగోలు కలెక్టరేట్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెల్లూరులో నిర్వహించిన చెస్ పోటీల్లో ఒంగోలు నగరం లాయర్‌పేటలోని నారాయణ సీవో అండ్ ఒలంపియాడ్ స్కూలు విద్యార్థులు విజయకేతనం ఎగు రవేశారు. ఈ పోటీల్లో బాలమహేష్‌రెడ్డి ద్వితీయ, లక్కిరెడ్డి సుదీక్షరెడ్డిలు తృతీయ స్థానాలను కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక స్కూలులో శుక్రవారం ప్రిన్సిపాల్ నాగూర్‌వలి, నారాయణ స్కూల్స్ జిల్లా ఏజీఎం నర్రావుల పెద్దిరెడ్డిలు విద్యార్థు లను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులను విద్యపరంగానే కాకుండా క్రీడల్లో కూడా ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

కొత్తపట్నం, జూలై 25(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న మహిళ మృతి చెందారు. ఈతముక్కల ఎస్సీ కాలనీకి చెందిన భార్యభర్తలు రూబేను, లుథియా ప్రతిరోజూ మోటార్‌సైకిల్‌పై బేల్దారు పను లకు ఒంగోలుకు వస్తుంటారు. ఈ నెల 24వ తేదీన ఉదయం పనికి పోతుం డగా సంకువానికుంట వద్ద వారి వాహనానికి అడ్డుగా పంది రావటంతో ఇద్ద రూ కింద పడిపోయారు. ఈ ప్రమాదంలో ఇద్దరి గాయాలయ్యాయి. అయితే తీవ్రంగా గాయపడిన లుథియాను మెరుగైన వైద్యం కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం చనిపోయిం ది. కొత్తపట్నం ఎస్ఐ సుధాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు మల్లవరంలో ఎమ్మెల్యే, జేసీ పర్యటన

మద్దిపాడు, జూలై 25(ఆంధ్రజ్యోతి): మద్దిపాడు మండలం మల్లవరం గ్రామంలోని గుడిమెట్ల మరియమ్మ కుటుంబాన్ని జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ దత్తత తీసుకున్నారు. ఈ సందర్భంగా శనివారం ఉదయం 8 గంట లకు మరియమ్మ ఇంటి వద్ద జరిగే కార్యక్రమానికి ఎమ్మెల్యే బీఎన్.విజయ్ కుమార్, జేసీ ఆర్.గోపాలకృష్ణ హాజరవుతారని తహసీల్దార్ ఆదిలక్ష్మి, ఎంపీడీవో వి.జ్యోతి శుక్రవారంఒక ప్రకటనలో తెలిపారు. మండల అధికారులు హా జరుకావాలని వారు కోరారు.

ఏకేయూ పీజీ సెమిస్టర్ ఫలితాలు విడుదల

ఒంగోలు(విద్య), జూలై25(ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం పరిధి లోని పోస్ట్ గ్రాడ్యుయేషన్ మొదటి సెమిస్టర్ ఫలితా లను శుక్రవారం సాయం త్రం స్థానిక యూనివర్సి టీలో వైస్ చాన్స్‌లర్ డీవీఆర్.మూర్తి విడుదల చేశారు. 2024-2025 విద్యా సంవత్సరానికి సంబంధిం చి మొదటి సెమిస్టర్ పరీక్షలకు 1025మందికి 932మంది పరీక్షలకు హా జరయ్యారు. వీరిలో 752 మంది (80.7శాతం) ఉత్తీర్ణులైనట్లు ఆయన చెప్పా రు. ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ బి.హరిబాబు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ సోమ శేఖర్, వి.భారతీదేవి, ఆర్.శ్రీనివాస్, శివరామ్, సిబ్బంది పాల్గొన్నారు.

గుండ్లాపల్లి సచివాలయం తనిఖీ

మద్దిపాడు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): గుం డ్లాపల్లి గ్రామ సచివాల యాన్ని ఎంపీడీవో వి. జ్యోతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. శుక్రవారం ఉద యం ఆమె 10.30 గంట లకు సచివాలయానికి చే రుకుని 11 గంటల వరకు అక్కడే ఉన్నారు. ఈక్రమంలో హాజరు పట్టీ తనిఖీ చేయగా సుమారు 9 రోజుల నుంచి గ్రామ కార్యదర్శి హాజరు వేసి ఉండకపోవడాన్ని గుర్తించారు. ఫోన్ ద్వారా ప్రయత్నించినా అందుబాటులోకి రాలేదు. అనంతరం సిబ్బంది హాజరు పరిశీలించగా పలువురు ఉద్యోగులు విధులకు ఆలస్యంగా రావడం పట్ల ఎంపీడీవో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆన్‌లైన్‌లో నమోదైన హాజరును ప రిశీలించి సిబ్బందికి వేతనాలు ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు. పంచాయ తీ కార్యదర్శికి షోకాజ్ నోటీస్ ఇస్తామని, దానికి స్పందించకపోతే ఉన్నతాధి కారులకు సరెండర్ చేస్తామని ఎంపీడీవో పేర్కొన్నారు.


అద్దంకిలోని విద్యానగర్‌లో కళాశాలలు, పాఠశాలలు ఉన్న ప్రాంతంలో డ్రోన్ తీసిన ఫొటోలు

కళాశాలలు, పాఠశాలల పరిసరాలలో డ్రోన్‌తో నిఘా

అద్దంకి,జూలై25(ఆంధ్రజ్యోతి): కళాశాలలు, పాఠశాలల పరిసర ప్రాంతాలలో డ్రోన్ ద్వారా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు. శుక్రవారం అద్దంకి పట్టణంలోని విద్యానగర్ లోని పలు కళాశాలలు, పాఠశాలు, ప్రకాశం ప్రభుత్వ జూనియర్ కళాశాల, హైస్కూల్ తదితర ప్రాంతాలలో డ్రోన్‌తో పరిశీలన చేసినట్లు తెలిపారు. అనుమానితులు ఉంటే వెంటనే అదుపులోకి తీసుకుంటామని తెలిపారు.


గన్నవరం రోడ్డుపై ఏర్పడిన గుంతలలో నిలిచిన వర్షపునీరు

గుంతలతో ప్రయాణం నరకం

మార్టూరు, జూలై25 (ఆంధ్రజ్యోతి): మార్టూరు నుంచి గన్నవరం వెళ్లాలంటే ప్రయాణం ప్రమాదకరంగా మారింది. ముఖ్యంగా మార్టూరు వాగుపై ఉన్న బ్రిడ్జినుంచి బొబ్బేపల్లిదండుదారి వరకు రోడ్డుపై గుంతలు ఏర్పడి ఉన్నాయి. గత వైసీపీ ప్రభుత్వం రోడ్డుపై గుప్పెడు మట్టికూడా వేయకపోవడంతో చిన్న గుంతలు పెద్ద చెరువుల్లాగా మారిపోయాయి.రోజూ ఈ రోడ్డు నుంచి గన్నవరం, బొబ్బేపల్లి, పూనూరు గ్రామాల వాసులు వివిధ రకాలైన పనుల నిమిత్తం మార్టూరుకు ద్విచక్రవాహనాల్లో, కారుల్లో వస్తుంటారు. అయితే రోడ్డు బాగాలేకపోవడంతో వారు ఈ రోడ్డు మీదుగా ప్రయాణం మానుకున్నారు. ఇక మార్టూరు గ్రామ పంచాయతీ పరిధిలోని జగనన్న కాలనీ గన్నవరం రోడ్డులో ఉండటంతో,అక్కడ దాదాపుగా 200 కుపైగా నివసిస్తున్న కుటుంబాలు వారు మార్టూరు రావాలంటే నానా ఇబ్బంది పడుతున్నారు.దానికి తోడు వారం రోజులు నుంచి వర్షాలు కురుస్తుండటంతో రోడ్డుపై గుంతలలో నీరు చేరాయి. దీంతో వాహనదారులు ఆగుంతలతో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రి సమయంలో అయితే వాహనదారులు మరింతగా ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేయాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

నిందితులను పట్టుకునేందుకు పోలీసుల తీవ్ర ప్రయత్నాలు

అద్దంకి,జూలై25(ఆంధ్రజ్యోతి): బెంగళూరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు, తండ్రీ కొడుకులు వీరాస్వామిరెడ్డి, ప్రశాంత్‌రెడ్డిల హత్య కేసులో నిందితులను పట్టుకునేందుకు పోలీసులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. కిడ్నాప్ జరిగిన సమయంలో నర్సరావుపేటలో లభ్యమైన సీసీ టీవీ ఫుటేజ్‌లో ఎవరెవరు ఉన్నారో పోలీసులు స్పష్టంగా గుర్తించినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో నిందితుల వివరాలపై పూర్తి స్పష్టతతో ఉన్న పోలీసులు వారి ఆచూకీపై దృష్టి సారించారు. అదే సమయంలో చిలకలూరిపేట వద్ద కారు స్వాధీనం చేసుకోవటం, గుంటూరు రైల్వే స్టేషన్‌లో కూడా కొంత మేర సీసీ ఫుటేజ్ ఆధారంగా నిందితులను పట్టుకునేందుకు 5 బృందాలుగా ఏర్పడి హైదరాబాద్, బెంగళూరు తదితర ప్రాంతాలలో గాలిస్తున్నట్లు సమాచారం. పోలీస్‌లు ప్రతిష్టాత్మకంగా తీసుకొని నిందితులను పట్టుకునే పనిలో ఉన్నారు. నిందితులు తమ బంధువులతో టచ్‌లో ఉండే అవకాశం ఉండటంతో అటు వైపు నుంచి కూడా నిశితంగా పరిశీలిస్తున్నారు. మరో రెండు, మూడు రోజులలో నిందితులను పట్టుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

మెడికల్ ప్రాక్టీషనర్లు

(5వ పేజీ తరువాయి)

ముదిరిపోయిన తర్వాత ఆర్ఎంపీలు చేతులు ఎత్తేస్తున్నారు. అప్పుడు వైద్యశాలలకు వెళ్తుండగా రోగులు మరణిస్తున్నారు. రోగం ఒకటైతే ఆర్ఎంపీలు వాడిన మందుల ప్రభావంతో సరికొత్త రోగం సోకిందని వైద్యులు గుర్తిస్తున్నారు. సీజన్‌ల వ్యాధులతో వచ్చే రోగులే లక్ష్యంగా ఆర్ఎంపీలు ఇష్టారీతిన వైద్యం అందిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. రోగ లక్షణం గుర్తించకుండా స్టెరాయిడ్స్ ఇస్తూ తాత్కాలిక ఉపశమనం కలిగిస్తున్నారని వైద్యులు చెప్తున్నారు. అది చివరకు ముదిరి రోగి ప్రాణాలపైకి వస్తోందంటున్నారు. నిబంధనలకు విరుద్ధంగా వైద్యం అందిస్తున్న ఆర్ఎంపీలపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. వారిని పర్యవేక్షించాల్సిన డీఎంహెచ్‌వో వంటి వారు సైతం చూసీచూడనట్లుగా ఉంటున్నారు. వైద్యశాఖాధికారుల సూచనలతో విజిలెన్స్ అధికారులు దాడులు చేయాల్సి ఉన్నా ఇంతవరకు ఎక్కడా ఆ దాఖలాలే లేవు.

● చేబ్రోలులో 26 ఏళ్ల మహిళ జ్వరంతో స్థానికంగా ఆర్ఎంపీని ఆశ్రయించి చికిత్స తీసుకున్నారు. ఆర్ఎంపీ వైద్యం వికటించి చివరకు రక్తపు వాంతులు కావడంతో జీజీహెచ్‌కు తరలించారు. గంటల వ్యవధిలోనే ఆమె మృతి చెందింది.

● దుగ్గిరాలకు చెందిన ఓ బాలిక ఇటీవల వాంతులు, విరేచనాలతో స్పృహ కోల్పోగా తెనాలిలోని జిల్లా ప్రభుత్వవైద్యశాలకు కుటుంబసభ్యులు తీసుకువచ్చారు. ఆర్ఎంపీ మూడు రోజులుగా చికిత్స చేసినా తగ్గలేదని వైద్యులకు వివరించారు. దీంతో బాలికను గుంటూరు పెద్దాస్పత్రికి తరలించినా ప్రాణాలు దక్కలేదు.

తల్లికేనా వందనం

(5వ పేజీ తరువాయి)

వారంతా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అమలుకు నోచుకోని మంత్రి లోకేశ్ హామీ..

తల్లి మృతి చెందితే తండ్రి బ్యాంకు ఖాతాల్లోకి పథకం డబ్బును జమ చేస్తామని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రకటించారు. అయితే ఈ హామీ అమలు కాకపోవడంపై లబ్ధిదారుల నుంచి విమర్శలు వెలువెత్తుతున్నాయి. ఉదాహరణకు బాపట్ల జిల్లా వేమూరు నియోజకవర్గంలో తల్లిని కోల్పోయిన విద్యార్థులు 20 మంది దాకా ఉన్నారని తల్లికి వందనం పథకం కోసం వారి తండ్రులు అర్జీలు దాఖలు చేసినట్లు సమాచారం. అంటే మూడు జిల్లాల పరిధిలోని 20 నియోజకవర్గాల్లో ఎంతమంది ఉంటారో తెలియాల్సి ఉంది. ఒక్కో గ్రామంలో ఇద్దరు ముగ్గురు ఇలాంటి వారు ఉన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో తండ్రి ఖాతాకు నగదు జమ చేశారని అయితే ఈ ప్రభుత్వంలో అది అమలు కాలేదని పలువురు వాపోతున్నారు.

పీఎం సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగించుకోండి

అద్దంకిటౌన్, జూలై 25(ఆంధ్రజ్యోతి): రాయితీపై అందించే ప్రధాన మంత్రి సూర్య ఘర్ పథకాన్ని గ్రామంలో అవకాశం ఉన్న ప్రజలందరూ సద్వినియోగపర్చుకోవాలని ఎంపీడీవో బత్తిన సింగయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని జార్లపాలెం సచివాలయంలో ప్రధాన మంత్రి సూర్య ఘర్ పథకంపై గ్రామస్థులకు అ వగాహన కల్పించారు. అనంతరం చెరువుకొమ్ముపాలెంలో గ్రావెల్ రోడ్డు పనులను ఆయన పరిశీలించారు.

అవీ.. ఇవీ



పర్చూరులో శ్రీ అభయాంజనేయస్వామిని దర్శించుకొని పూజలు చేస్తున్న మంత్రి పయ్యావుల కేశవ్, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

అభయాంజనేయస్వామి ఆలయంలో ఆర్థిక మంత్రి ప్రత్యేక పూజలు

పర్చూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు వైజంక్షన్‌లో 92 అడుగుల శ్రీ అభయాంజనేయ స్వామివారిని ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న మంత్రి, ఎమ్మెల్యేను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అర్చకులు మేళతాళాలు, పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం మంత్రి, ఎమ్మెల్యేలను దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గుంజి వెంకట్రావు, మండలపార్టీ అధ్యక్షుడు షేక్.షంషుద్దీన్, పట్టణ పార్టీ అధ్యక్షుడు ఆకుల శ్రీనివాసరావు, ఆలయ కమిటీ ప్రతినిధులు కోటా హరిప్రసాద్, కఠారి సురేంద్రబాబు, పెద్ద ఎత్తున పార్టీశ్రేణులు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

పారదర్శకంగా అర్జీల పరిష్కారం

● ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారంలో పారదర్శకంగా వ్యవహరిస్తున్నట్లు ఎమ్మెల్యే కొండయ్య చెప్పారు. శుక్రవారం క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్‌కు ఎమ్మెల్యే హాజరై అర్జీలు స్వీకరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల నుంచి స్వీకరించిన ప్రతి అర్జీని నిశితంగా పరిశీలించి సమస్యలు పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. అయితే అవగాహన లేమితో పదే పదే అర్జీలు అందించాల్సిన అవసరం లేదని సూచించారు. అందిన అర్జీలు ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరిస్తున్నట్లు వివరించారు. ప్రజలనుంచి 210 అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బ్యాంక్‌ల మేనేజర్లతో మాట్లాడుతున్న సీఐ సుబ్బరాజు

బ్యాంక్‌ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

అద్దంకి,జూలై25(ఆంధ్రజ్యోతి): బ్యాంక్‌ల వద్ద ఖచ్చితంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సీఐ సుబ్బరాజు అన్నారు. అద్దంకి పట్టణంలోని పలు బ్యాంక్‌ల మేనేజర్‌లు, సిబ్బందితో శుక్రవారం సాయంత్రం సీఐ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సుబ్బరాజు మాట్లాడుతూ బ్యాంక్‌లలో పెద్ద మొత్తంలో నగదు డ్రా చేసుకొని వెళ్లే సమయంలో దొంగతనాలు జరుగుతున్న నేపథ్యంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రధానంగా బ్యాంక్ బయట పరిసర ప్రాంతాలు కూడా కనిపించేలా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. వృద్ధులు బ్యాంక్‌కు పెద్ద మొత్తంలో నగదు డ్రా చేసుకునేందుకు వస్తే ఖచ్చితంగా రెండవ వ్యక్తిని తోడు తీసుకువచ్చుకునేలా చెప్పాలన్నారు. బ్యాంక్ పరిసర ప్రాంతాలలో అనుమానితులను గుర్తిస్తే వెంటనే పోలీ్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలన్నారు.



దాతను సత్కరిస్తున్న జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం కేవీ శ్రీనివాసరావు

రోటరీ క్లబ్ సేవలు అభినందనీయం

అద్దంకిటౌన్, జూలై 25(ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ సేవలు అభినందనీయం అని జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో మండలంలోని చక్రాయపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు బీరువా బహూకరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రోటరీ క్లబ్ కార్యదర్శి ఆళహరి హరి ప్రసాద్ తండ్రి వెంకటసుబ్బారావు జ్ఞాపకార్థం పాఠశాలకు 7వేల రూపాయలు విలువ చేసే బీరువాను అందజేశారు. ఈ సందర్భంగా దాత హరిప్రసాద్‌ను పాఠశాల హెచ్ఎం పసుమర్తి అనూష, హెచ్ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు శాలువాతో సత్కరించారు

నేడు చీరాల కౌన్సిల్ అత్యవసర సమావేశం

చీరాల, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : చీరాల మున్సిపల్ అత్యవసర కౌన్సిల్ సమావేశం శనివారం నిర్వహించనున్నట్లు కమిషనర్ అబ్దుల్ రషీద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అయితే చైర్మన్‌గా మించాల సాంబశివరావు అధ్యక్షతన నిర్వహించే మొదటి సమావేశం కావడంతో కౌన్సిల్‌పై సభ్యుల్లో ఆసక్తి నెలకొంది. అజెండాలో 54 అంశాలు ఉంచినట్లు అధికారులు ఇప్పటికే తెలిపారు.

అసంపూర్తి భవనాలు- అవస్థల్లో ఉద్యోగులు

● గత వైసీపీ ప్రభుత్వం బిల్లులు ఇవ్వకపోవడంతో నిలిపివేసిన కాంట్రాక్టర్‌లు ● రెండేళ్లుగా వెక్కిరిస్తున్న సచివాలయాల పనులు

అద్దంకి, జూలై25(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో ఆర్భాటంగా నిర్మాణ పనులు ప్రారంభించిన సచివాలయ భవనాలు, రైతు సేవా కేంద్రాల భవనాల పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. సంబంధిత కాంట్రాక్టర్‌లకు అప్పటి ప్రభుత్వం బిల్లులు నిలిపివేయటంతో గత రెండేళ్లుగా వెక్కిరిస్తూ దర్శనమిస్తున్నాయి. అద్దంకి మండలంలోని మోదేపల్లి సచివాలయ భవనం, రైతు భరోసా కేం ద్రం(ప్రస్తుతం రైతు సేవా కేంద్రం) భవనాలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనం పక్కన పనులు ప్రారంభించారు. అయితే శ్లాబులు మాత్రమే వేశారు. బిల్లులు ఆలస్యం కావటంతో పనులు నిలిపివేశారు. దీంతో స్థానికులు వాటిని పశుశాలలు గా మార్చారు. సచివాలయ భవనంలో గేదెలను కట్టి వేస్తుండగా, రైతు సేవా కేం ద్రంలో గొర్రెల మందను తోలుతున్నారు. దీంతో అసంపూర్తిగా నిలిచిపోయిన భవనాలు పశుశాలలుగా దర్శనమిస్తున్నాయి ఇలా అద్దంకి నియోజకవర్గంలో సుమారు 40 కు పైగా సచివాలయ, రైతు సేవా కేం ద్రాల భవనాలు వివిధ స్థాయిలలో నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత కూడా అసంపూర్తి భవనాలను పూర్తి చేయటంపై ఇంకా దృష్టి సారించలేదు. దీంతో ఆయా కార్యాలయం లను అద్దె భవనాలలో, ఇరుకు గదులలో నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అసంపూర్తి భవనాల నిర్మాణ పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకువచ్చే విధంగా చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



మోదేపల్లిలో నిర్మాణ పనులు ఆగిపోయిన సచివాలయ భవనం (ఇన్‌సెట్లో) కట్టివేసి ఉన్న గేదెలు

చివరి ఆకు వరకూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది

● ఇడుపులపాడులో పొగాకు కొనుగోలు కేంద్రం ప్రారంభంలో ఏలూరి

ఇంకొల్లు,జూలై 25,(ఆంధ్రజ్యోతి): ప్రతి రైతు వద్ద ఉన్న పొగాకును చివరి ఆకువరకు కొనుగోలు చేసే బాధ్యత ప్రభుత్వం తీసుకుందని, ఏ రైతు అధైర్యపడవద్దని పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు.మండలంలోని ఇడుపులపాడులో శుక్రవారం పొగాకు కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగాకు రైతులు సమయమనం పాటించి తమ పొగాకు విక్రయించుకోవాలన్నారు. ఎటువంటి అపోహలు పెట్టుకోవద్దని రైతులకు ధైర్యం చెప్పారు.దుద్దుకూరు గ్రామ పొగాకు రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. 20 శాతంలోపు తేమశాతం ఉన్న పొగాకు మాత్రమే కొనుగోలు కేంద్రానికి తెచ్చుకోవాలని సూచించారు. ఓ రాజకీయ పార్టీ తమ స్వార్థం కోసం పత్రికను అడ్డుపెట్టుకొని రైతులను రెచ్చగొట్టే ప్రయత్నం మానుకోవాలన్నారు.రైతులు అధికారులకు సహకరించి పంటను విక్రయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పర్చూరు మార్కెట్ యార్డు చైర్మన్ గుంజి వెంకట్రావు, మార్క్‌ఫెడ్ డీఎం కరుణశ్రీ, ఇంకొల్లు మండల అధ్యక్షుడు నాయుడు హనుమంతరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు కరి శ్రీనివాసరావు, పాలేరు రామకృష్ణ, సురేష్‌బాబు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.ఇంకొల్లు మండలానికి చెందిన 10 మంది వికలాంగులకు ట్రైసైకిళ్లను మంత్రి పయ్యావుల కేశవ్ అందజేశారు.



ఇడుపులపాడులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఏలూరి

బర్లీ పొగాకు కొనుగోళ్లు



అద్దంకి మార్కెట్ యార్డులో పొగాకు కొనుగోళ్లను ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు

టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు నాగినేని రామకృష్ణ

అద్దంకి,జూలై25(ఆంధ్రజ్యోతి): రైతులు వద్ద ఉన్న బర్లీ పొగాకు మొత్తం కొనుగోలుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఏఎంసీ మాజీ చైర్మన్, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు నాగినేని రామకృష్ణ అన్నారు. పంగులూరు మండలంలోని రైతుల వద్ద ఉన్న పొగాకు కొనుగోలు చేస్తున్న నేపథ్యంలో పంగులూరు, తూర్పు కొప్పెరపాడులలో ఉన్న గోడౌన్‌లు ఖాళీ లేకపోవటంతో అద్దంకి మా ర్కెట్ యార్డు ఆవరణలో నిల్వ చేసే విధంగా పంగులూరు మండలం రైతులకు సంబంధించిన పొగాకు కొనుగోళ్లు శుక్రవారం ప్రారంభించారు. కొనుగోళ్లను పంగులూరు తహసీల్దార్ సింగారావు, పంగులూరు, అద్దంకి మండల వ్యవసాయధికారులు సుబ్బారెడ్డి, వెంకటకృష్ణ, లక్ష్మి తదితరులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ ధర్మవరపు నాగేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు కఠారి నాగేశ్వరరావు మందా నాగేశ్వరరావు, కరి పరమేష్, రావూరి రమేష్, కాకాని అశోక్, చాగంటి రాజేంద్ర ప్రసాద్, వడ్డవల్లి పూర్ణచంద్రరావు, పెంట్యాల రామాంజనేయులు, ఆదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో అవకతవకలు

గ్రామసభలో సామాజిక తనిఖీ బృందం వెల్లడి

బల్లికురవ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొప్పెరపాడు గ్రామంలో సామాజిక తనిఖీలకు సంబంధించిన గ్రామ సభ శుక్రవారం జరిగింది. ఈసందర్భంగా గత ఏడాది కాలంగా గ్రామంలో జరిగిన పనులకు సంబంధించి తనిఖీ బృందాలు పరిశీలన చేసి నివేదికలను గ్రామ సభలో చదివి వినిపించారు. ఈసందర్భంగా ఆడిట్ టీంలు లక్షల్లో అవకతవకలు జరిగినట్లు గుర్తించి సభలో చెప్పారు. ఈసందర్భంగా గతంలో పనిచేసిన ఉపాధి క్షేత్ర సహాయకుడు పనులలో అవకతవకలకు పాల్పడ్డారని తనిఖీ బృందాలు తెలపగా వైసీపీ, టీడీపీ వర్గీయుల మధ్య కొంత సేపు వాదనలు జరిగాయి.

2019లో చనిపోయిన దమ్ము నారాయణమ్మకు 2024లో మస్టర్లు వేసి డబ్బులు డ్రా చేశారని, 14 ఎళ్ల క్రితం వివాహం జరిగి వేరే గ్రామంలో ఉన్న ఒక మహిళకు మస్టర్లు వేయటం, పనులలో కొలతలు లేకుండా డబ్బులు డ్రా చేయటం, బోగస్ మస్టర్లు పెద్ద ఎత్తున వేసి ఉన్నట్లు తనిఖీ బృందాలు గుర్తించాయి. ప్రజావేదికలో ఎస్ఆర్‌పీ తులసినాయక్, పరిశీలకులు కేవీరావు, ఏపీవో రమాదేవి, సర్పంచ్ వెంకాయమ్మ, ఉపసర్పంచ్ ప్రసన్నకుమారి తదితరులు పాల్గొన్నారు.



కొప్పెరపాడులో సామాజిక తనిఖీ గ్రామ సభలో పాల్గొన్న అధికారులు, తనిఖీ బృందాలు

మద్యం సేవించి వాహనాలు నడిపిన ముగ్గురికి జరిమానా

అద్దంకి,జూలై22 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న ముగ్గురిని అద్దంకి కోర్టులో శుక్రవారం హాజరు పరచగా న్యాయాధికారి అఖిల రూ. 20 వేల జరిమానా విధించినట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు. హైదరాబాద్ నుంచి చెన్నై వెళ్తున్న లారీ డ్రైవర్‌పై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచగా న్యాయాధికారి అఖిల 10 వేల రూపాయల జరిమానా విధించారు. మరో ఇద్దరు ద్విచక్ర వాహన చోదకులు మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించి కేసులు నమోదు చేసి కోర్టులో హాజరు పరచగా 5 వేల రూపాయలు చొప్పున జరిమానా విధించినట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు.

బెల్ట్ షాపులపై దాడులు

అద్దంకి,జూలై25(ఆంధ్రజ్యోతి): మండలంలోని రెండు గ్రామాలలో బెల్ట్ షాపులపై దాడులు చేసి ఇద్దరిని అరెస్ట్ చేసి 23 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు అద్దంకి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ ఇన్‌చార్జి సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. వెంకటాపురంలో 11 , ధర్మవరంలో 12 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకొని ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

అప్రమత్తంగా ఉండాలి

అద్దంకి,జూలై25(ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని శక్తి యాప్ బృందం చీరాల డివిజన్ ఎస్సై హరిబాబు అన్నారు. అద్దంకి పట్టణంలోని ప్రకాశం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, బెల్ అండ్ బెనెట్ పాఠశాలలో విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రధానంగా గుడ్ టచ్, బ్యాడ్ టచ్ ల గురించి వివరించారు. ఎస్సై నరసింహ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉచిత వైద్యశిబిరం

యద్దనపూడి(మార్టూరు), జూలై25(ఆంధ్రజ్యోతి):యద్దనపూడి మండలంలోని పూనూరు జడ్పీ హైస్కూల్‌లో ఆదివారం పూర్వ విద్యార్థులు కాటూరి హాస్పిటల్ వారి సహకారంతో ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.ఈ శిబిరంలో అన్నిరకాల రోగాలకు ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేస్తారని తెలిపారు.

అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

చినగంజాం, జూలై 25(ఆంధ్రజ్యోతి) : అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ బాపట్ల వాణిజ్య విభాగం ఉపాధ్యక్షుడు మోటుమర్రి రామసుబ్బారావు, పార్టీ సీనియర్ నాయకులు సందు శ్రీనివాసరావులు అన్నారు. చినగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని చినగంజాం, పూలవారిపాలెం గ్రామాల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని శుక్రవారం టీడీపీ నాయకులు నిర్వహించారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీ అమలు చేసేలా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని నాయకులు అన్నారు. కూటమి ప్రభుత్వం ఏడాదిలో అందించిన పాలనతో ప్రజలు సంతోషంగా ఉన్నారని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సూపర్ సిక్స్ పథకాలను కూటమి ప్రభుత్వం అందజేస్తుందని అన్నారు. గ్రామంలో ఇంటింటికీ తిరిగి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి వివరించి, కరపత్రాలను పంపిణీ చేశారు.

కార్యక్రమంలో టీడీపీ నాయకులు టీ.జయరావు, భయ్యా సతీష్‌కుమార్, ధర్మవరపు ఏసునారాయణ, మాచిరాజు సత్యనారాయణ, వలిశెట్టి మహేష్‌బాబు, గంటా నరసింహారావులు పాల్గొన్నారు.



చినగంజాంలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

విద్యుదాఘాతానికి రెండు గేదెలు మృతి

మార్టూరు,జూలై25(ఆంధ్రజ్యోతి):మండలంలోని నాగరాజుపల్లి గ్రామ శివార్లలో విద్యుత్ లైన్లు మరమ్మతులు చేస్తుండగా పొలంనుంచి ఇంటికి వస్తున్న రెండు గేదెలకు విద్యుత్ తీగలు తగిలి మృతిచెందాయి. ఈ సంఘటన శుక్రవారం సాయంత్రం జరిగింది. గ్రామంలోని జొన్నాదుల నాగేశ్వరరావుకు చెందిన రెండు గేదెలను కుటుంబసభ్యులు పొలంనుంచి ఇంటికి తోలుకువస్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. మృత్యువాత పడిన వాటి విలువ రెండు లక్షల రూపాయలు అని బాధితులు నాగేశ్వరరావు కన్నీరు మున్నీరు అయ్యారు.ఇదిలా ఉండగా ప్రమాదం జరిగిన విషయం తెలియగానే సంఘటనా స్థలానికి విద్యుత్ ఏఈ కిరణ్ కుమార్ సిబ్బందితో వచ్చారు.ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. విద్యుత్ ఎల్‌టీ లైను తీగలు తెగి కిందకు పడటంతో ప్రమాదం జరిగిందని తెలిపారు. బాధితులకు విద్యుత్ డిపార్ట్‌మెంట్ తరపున సాయం అందించేందుకు ఉన్నత అధికారులకు నివేదికను పంపిస్తామని ఆయన తెలిపారు.



గజ ఈతగాళ్లతో మాట్లాడుతున్న ఎస్సై చంద్రశేఖర్

పర్యాటకుల సంరక్షణకు జాగ్రత్తలు తీసుకోవాలి : ఎస్ఐ

● అలల తాకిడికి కొట్టుకుపోతున్న ముగ్గురిని రక్షించిన పోలీసులు

వాడరేవు(చీరాల), జూలై 25 (ఆంధ్రజ్యోతి) : పర్యాటకుల సంరక్షణకు గజ ఈతగాళ్లు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఈపూరుపాలెం ఎస్సై చంద్రశేఖర్ పేర్కొన్నారు. శుక్రవారం మార్టూరుకు చెందిన సుమారు 1000 మంది పర్యాటకులు వాడరేవు పవిత్ర స్నానాలకు వచ్చారు. ఈక్రమంలో ప్రమాదవశాత్తు అలల తాకిడికి ముగ్గురు కొట్టుకు పోతుండగా, అప్పటికే డ్రోన్ కెమెరాతో పర్యవేక్షిస్తున్న ఎస్సై చంద్రశేఖర్ అప్రమత్తమై వెంటనే గజ ఈతగాళ్లు, పోలీసుల సహాయంతో వారిని రక్షించి సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు.



గొలుసు దొంగల వివరాలను వెల్లడిస్తున్న చీరాల డీఎస్పీ మొయిన్, అద్దంకి రూరల్ సీఐ మల్లికార్జునరావు తదితరులు

గొలుసు దొంగల అరెస్టు

● 58 గ్రాముల బంగారం స్వాధీనం

మేదరమెట్ల, జూలై 25(ఆంధ్రజ్యోతి): ఒంటరిగా ఉన్న మహిళలను టార్గెట్ చేసి వారి మెడలలో బంగారు గొలుసులను అపహరిస్తున్న ఇద్దరు దొంగలను పోలీసులు అరెస్టుచేశారు. బాపట్ల జిల్లాలోని కొరిశపాడు, వేమూరులలో ఇద్దరు మెడలలో బంగారు గొలుసులను దొంగిలించిన స్నాచర్లను పోలీసులు అధునాతన టెక్నాలజీని ఉపయోగించి పట్టుకున్నారు. వివరాలల్లోకి వెళితే కొరిశపాడు గ్రామంలో టిఫెన్ సెంటర్ నడుపుతున్న గోలి సత్యవతి మెడలో 28 గ్రాముల బంగారు గొలుసు లాక్కెళ్లారు. వేమూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇంటి ముందు ముగ్గు వేస్తున్న మహిళ మెడలో గొలుసును లాక్కెళ్లరు. గుంటూరుకు చెందిన మేకల హరిష్, షేక్ యాశిన్‌లు ఒక ముఠాగా ఏర్పడి రాత్రి 10 గంటల తరువాత, ఉదయం 7 గంటల లోపు జన సంచారం తక్కువగా ఉన్న సమయంలో ఒంటరిగా ఉన్న మహిళలను గుర్తించి వారి మెడలో ఉన్న బంగారు గొలుసులను దొంగిలించి ముందుగానే సిద్ధంగా ఉంచిన మోటర్ సైకిళ్లపై పరారయ్యేవారు. వీరు దొంగతనానికి డ్యూక్ మోటర్ సైకిల్‌ను ఉపయోగించేవారు. ఈ మోటార్ సైకిల్‌ను తాత్కాలికంగా కారు డ్రైవర్‌గా పని చేసే హరిష్ యాశిన్‌కు కొనిపెట్టారు. దొంగతనం జరిగిన రోజు బాపట్ల ఎస్పీ తుషార్ డూడీ అన్ని పోలీస్‌స్టేషన్‌లను అప్రమత్తం చేయడంతో పాటు సాంకేతిక అంశాలు అన్ని పరిగణనలోకి తీసుకున్నారు. చీరాల డీఎస్పీ మొయిన్ ఆధ్వర్యంలో అద్దంకి రూరల్ సీఐ డి. మల్లికార్జునరావు, కొరిశపాడు ఎస్ఐ వై. సురేష్ , మేదరమెట్ల ఎస్ఐ మహమ్మద్ రఫీ, పంగులూరు ఎస్ఐ వినోద్‌బాబులను ప్రత్యేక బృందాలుగా ఏర్పాటు చేశారు. దొంగల ఆచూకీ కోసం గాలిస్తుండగా మంగళగిరి ఫ్లైఓవర్ వద్ద డ్యూక్ మోటార్ సైకిల్‌పై వస్తుండగా నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రెండు బంగారు గొలుసులను స్వాధీనం చేసుకున్నట్లు చీరాల డీఎస్పీ మొయిన్ తెలిపారు. సుమారు 4.5 లక్షల విలువైన 58 గ్రాముల బంగారంతో పాటు డ్యూక్ మోటర్ సైకిల్‌ను కూడా స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. చాకచక్యంగా దొంగలను పట్టుకున్న అద్దంకి రూరల్ సీఐ మల్లికార్జునరావు, కొరిశపాడు,మేదరమెట్ల, జె. పంగులూరు ఎస్ఐలతో పాటు హెడ్ కానిస్టేబుల్ వెంకటేష్, నాగరాజు, కానిస్టేబుల్ ముత్తయ్యలకు బాపట్ల ఎస్పీ తుషార్ డూడీ ప్రకటించిన నగదు పురస్కారాలను చీరాల డీఎస్పీ అందజేశారు.



పోగొట్టుకున్న బంగారాన్ని ప్రయాణికురాలికి అందజేస్తున్న ఆర్టీసీ డీఎం రామ్మోహనరావు

బస్సులో పోగొట్టుకున్న బంగారు గొలుసు అప్పగింత


అద్దంకి,జూలై25(ఆంధ్రజ్యోతి): బస్సులో పోగొట్టుకున్న బంగారాన్ని ప్రయాణికురాలికి అప్పగించారు. ఆర్టీసీ అధికారుల కథనం మేరకు విజయవాడ కృష్ణలంకకు చెందిన చంద్రకళ, చెన్నమ్మలు శుక్రవారం సాయంత్రం అద్దంకి నుంచి దర్శి వెళ్లే సమయంలో సీటు వద్ద బంగారం గొలుసు పోగొట్టుకున్నారు. దర్శిలో బస్ దిగిన తరువాత గుర్తించిన చంద్రకళ వెంటనే ఆర్టీసీ ఎంక్వయిరీకి ఫోన్ చేసి కండక్టర్ వివరాలు తెలుసుకొని ఫోన్ చేశారు. కండక్టర్ వెతకగా మహిళలు కూర్చున్న సీటు వద్ద బంగారం గొలుసు పడి ఉంది. దీంతో బంగారం గొలుసుని దాచి బస్సు పొదిలి వెళ్లి తిరిగి అద్దంకి వచ్చిన తరువాత డీఎం రామ్మోహనరావు సమక్షంలో పోగొట్టుకున్న బంగారాన్ని ప్రయాణికురాలికి శు క్రవారం రాత్రి అందజేశారు. ఈ సందర్భంగా నిజాయితీతో సుమారు లక్షన్నర రూపాయల విలువైన సుమారు 12 గ్రాముల బంగారం గొలుసును అందజేసిన కండక్టర్ సుజాత, డ్రైవర్ గిరిరాజులను డీఎం రామ్మోహనరావు, ప్రయాణికులు అభినందించారు.

కూరగాయల లారీ బోల్తా

మేదరమెట్ల, జూలై 25(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిలో మేదరమెట్ల సమీపంలోని తమ్మవరం ఫ్లైఓవర్‌పై డ్రైవర్ నిద్రమత్తులో డివైడర్‌ను ఎక్కించడంతో లారీ బోల్తా పడింది. శుక్రవారం వేకువజామున బెంగళూరు నుంచి క్యాబేజీ లోడుతో విజయవాడవైపు వెళ్తున్న లారీని నడుపుతున్న డ్రైవర్ నిద్రపోయి రోడ్డు మధ్యనున్న డివైడర్‌ను ఎక్కించడంతో బోల్తా పడింది. అందులో ఉన్న ముగ్గురు వ్యక్తులకు ఎటువంటి ప్రమాదం జరగలేదు. లారీ డ్రైవర్ విజయ్ అక్కడ నుంచి పరారయ్యాడు.



విద్యుత్ షాక్‌తో మృతిచెందిన గేదెలు



'సోమశిల'లో నీటిమట్టం

అనంతసాగరం జూలై 25 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయంలో 28.222 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాగా, ఎగువ నుంచి శుక్ర వారం 6,799 క్యూసెక్కుల వరద వస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఉత్తర కాలువకు 320, దక్షిణ కాలువకు 400, పెన్నాడెల్టాకు 2,600 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

నేడు కార్గిల్ విజయోత్సవ దినం

వారి త్యాగం.. మనకు ఫలం



నాటి యుద్ధంలో జిల్లా వారు 22 మంది

నగరంలో విజయోత్సవ ర్యాలీ.. పోరాటయోధులకు నేడు సత్కారం

ఓ పక్క ప్రాణాలు కాపాడుకుంటూనే మరోపక్క భారత్‌పైకి దూసుకొస్తున్న పాక్ సైన్యాన్ని ధీటుగా ఎదుర్కొంటూ వీరోచితంగా పోరాడిన మన సైన్యం పోరాట పటిమను ఇప్పటికీ మరువలేం. 1999లో జరిగిన కార్గిల్ యుద్ధం ప్రతి ఒక్కరి మదిలో మెదులుతూనే ఉంది. ఈ గొప్ప విజయానికి నేటికి 26 ఏళ్లు. ఈ శుభసందర్భాన్ని పురస్కరించుకొని విజయోత్సవాలు జరుపుకునేందుకు యావత్తు దేశం సిద్ధమైంది. సైనిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నగరంలోని వీఆర్సీ నుంచి కలెక్టరేట్ వరకు ఉదయం పది గంటలకు కార్గిల్ విజయోత్సవ ర్యాలీ జరగనుంది. ఆ తర్వాత తిక్కన ప్రాంగణంలో నాడు యుద్ధంలో పాల్గొన్న సైనికులను కలెక్టర్ ఆనంద్ సత్కరించనున్నారు.

- వివరాలు 8లో

ఇప్పటికీ రోమాలు నిక్కబొడుచుకుంటాయ్!

'కార్గిల్ యుద్ధం.. ఈ మాట వింటే ఇప్పటికీ నా రోమాలు నిక్కబొడుచుకుంటాయి. జమ్మూ, శ్రీనగర్ బేస్ ఆపరేషన్స్‌లో పని చేశాను. 1999, మే నెలలో పెట్రోలింగ్‌లో ఉన్న మన సైన్యంపై పాకిస్థాన్ మిలటరీ దళం మన భూభాగాన్ని ఆక్రమించి దాడికి పాల్పడింది. తీవ్రంగా గాయపడిన ఇద్దరు సైనికులు హెడ్‌క్వార్టర్‌కు వచ్చి సమాచారం ఇచ్చారు. నేను బెటాలిక్ సెక్టార్‌లో పని చేశాను. పగటిపూట ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేం. శత్రు దేశం సైనికులు అటాక్ చేస్తున్నారు కాబట్టి రాత్రిళ్లు మాత్రమే కొండలమీద 15 నుంచి 20 కి.మీల వరకు రక్తం గడ్డ కట్టించే చలిలో ప్రత్యర్థుల దాడిని ఎదుర్కొంటూ మరోవైపు దారి చేసుకుంటూ నదులపై వంతెనలు ఏర్పాటు చేసుకుంటూ ముందుకు పోవాలి. సరిపడా రేషన్ ఉండదు. దాదాపు 20 రోజుల వరకు కఠినమైనవి. పాకిస్థాన్ సైన్యం దాడుల్లో గాయపడిన వారిని కూడా తిరిగి 15 నుంచి 20 కి.మీ కిందకు కర్రలపై ఎత్తుకుని వచ్చి చికిత్స చేయించేవాళ్లం. మన హెలిప్యాడ్ బేస్ క్యాంపును ఆక్రమించిన పాక్ సైన్యం కదలికలను గమనిస్తూ దాడి చేసి అదుపులోకి తీసుకున్నాం. ఆ తరువాత నుంచి మాకు రేషన్, మందులు అందేవి. ఆపరేషన్స్‌లో ఉంటే కుటుంబం అనే ఆలోచనే ఉండదు. మమ్మల్ని మేము కాపాడుకోవడం.. దేశరక్షణ కోసం వెనకడుగు మాటే ఉండదు. కార్గిల్ నుంచి బయటపడి బతికి ఉన్నామంటే ఆ దేవుడి దయే. అంతకంటే ఏమీ చెప్పలేము. అదో కఠినమైన యుద్ధం. తలుచుకుంటే రోమాలు నిక్కబొడుచుకుంటాయి. రాజస్థాన్, పంజాబ్ ఇలా చాలా బేస్‌లలో పని చేశాను. 2022లో పదవీవిరమణ అయ్యాను. ప్రభుత్వం ఇచ్చే పింఛను తప్ప ఎలాంటి ప్రోత్సాహకాలు అందలేదు. అన్నీ హామీలే.. ఒక్కటీ నెరవేరలేదు.

రక్తం గడ్డకట్టే చలిలో పాక్ సైన్యాన్ని ఎదిరించాం

ఆ యుద్ధం నుంచి బతికి ఉన్నామంటే దేవుడి దయే!



- టి.శ్యాంసన్, నాయిబ్ సుబేదార్, నెల్లూరు

వారంలో రికార్డులు ఇవ్వండి!

'యాక్సిస్' అధికారులకు పోలీసుల నోటీసులు

నెల్లూరు (క్రైం), జూలై 25 (ఆంధ్రజ్యోతి) : యాక్సిస్ బ్యాంక్ కుంభకోణం కేసులో విచారణను పోలీసులు వేగం పెంచారు. ఈ కుంభకోణానికి సంబధించిన ఫైల్స్‌ను అందజేయాలని గతంలోనే పోలీసులు బ్యాంకు అధికారులను కోరినా వారు స్పందించలేదు. ఈ మధ్య నెల్లూరు రూరల్ డీఎస్పీ కార్యాలయంలో బ్యాంకు మేనేజర్‌ను విచారించారు. గతంలో తాము అడిగిన ఫైల్స్ అందించాలని సూచించారు. అయినా వారి నుంచి స్పందన లేకపోవడంతో గురువారం బ్యాంక్ అధికారులకు నోటీసులు జారీ చేశారు. వారం రోజుల్లో బ్యాంక్‌లో జరిగిన కుంభకోణానికి సంబంధించిన ప్రతి ఫైల్ తమకు అందించాలని ఆ నోటీసులో పేర్కొన్నారు. అప్పటికి స్పందించకపోతే విచారణను వేగవంతం చేసేందుకు పోలీసులు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నట్లు తెలుస్తుంది.



నెల్లూరు: నగరంలోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు



పీఎంశ్రీ పాఠశాలల్లో జెండా పండుగకు రూ.11.5లక్షలు

నెల్లూరు(విద్య, ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పీఎంశ్రీ పాఠశాలల్లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నిర్వహణకు ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. సమగ్రశిక్ష పర్యవేక్షణలో జిల్లాలోని 46 పీఎంశ్రీ పాఠశాలలకు ఒక్కో దానికి రూ.25వేలు చొప్పున మొత్తం రూ.11.5 లక్షలు కేటాయిస్తూ రాష్ట్ర ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ బీ శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారు. జెండా ఆవిష్కరణ, సౌండ్ సిస్టమ్‌కు రూ.2వేలు, పాఠశాల స్థాయిలో ఆటల నిర్వహణకు రూ.5వేలు, చారిత్రక సంఘటనలపై స్కిట్‌ల నిర్వహణకు రూ.3వేలు, వ్యాసరచన, క్విజ్ పోటీలకు రూ.5వేలు, విద్యార్థులకు బహుమతులు, కార్యక్రమ నిర్వహణకు రూ.10 వేలు వినియోగించాలని సూచించారు. ఈ మేరకు ఎంఈఓలు, హెచ్‌ఎంలకు ఆదేశాలిచ్చి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తామని సమగ్రశిక్ష ఏపీసీ వెంకట సుబ్బయ్య తెలిపారు.

శాంభవీ... శరణు శరణు !

వైభవంగా శ్రావణ మాసోత్సవాలు

తొలి శుక్రవారం ఆలయాల కిటకిట

సామూహిక కుంకుమార్చనలు, విశేష పూజలు

నెల్లూరు (సాంస్కృతికం), (ఆంధ్రజ్యోతి) : శ్రావణ మాసం మొదలైంది. తొలిరోజే శుక్రవారం కావడంతో జిల్లా వ్యాప్తంగా అమ్మవారి ఆలయాలు భక్తులతో కళకళలాడాయి. సామూహిక కుంకుమార్చనలు, మూలవర్లకు పూలంగిసేవలు, పల్లకీసేవలు, ప్రాకారోత్సవాలు నేత్రపర్వంగా జరిగాయి. నెల్లూరులోని రాజరాజేశ్వరి ఆలయంలో ఉదయం లలితా సహస్రనామ సామూహిక లక్ష కుంకుమార్చన జరిగింది. మధ్యాహ్నం అన్నదానం చేశారు. నగరంలోని కన్యకా పరమేశ్వరి, ఇరుకళల పరమేశ్వరి ఆలయాల్లో శ్రావణ మాస ప్రారంభ వేడుకలు జరిగాయి. అలాగే పెంచలకోన, జొన్నవాడ, నృసింహకొండ, ఆత్మకూరు, కావలి, కందుకూరు, ఉదయగిరి తదితర ప్రాంతాల్లోని ఆలయాలు భక్తులతో శోభిల్లాయి.



రాపూరు : పెంచలకోనలో ఆదిలక్ష్మికి ప్రాకారోత్సవం



వింజమూరు : ప్రజలకు కరపత్రాలు అందచేస్తున్న మంత్రి పార్థసారథి, పక్కన ఎమ్మెల్యే కాకర్ల సురేష్

ప్రజాస్వామ్యంలో ప్రజల ఆశీర్వాదమే కొలమానం

రప్పా.. రప్పా... అంటే కుదరదు

ప్రజలు అంతకంతకు చెల్లిస్తారు!

జిల్లా పర్యటనలో రాష్ట్ర మంత్రి పార్థసారథి

- వివరాలు 8లో..

బీపీసీఎల్ అధికారుల తీరుపై ట్రాన్స్‌పోర్టర్ల నిరసన 8

ఆదాయం లేనివా.. అయితే వద్దులే!!

దేవాలయాల పాలక మండళ్ల నియామకం ప్రహసనంగా మారుతోంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఇప్పటికి రెండు సార్లు ఆలయాల పాలక మండళ్ల కోసం నోటిఫికేషన్లు జారీ చేసింది. కానీ, నియామకాలు మాత్రం జరగలేదు. తాజాగా ఈనెల 10న జిల్లాలోని 45 ఆలయాలకు పాలక మండళ్ల నియామకం కోసం దేవదాయ శాఖ రాష్ట్ర కమిషనర్ నోటిఫికేషన్ జారీ చేశారు. ఈనెల 30లోపు పాలక మండళ్ల సభ్యుల వివరాలతో జాబితాలను కమిషనర్ కార్యాలయానికి పంపాలని అందులో పేర్కొన్నారు. అయితే, ఇప్పటివరకు 10, 12 దేవాలయాలకు సంబంధించి మాత్రమే జాబితాను కమిషనర్ కార్యాలయానికి పంపినట్లు తెలిసింది. గడువు సమీపిస్తున్నా ఇప్పటి వరకు మిగిలిన ఆలయాల దరఖాస్తుల్లో పురోగతి లేకపోవడం గమనార్హం.

జిల్లాలో 45 ఆలయాల పాలక మండళ్లకు నోటిఫికేషన్

- దరఖాస్తుకు ఈనెల 30 వరకు గడువు
- ఇప్పటి వరకు 10, 12 గుళ్లకే జాబితాలు సిద్ధం
- ఆదాయం లేకపోవడంతో ఆసక్తి చూపని వైనం..
- దృష్టిపెట్టని స్థానిక ప్రజా ప్రతినిధులు
- గడువులోపు ఎంపిక పూర్తయ్యేనా?



నెల్లూరు (సాంస్కృతికం), జూలై 25 (ఆంధ్రజ్యోతి) : చిన్న ఆలయాలపై ఆసక్తి కరువు ఆలయ పాలక మండలి సభ్యుడిగా పనిచేయాలనుకునే వ్యక్తులు ఆయా ఆలయ ఈవోలకు దరఖాస్తు చేసుకోవాలి. ఈవోలు సదరు సభ్యుల పూర్వాపరాలను పోలీసు, ఇతర శాఖల దృష్టికి తీసుకుపోయి సభ్యుల అర్హతను గుర్తించి ఆ మేరకు కమిషనర్‌కు జాబితా పంపుతారు. అయితే అనధికారికంగా స్థానిక శాసన సభ్యులే దేవాలయ పాలక మండలి సభ్యుల జాబితాలను సిద్ధం చేసి వాటిని ఆయా ఆలయాల ఈవోలకు పంపడం రివాజుగా మారింది. అయితే ఈసారి ప్రజాప్రతినిధులు ఆలయాల పాలక మండలి సభ్యుల ఎంపికపై దృష్టి సారించకపోవడంతో ప్రక్రియ ఆలస్యమవుతోంది. అంతేకాక, రిజర్వేషన్ల ప్రకారం సభ్యులను ఎంపిక చేయాల్సి రావడం ప్రజాప్రతినిధులకు తలపోటుగా మారింది. గతంలో ఆలయాల కమిటీకి ఎంపిక చేయమని ప్రజాప్రతినిధులను అధికార పార్టీ కార్యకర్తలు ఒత్తిడి చేసి మరీ సభ్యులుగా చేరేవారు. కానీ, ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. ఇప్పుడు నోటిఫికేషన్ విడుదలైన ఆలయాల్లో ఆదాయం కలిగినవి అంతంత మాత్రంగా ఉండడంతో వాటి పాలక మండళ్లలో చేరేందుకు అధికార పార్టీ కార్యకర్తలు అంతగా ఉత్సాహం చూపడంలేదనే ప్రచారం జరుగుతోంది. దరఖాస్తు గడువుకు ఇక రోజులే ఉంది. ఈలోపు అన్నీ ఆలయాల పాలక మండలి సభ్యుల ఎంపిక పూర్తవుతుందా అనేది ఆ దేవుడికే తెలియాలి!.

రూ.25 లక్షల్లోపే ఆదాయం

ప్రస్తుతం నోటిఫికేషన్ ఇచ్చిన ఆలయాల్లో చేజర్ల మండలం కోటితీర్థం క్షేత్రం, విడవలూరు మండలం రామతీర్థంలోని రామలింగేశ్వర స్వామి ఆలయం, వింజమూరు మండలం నల్లగొండ్ల లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం, ముత్తుకూరు చెన్నకేశవ స్వామి ఆలయం, నెల్లూరు నగరంలోని నవాబుపేట మల్లేశ్వరాలయం, ఉస్మాన్‌సాహెబ్ కోదండరామ స్వామి కాశీ విశ్వేశ్వరాలయం, మొగుళ్లపల్లి వారి సత్రం, చీదెళ్ల వారి సత్రం, ఇందుకూరుపేట లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం, అల్లూరులోని ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయం, సంగం భీమేశ్వర స్వామి ఆలయం, బుచ్చి మండలం దామరమడుగులోని మల్లికార్జున స్వామి ఆలయం వంటివి ఉన్నాయి. నోటిఫికేషన్ జారీ చేసిన 45 ఆలయాలు కూడా రూ.25లక్షల్లోపు వార్షిక ఆదాయం ఉన్నవే కావడంతో వాటి పాలక మండళ్లలో చేరేందుకు ఎవరూ ముందుకు రావడం లేదని సమాచారం.

రిజర్వేషను ఇలా...

- రూ.5లక్షల నుంచి రూ.25 లక్షలలోపు ఆదాయం ఉన్న ఆలయాలకు ఎక్స్‌అఫిషియో సభ్యులుగా నాయీబ్రాహ్మణ్, బీసీ, ఎస్సీ లేదా ఎస్టీలతో పాటు మొత్తం 10 మంది కమిటీ సభ్యులుగా ఉంటారు. అందులో 50 శాతం మహిళలకు కేటాయించాల్సి ఉంటుంది.
- రూ.25లక్షల నుంచి రూ.5కోట్లలోపు ఆదాయం ఉన్న ఆలయాలకు 12 మంది కమిటీ సభ్యులు ఉంటారు. వారిలో 50 శాతం మహిళలకు కేటాయించాలి.

జాకెట్, చీర లాగేసి..

మహిళపై జనసేన పార్టీ నాయకుడి దాష్టీకం • దాడిలో కుమారుడికీ గాయాలు

పొలంలో అక్రమంగా దారి వేస్తుండగా అడ్డుకున్నందుకే! • పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితులు

ఏఎస్ పేట, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : పొలంలో అక్రమంగా దారి వేయడమే కాదు.. అడ్డొచ్చిన తల్లీకొడుకుపై జనసేన పార్టీకి చెందిన ఓ నాయకుడు విచక్షణా రహితంగా దాడి చేశారు. మహిళ చీర, జాకెట్‌ను లాగేయడమేగాక, బంగారు సరుడును లాక్కొని వెళ్లిపోయారు. ఏఎస్ పేట మండలం పెద్ద హబీపురం గ్రామంలో ఈ ఘటన చోటు చేసుకుంది. బాధితుల కథనం మేరకు... పెద్ద హబీపురం గ్రామనికి చెందిన అనసూయమ్మ, జనసేన పార్టీకి చెందిన నాయకుడు ఊస వెంకటరావుల పొలాలు పక్కపక్కనే ఉన్నాయి. ఈ తరుణంలో శుక్రవారం ఉదయం వెంకటరావు తన పొలం కోసం అనసూయమ్మ పొలంలో నుంచి జేసీబీ ద్వారా దారి ఏర్పాటు చేస్తున్నాడు. ఈ విషయం తెలుసుకున్న అనసూయమ్మ తన కుమారుడు సాయినాథ్‌ను వెంట బెట్టుకుని పొలం వద్దకు చేరుకుని, పనులను అడ్డుకుంది. దీంతో ఆగ్రహించిన వెంకటరావు తన కుటుంబ సభ్యులతో కలిసి అనసూయమ్మపై దాడి చేసి గాయపరిచాడు. అంతేగాక ఆమె జాకెట్, చీర చిరిగేలా లాగేసి మెడలోని బంగారు సరుడును కూడా లాక్కొన్నారు. అడ్డువచ్చిన ఆమె కుమారుడిపై కూడా దాడి చేసి గాయపరిచారు. దీంతో తల్లీకొడుకు ఇద్దరూ ఏఎస్‌పేట పోలీస్ స్టేషన్‌కు చేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని విచారిస్తున్నట్లు ఎస్ఐ సైదులు తెలిపారు. గాయపడిన తల్లీకొడుకును ఆత్మకూరు ఆసుపత్రికి తరలించారు.



జనసేన పార్టీ నాయకుడు దాడి చేయడంతో పొలంలోనే పడిపోయిన అనసూయమ్మ

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	134
స్కిన్ చికెన్	240
స్కిన్‌లెస్	264

కోడిగుడ్ల ధర (100): 475

184 పొగాకు బేళ్ల తిరస్కరణ

కలిగిరి, జూలై 25(ఆంధ్రజ్యోతి): స్థానిక పొగాకు వేలం కేంద్రానికి శుక్రవారం రైతులు 614 పొగాకు బేళ్లు విక్రయానికి తీసుకొచ్చారు. వేలంలో 10 కంపెనీ ప్రతినిధులు పాల్గొని 430 బేళ్లు కొనుగోలు చేశారు. నోబిడ్-169, ఆర్ఆర్-3, సీఆర్-10, జంపింగ్‌లాట్స్-2 కారణాలతో 184 బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.160, సగటు ధర రూ.202.89గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి శివకుమార్ తెలిపారు.

డ్రైనేజీ కాలువలు నిర్మించండి

బిట్రగుంట, జూలై 25(ఆంధ్రజ్యోతి): విశ్వనాథరావుపేట పంచాయతీ రామస్వామిపాలెం ఇందిరా కాలనీలో డ్రైనేజీ కాలువలు నిర్మించాలని జైభీం అంబేడ్కర్ సేవాదళ్ వ్యవస్థాపకుడు బత్తుల రవిచంద్ర కోరారు. శుక్రవారం ఆయన స్థానికులతో కలసి నిల్వ చేరిన మురికి నీటి కాలువలను పరిశబీలించారు. దీనిపై కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరారు.

న్యూస్ బాక్స్

బాలింతలకు నిత్యావసరాల పంపిణీ

కందుకూరు, జూలై 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తూర్పువడ్డిపాలెం అర్బన్ హెల్త్ సెంటర్‌లో వరల్డ్‌విజన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం 30 మంది బాలింతలు, 15 మంది చిన్నారులకు నిత్యావసరాలు, ఫుడ్ బాస్కెట్స్ పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కమిషనర్ కె.అనూష, వైద్యాధికారులు బ్యూలాగ్రేస్, స్టెల్యాకారుణ్యలు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పీహెచ్ఎన్ పద్మావతి, ఐసీడీఎస్ సూపర్‌వైజరు ప్రభావతి, స్థానిక టీడీపీ నాయకుడు మహర్షి శ్రీను, వరల్డ్‌విజన్ సిబ్బంది, వైద్యసిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

భవిత కేంద్రాల్లో సులభరీతిలో బోధన చేయాలి



రికార్డులు పరిశీలిస్తున్న సీఎంవో పెంచలయ్య, ఎంఈవో సుబ్బారెడ్డి

కందుకూరు, జూలై 25(ఆంధ్రజ్యోతి): భవిత కేంద్రాల్లో విద్యార్థులు సులభంగా అర్థం చేసుకునేలా సరళమైన బోధనా పద్ధతులు పాటించాలని సమగ్రశిక్ష సహిత విద్య జిల్లా సమన్వయకర్త, సీఎంవో కె.పెంచలయ్య సూచించారు. పట్టణంలోని ఇస్కాలవారివీధి మోడల్ ప్రైమరీ పాఠశాలలోని భవిత కేంద్రాన్ని ఎంఈవో సుబ్బారెడ్డితో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రికార్డులు, రిజిష్టర్లు పరిశీలించి ఆ కేంద్రంలోని విద్యార్థులతో మాట్లాడారు. చిన్నారులకు ఫిజియోథెరపి సేవలు సక్రమంగా అందేలా చూడాలని, వారికి ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలన్నీ సద్వినియోగం చేసుకునేలా శ్రద్ధ చూపాలని శిక్షకులకు సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం డీ.కోటేశ్వరరావు, ఐఈఆర్‌టీ ఆర్.కోటేశ్వరరావు, సీఆర్ఎంటీ ఎం.వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బెల్టు షాపు నిర్వాహకుడు బైండోవర్

కొండాపురం, జూలై 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని సాయిపేట పంచాయతీ వెల్లటూరివారిపాలెంలో మద్యం బెల్టు షాపుపై ఎక్సైజ్ సీఐ జలీల్ తన సిబ్బందితో కలిసి శుక్రవారం దాడులు నిర్వహించారు. బెల్టుషాపు నిర్వాహకుడిని అదుపులోకి తీసుకుని మూడు మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. నిర్వాహకుడిని తహసీల్దారు కోటేశ్వరరావు వద్ద బైండోవర్ చేశారు.

కలుగోళ్ల శాంభవి ఆలయంలో చీరల వేలం

కావలి, జూలై 25(ఆంధ్రజ్యోతి): కావలి గ్రామదేవత కలుగోళ్ల శాంభవికి అలంకరించిన చీరలు శుక్రవారం ఆలయ ఆవరణలో వేలం వేశారు. ఈ వేలంలో 36 చీరలను రూ.23,600లకు భక్తులు వేలంలో దక్కించుకున్నారు. దేవస్థానం ఈవో రాధాకృష్ణ ఆధ్వర్యంలో కోవూరు గ్రూపు ఆలయాల ఈవో సీహెచ్ కృష్ణప్రసాద్ పర్యవేక్షణలో వేలం పాట నిర్వహించారు. ఇక నుంచి ప్రతి నెలా 4వ శుక్రవారం అమ్మవారికి అలంకరించిన చీరలు వేలం వేస్తామని ఈవో రాధాకృష్ణ తెలిపారు.

రోడ్డు భద్రతపై అవగాహన

కందుకూరు, జూలై 25(ఆంధ్రజ్యోతి): నిర్లక్ష్యంగా వాహనాలు నడపటం ద్వారా విలువైన జీవితాన్ని అంధకారంలోకి నెట్టుకోవద్దని కందుకూరు ఆర్డీవో టీవీ నాగలక్ష్మి సూచించారు. స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం రోడ్డు భద్రత - యువత పాటించాల్సిన నియమాలు అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన వారు మాత్రమే డ్రైవింగ్ లైసెన్సు పొందాక వాహనాలు నడపాలని, వాహనాలు నడిపే, రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని కోరారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించటం ద్వారా ప్రాణనష్టాన్ని నివారించవచ్చన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు ఎం.రవికుమార్ మాట్లాడుతూ జీవితాన్ని రోడ్డు ప్రమాదాల్లో కోల్పోవద్దని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐ జె.అనిల్‌కుమార్, అధ్యాపకులు వై.నరేంద్ర, పి.రాజగోపాల్‌బాబు, కోటపాటి నరేష్‌రాజా, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ బలోపేతమే లక్ష్యం

బిట్రగుంట, జూలై 25(ఆంధ్రజ్యోతి): టీడీపీ బలోపేతమే లక్ష్యంగా సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు టీడీపీ నాయకులు టీ.ప్యాట్రిక్, మేతుకు వెంకటశేషయ్య అన్నారు. శుక్రవారం బోగోలు బజారు సెంటర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల నివాళులర్పించారు. అనంతరం ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు దేవరాళ్ల తిరుపతియాదవ్, ఇజ్రాయేల్, బుర్రివెంకటరావు, పార్వతి, వీరంబొట్లు, బీజేపీ నేత గుర్రం వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

వాహనాలకు తుప్పు!

- శిథిలమవుతున్నా స్పందించని వైనం
- తుక్కు కింద విక్రయించాలన్నా ఆటంకాలు
- పన్నులు చెల్లించకపోవడమే కారణం
- ఆస్తుల పరిరక్షణలో అధికారుల విఫలం



తుప్పుపడుతున్న వివిధ రకాల వాహనాలు

కావలి, జూలై 25(ఆంధ్రజ్యోతి) : కావలి మున్సిపాల్టీకి కోట్లాది రూపాయల ఆదాయం వస్తున్నా మున్సిపల్ ఆస్తుల పరిరక్షణలో విఫలమవుతున్నారు. పారిశుధ్య పరిరక్షణకు ప్రతి ఏటా ఏదో స్కీం కింద లక్షలాది రూపాయలతో కొనుగోలు చేసిన వాహనాలు కొత్తవి వస్తున్నా వాటి ఆలనా పాలనను అధికారులు విస్మరిస్తున్నారు. కొద్ది పాటి మరమ్మతులు వచ్చినా వాటిని సకాలంలో చేయించకుండా పూర్తిగా మూలన పడే వరకు వాటిని వినియోగించి కదలలేని రోజు పక్కన పడేస్తున్నారు. వాహనాలకు చెల్లించాల్సిన లైఫ్ ట్యాక్స్‌ను కూడా సక్రమంగా చెల్లించక పోవడంతో పాడైపోయిన వాహనాలు పాత ఇనుముకు విక్రయానికి కూడా నేడు ఆటంకగా మారింది. కావలి మున్సిపాల్టీలో కోట్ల రూపాయలు పెట్టి కొనుగోలు చేసిన లారీలు, ట్రాక్టర్లు, ట్రక్ ఆటోలు, వీధులు శుభ్రం చేసే మిషన్లు, దోమల మందు పిచికారి చేసే యంత్రాలు అన్నీ నేడు కోఆపరేటీవ్ కాలనీ ఓవర్‌హెడ్ ట్యాంక్ ఆవరణలో మూలన పడి శిథిలమై తుప్పు పట్టి ఎందుకు పనికి రాకుండా పోతున్నాయి. వాటిని పాత ఇనుముకు అమ్మదమన్నా వాహనాల పన్నుల బకాయిలు అడ్డువస్తున్నాయి. వాటిని చెల్లిద్దామంటే పాత ఇనుముకు అమ్మితే వచ్చే సొమ్ము కన్నా 10 రెట్లు ఎక్కువగా రవాణా శాఖకు పన్నుల రూపంలో చెల్లించాల్సి వస్తోంది. శిథిలమై తుప్పు పట్టి పాడై పోతున్న వాహనాలను ఏమి చేయాలో అర్థం కాక అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ప్రభుత్వ ఆస్తేకదా పాడైపోతే మన కెందుకులే. ఎప్పుడైనా బదిలీపై వెళ్లే వాళ్లమే కదా అనే భావనలో అధికారులు కాలం వెళ్లదీస్తున్నారు.



శిథిలమవుతున్న హైడ్రాలిక్ లారీ



పనికిరాకుండా పోయిన ట్రాక్టర్లు, ఇతర వాహనాలు

● వాహనాల నిర్వహణ గాలికి

మున్సిపల్ వాహనాలు కావడంతో వాటి నిర్వహణను అధికారులు గాలికి వదిలేస్తున్నారు. ఏ చిన్న మరమ్మతులు వచ్చినా సకాలంలో చూపించుకోకుండా వాటిని నడుపుతున్న డ్రైవర్లకే ఆ భారం వేస్తుండటంతో వారు వాహనం మూలన పడే వరకు వాటి సమస్యలను చెప్పడంలేదు. కొన్ని సందర్భాల్లో బయట మెకానిక్‌ల వద్ద మరమ్మతులు చేయించినా వారికి సకాలంలో డబ్బులు చెల్లించడం లేదు. దీంతో వాహనాల నిర్వహణను పూర్తిగా గాలికి వదిలేస్తున్నారు.

● విక్రయాలతో వచ్చే ఆదాయం కన్నా పన్నులే అధికం

మున్సిపల్ పాత వాహనాలు విక్రయిస్తే వచ్చే ఆదాయం కన్నా వాటి విక్రయానికి రవాణా శాఖ అనుమతులు తీసుకునేందుకు వారికి చెల్లించాలన్ని పన్నుల బకాయిలే 10 రెట్లు అధికంగా ఉందని కొందరు అధికారులు చెబుతున్నారు. వాస్తవంగా పాత వాహనాలను విక్రయించాలంటే వాటి ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌ను రవాణా శాఖ నుంచి పొందాలి. వాహనాలకు చెల్లించిన లైఫ్ ట్యాక్స్ కాలపరిమితి దాటిపోయిన తర్వాత మళ్లీ వాటిని రవాణా శాఖ వద్దకు తీసుకెళ్లి ఫిట్‌నెస్ ఉంటే వాటికి లైఫ్‌ట్యాక్స్ రెన్యువల్ చేయాల్సి ఉంది. కావలి మున్సిపాల్టీలో ఏ వాహనంకు కూడా వాటి ఫిట్‌నెస్, లైఫ్‌ట్యాక్స్‌ను పట్టించుకోకుండా తిరిగినన్ని రోజులు తిప్పి కదలన రోజున మూలన పడేస్తున్నారు. ఇంతవరకు కాలం గడిసి పోగా మూలన పడ్డ వాహనాలు చివరకు పాత ఇనుముకు విక్రయించాలన్నా వాటి ఫిట్‌నెస్ సర్టిఫికెట్స్ తప్పనిసరిగా ఉండాలి. ఫిట్‌నెస్ సర్టిఫికెట్స్ తీసుకోవాలంటే వాటి లైఫ్ ట్యాక్స్‌లను రెన్యువల్ చేయనందున వాటిని ఇప్పుడు చెల్లించాలంటే ప్రభుత్వ నిబంధనల మేరకు పెనాల్టీలు కట్టి చెల్లించలంటే వాహనాలు విక్రయం ద్వారా వచ్చే ఆదాయం కన్నా రవాణా శాఖకు చెల్లించాల్సిన పన్నులే అధికంగా ఉండటంతో అధికారులు చేతులెత్తేస్తున్నారు. వాస్తవంగా రెండు శాఖల మధ్య ఉన్న ఈ పన్నుల సమస్యను రవాణా శాఖ అధికారులతో మాట్లాడి పన్నులు తగ్గించుకుని పాత వాహనాలు వేలం వేస్తే మున్సిపాల్టీకి కొంత ఆదాయం చేకూరుతోంది. ఒకవేళ అది వీలుపడకపోతే రవాణా శాఖకు వాటి నిబంధనల మేరకు పన్నులు చెల్లించి వాహనాలు వేలం వేస్తే మున్సిపాల్టీకి కొంత నష్టం వచ్చినా రవాణా శాఖ ద్వారా ప్రభుత్వానికి ఆదాయం చేకూరుతోంది. ఉన్నతాధికారులు అన్ని కోణాల్లో ఆలోచించి పాత వాహనాలు తప్పు పట్టి పాడైపోకుండా ఆశాఖతో సమన్వయం చేసుకుని వాటిని విక్రయిస్తే ఏదో విధంగా ఆదాయం ప్రభుత్వానికి చేకూరుతోంది కదా అనే కోణంలో ప్రజలు ఆలోచించాల్సిన పరిస్థితి నెలకొంది.

ఆధార్ కేంద్రాన్ని వినియోగించుకోండి

వలేటివారిపాలెం, జూలై 25(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఎస్టీ పిల్లలకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో నరేంద్రదేవ్ తెలిపారు. వలేటివారిపాలెం గ్రామ సచివాలయంలో ఎస్టీ పిల్లలకు ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ కేంద్రాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆధార్‌కార్డు లేని ఎస్టీ పిల్లలు ఆధార్ నమోదు చేయించుకోవాలని తెలిపారు.



ఆధార్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో

'టిడ్కో'లో డ్రైనేజీ సమస్య పరిష్కారం

కావలి, జూలై 25(ఆంధ్రజ్యోతి) : మద్దూరుపాడులోని టిడ్కో గృహ సముదాయంలో ఏర్పడిన డ్రైనేజీ సమస్యను మున్సిపల్ కమిషనర్ జీ.శ్రావణ్‌కుమార్ పరిష్కరింప చేశారు. డ్రైనేజీలో నీరు పోకపోవడంతో స్థానికులు ఫోన్ చేయగా స్పందించిన కమిషనర్ వెంటనే శానిటరీ ఇన్‌స్పెక్టర్ బషీర్‌తో పాటు పారిశుధ్య కార్మికులను తీసుకెళ్లి పరిశీలించారు. వెంటనే ఆ సమస్యను పరిష్కరింపచేశారు.



డ్రైనేజీని పరిశీలిస్తున్న కమిషనర్ శ్రావణ్‌కుమార్

పేదల సమస్యలపై నిరంతర పోరాటమే లక్ష్యం

● సీపీఐ నేత రావుల వెంకయ్య



కందుకూరు నియోజకవర్గస్థాయి మహాసభలో మాట్లాడుతున్న రావుల వెంకయ్య

కందుకూరు, జూలై 25(ఆంధ్రజ్యోతి): పేదల సమస్యలపై నిరంతరం పోరాటం చేయడమే కమ్యూనిస్టు పార్టీల లక్ష్యమని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు రావుల వెంకయ్య పేర్కొన్నారు కమ్యూనిస్టులకు కాలం చెల్లిందని ప్రచారం చేయడం ద్వారా ప్రజలను వంచించి ప్రజాధనాన్ని దోచుకోవటమే లక్ష్యంగా కుహనా రాజకీయ నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. సీపీఐ కందుకూరు నియోజకవర్గ మహాసభ శుక్రవారం పట్టణంలోని పామూరు బస్టాండ్ సెంటర్‌లో ఉన్న ఓ కల్యాణ మండపంలో జరిగింది. ముందుగా ఓవీరోడ్డులోని పార్టీ కార్యాలయం నుంచి సభావేదిక వరకు ఎర్రజెండాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ మహాసభలో రావుల వెంకయ్య మాట్లాడుతూ వందేళ్ల కాలంలో సీపీఐ ఎన్నో ప్రజాపోరాటాలు చేసి విజయాలు సాధించి ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసిందన్నారు. ముందెన్నడూ లేనివిధంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ 11 ఏళ్లలో రూ.110 లక్షల కోట్ల అప్పులు చేసి దేశాన్ని అప్పుల ఊబిలోకి నెట్టాడని, కార్పొరేట్ సంస్థలకు ఏజెంట్‌గా పనుచేస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో చంద్రబాబునాయుడు పాలన జగన్ పాలననే గుర్తుతెస్తోందని, ఎన్నికల వాగ్దానాలు అమలుచేయటంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. సీపీఐ నెల్లూరు జిల్లా కార్యదర్శి దామా అంకయ్య మాట్లాడుతూ సోమశిల ఉత్తరకాలువ పొడిగింపు, రామాయపట్నం పోర్టు సీపీఐ పోరాటాల ఫలితంగానే సాధించుకున్నట్లు తెలిపారు. కరేడులో ఇండోసోల్ కంపెనీకి భూములు ఇవ్వబోమని గ్రామసభలో ప్రజలు ముక్తకంఠంతో చెప్పటమే గాక ఏకగ్రీవ తీర్మానం చేసినందున భూసేకరణ నోటిఫికేషన్‌ను ప్రభుత్వం వెనక్కు తీసుకోవాలని, కందుకూరు పట్టణంలో పారిశుధ్య కార్మికుల కోసం ప్రత్యేక కాలనీ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ ఈ మహాసభలో తీర్మానాలు ఆమోదించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పోకూరి మాలకొండయ్య, పీ.బాలకోటయ్య, వై.ఆనంద్‌మోహన్, బొజ్జా చంద్రమోహన్, ఆదినారాయణ, నాగరాజు, కాకుమాను రమణమ్మ, మెండ శైలజ, తదితరులు పాల్గొన్నారు.

లార్వా సర్వే పారదర్శకంగా నిర్వహించాలి

● జిల్లా మలేరియా అధికారి హుసేనమ్మ ● విద్యార్థులకు అవగాహన



పారిశుధ్య కార్యక్రమాలపై కమిషనర్‌తో చర్చిస్తున్న జిల్లా మలేరియా అధికారి హుసేనమ్మ

కావలి(టౌన్), జూలై 25(ఆంధ్రజ్యోతి) : లార్వా సర్వే పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా మలేరియా అధికారి హుసేనమ్మ పేర్కొన్నారు. డెంగ్యూ మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం పట్టణంలోని వెంగళరావునగర్ ఆరోగ్య కేంద్రం పరిధిలోని ముసునూరు జడ్పీ హైస్కూల్‌లో కీటక జనిత సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరు డ్రైడే డ్రైడే ఆవశ్యకత గురించి తెలుసుకుని పాటించాలన్నారు. దోమల్లో రకాలు, వాటి వల్ల వచ్చే వ్యాధులు గురించి అవగాహన కల్పించారు. వర్షాకాలంలో నీటి నిల్వలు వృద్ధి చెంది వాటిలో దోమల ఉత్పత్తి చెంది జ్వరాలు పెరిగే అవకాశముందని, లార్వా సర్వే పకడ్బందీగా నిర్వహించాలన్నారు. మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్‌తో వెక్టార్ కంట్రోల్ హైజిన్ యాప్, పారిశుధ్య కార్యక్రమాలపై చర్చించారు. అనంతరం ఏరియా వైద్యశాలలోని సెంటినల్ సర్వలెన్స్ సెంటర్‌లో జరిగే డెంగ్యూ పరీక్షల గురించి సూపరింటెండెంట్ డాక్టర్ అనూష, ఆర్ఎంవో ప్రవీణ్‌తో చర్చించారు. ఈ కార్యక్రమంలో సహాయ మలేరియా అధికారి నాగార్జున, డాక్టర్ మహేష్ పాల్గొన్నారు.

పాఠశాలకు బీరువా వితరణ

కందుకూరు, జూలై 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని విక్కిరాలపేట ప్రాథమిక పాఠశాలకు గ్రామానికి చెందిన గుండాబత్తిన పెదకోటయ్య, నాగమ్మ దంపతులు, వారి కుమారులు శుక్రవారం రూ.10 వేలు విలువజేసే బీరువా బహూకరించారు. విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, ఇతర విద్యాసామగ్రి, చెప్పులు, టేబుల్, చాపలు, చిన్న కుర్చీలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారి కుమారులైన కొండలరావు, శ్రీనివాసులు, మార్కండేయులు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి ఏజీఎం డెవలపర్స్ తరఫున అన్నివిధాలుగా తోడ్పాటు అందిస్తామని, విద్యార్థులకు ఏ సమస్య వచ్చినా ఆర్థికంగా ఆదుకునేందుకు ముందుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం బడేసాహెబ్, ఐసీడీఎస్ సూపర్‌వైజరు నీలాంబరి, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలి

● కందుకూరు ఏడీఏ శేషారెడ్డి

లింగసముద్రం, జూలై 25(ఆంధ్రజ్యోతి) : పురుగు మందులు లేని వ్యవసాయం వైపు రైతులు దృష్టి సారించేలా అధికారులు, సిబ్బంది చర్యలు తీసుకోవాలని కందుకూరు వ్యవసాయ సహాయ సంచాలకులు శేషారెడ్డి చెప్పారు. శుక్రవారం మండలంలోని వెంగళాపురం గ్రామ సమీపంలోని పొలాల్లో వ్యవసాయ అధికారులు, సిబ్బంది పొలాలను సందర్శించారు. ప్రకృతి వ్యవసాయంపై మూడు రోజుల శిక్షణలో భాగంగా ఆయన సిబ్బందికి పలు సూచనలు చేశారు.ప్రకృతి వ్యవసాయం వలన పంటలు అధిక దిగుబడులు పొందవచ్చన్నారు. ఇందులో భాగంగా ఏటీఎం మోడల్, ఏ గ్రేడ్ మోడల్, రుతుపవనాల ముందు దుక్కులు దున్ని 10 రకాల విత్తనాలను చల్లితే వచ్చే ప్రయోజనాలను గురించి వివరించారు. అతి తక్కువ పెట్టుబడితో ఈ విధానంలో ఎక్కువ దిగుబడులు సాధించవచ్చన్నారు. విచ్చలవిడిగా పురుగు మందులు వాడితే దుష్పరిణామాలు తప్పవన్నారు. ఈ కార్యక్రమాన్ని అన్ని మండల్లాలో విస్తరించాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి బీ.రవికుమార్, అధికారులు గీత, అబ్దుల్ రహీం పాల్గొన్నారు.



ప్రకృతి వ్యవసాయంపై క్షేత్ర పరిశీలనలో వ్యవసాయశాఖ అధికారులు

కొలతల ప్రకారం 'ఉపాధి' పనులు చేయాలి



యర్రారెడ్డిపాలెంలో ఉపాధి పనుల శ్రామికులతో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసులు

లింగసముద్రం, జూలై 25(ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పనుల్లో టెక్నికల్ అసిస్టెంట్లు ఇచ్చిన కొలత ప్రకారం పనులు చేయాలని ఎంపీడీవో కట్టా శ్రీనివాసులు చెప్పారు. శుక్రవారం మండలంలోని యర్రారెడ్డిపాలెంలోని కుంట పూడికతీత పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన శ్రామికులతో మాట్లాడుతూ, టీఏలు ఇచ్చిన కొలతల ప్రకారం శ్రామికులు పనులు చేస్తే ఎక్కువ నగదు వస్తుందని చెప్పారు. శ్రామికులకు పనికి తగిన వేతనం వచ్చేలా టీఏలు, ఎఫ్ఏలు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ఒకరి బదులు మరొకరు పనులకు రాకూడదన్నారు. బోగస్ మస్టర్లు వేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ గ్రామంలో పనులు అడిగిన శ్రామికులకు 70 నుంచి 80 రోజులు పనులు కల్పించామన్నారు.

సుభానీ మనీస్కాం సూత్ర, పాత్రధారి

మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డే!

● మద్యం స్కాం పక్కదారి పట్టించేందుకు యత్నం ● తెలుగు తమ్ముళ్ల ధ్వజం



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

కావలి, జూలై 25(ఆంధ్రజ్యోతి) : కావలిలో సంచలనం కలిగించిన సుభానీ మనీ స్కాంలో సూత్రధారి, పాత్రధారి మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డేనని టీడీపీ నేతలు ఆరోపించారు. బెంగళూరు నుంచి సుభానీని కావలికి తీసుకువచ్చి ఆయనకు ఆశ్రయం కల్పించి అన్నీ తానై చూసుకుంటూ ప్రతినెలా ఆయన నుంచి ముడుపులు తీసుకుంటూ మనీ స్కాంకు సహకరించారని, అందుకు సంబంధించిన ఆధారాలు ఉన్నాయన్నారు. కావలి టీడీపీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో టీడీపీ నేతలు గుత్తికొండ కిషోర్ బాబు, మలిశెట్టి వెంకటేశ్వర్లు, జ్యోతి బాబూరావు, పోతుగంటి అలేఖ్య, కండ్లగుంట మధుబాబు నాయుడు, పోట్లూరి శ్రీనివాసులు, దేవరకొండ శ్రీనివాసులు, పద్మావతి శ్రీదేవి, తిరువీధి ప్రసాద్, దావులూరి దేవకుమార్, బాలగురుస్వామి, జనసేన నాయకుడు సిద్దూ తదితరులు మాట్లాడారు. రాష్ట్రంలో సంచలనం కలిగిస్తున్న మద్యం స్కాంలో కావలి మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి పేరు వస్తుండటంతో దానిని పక్కదారి పట్టించేందుకు ఆయన సుభానీ మనీ స్కాంలో ఎమ్మెల్యే కృష్ణారెడ్డికి ముడుపులు ముట్టాయని ఆరోపణలు చేస్తున్నారన్నారు. మనీ స్కాంలో సూత్రధారులంతా వైసీపీకి చెందిన వారేనన్నారు. 2021లో ఆ స్కాంకు కావలిలో ఆశ్రయం కల్పించి అప్పటి నుంచి తద్వారా లబ్ధిపొందుతూ ఉండగా స్కాం బాధితులు టీడీపీ ఎమ్మెల్యే కృష్ణారెడ్డి దృష్టికి తీసుకురావడంతో ఆయన పోలీసుల దృష్టికి తీసుకెళ్లారన్నారు. దీంతో పోలీసులు ఆయనను అరెస్టు చేశారన్నారు. అయితే ప్రతాప్‌రెడి మద్యం స్కాంలో ఇరుక్కోవడంతో ఆయనను పోలీసులు ఏక్షణంలోనైనా అరెస్టు చేసే అవకాశం ఉందన్నారు. ఎమ్మెల్యేకు ముడుపులు ముట్టినట్లు ఆయన చేసే ఆరోపణలను రుజువు చేస్తే తాము ఆయన కాళ్ల కింద దూరుతామని, రుజువు చేయలేక పోతే ఎమ్మెల్యే కాళ్లకింద దూరతావా అని ప్రశ్నించారు. మా ఎమ్మెల్యేపై దిగజారుడు వాఖ్యలు చేస్తే సహించేదిలేదన్నారు.

బాధితులకు అండగా ఉంటాం

● వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి జూపూడి ప్రభాకరరావు



జూపూడితో మాట్లాడుతున్న గిరిజన మహిళలు

ఉలవపాడు, జూలై 25(ఆంధ్రజ్యోతి): ప్రజల అనుమతి లేకుండా రాష్ట్ర ప్రభుత్వం బడా వ్యాపారులకు అక్రమంగా భూములను దోచిపెట్టాలని చూస్తుందని, బాధితులకు అండగా ఉండామని మాజీ ఎమ్మెల్సీ, వైసీపీ అధికార ప్రతినిధి జూపూడి ప్రభాకరరావు అన్నారు. శుక్రవారం కరేడు భూసేకరణ బాధిత గ్రామలైన రామకృష్ణాపురం గిరిజన కాలనీ, ఉప్పరపాలెం ఎస్సీ కాలనీలను ఆయన సందర్శించి స్థానిక ప్రజలతో మాట్లాడారు. పూర్వీకుల కాలం నుంచి ఇక్కడే నివాసం ఉంటున్నామని, ఉంటున్న గ్రామం వదిలి తెలియని కొత్తప్రాంతంలో మేము బతకలేమని బాధితులు వాపోయారు. రెండు గ్రామాల ప్రజల మనోభిప్రాయాలు తెలుసుకున్న అనంతరం జూపూడి విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమలే ధ్యేయంగా భావిస్తే లక్షల ఎకరాల బంజర భూములు ఉన్నాయని, వాటిని వృద్ధి చేయొచ్చన్నారు. వాటిని వదిలేసి పచ్చని పంటపొలాల జోలికి వస్తే స్థానికులు, ప్రజా సంఘాలు, వామపక్ష పార్టీలతో కలిసి రైతులు, గ్రామస్థుల పోరాటంలో భాగసామ్యులం అవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రిపబ్లికన్ పార్టీ ప్రతినిధిని చెన్నకెశవులు, రైతు ఉద్యమ నాయకుడు మిరియం శ్రీనివాసులు, స్థానిక వైసీపీ నాయకులు ధనకోటి, పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

ఈ నీరు తాగేదెలా!?



నీటి పథకం నుంచి పచ్చగా వస్తున్న మంచినీరు

లింగసముద్రం, జూలై 25(ఆంధ్రజ్యోతి): మండలంతోపాటు వలేటివారిపాలెం మండలంలోని 48 గ్రామాలకు వస్తున్న రాళ్లపాడు-రోళ్లపాడు నీటి పథకం మంచినీరు కలుషితమైంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ఈనెల 15 నుంచి రెండు రోజులపాటు పెంట్రాల వద్ద ఉన్న ట్రీట్‌మెంట్ వాటర్ ప్లాంట్‌ను శుభ్రం చేసి, అందులో ఆలం, గ్యాస్ కలిపి, ప్రజలకు నీటి సరఫరా చేశారు. అయినా మంచినీరు పచ్చగావస్తూ, దుర్వాసన వస్తోంది. ఈనీటితో స్నానం చేస్తే శరీరం జిలగా ఉంటోందని పలువురు చెబుతున్నారు. ఈ విషయమై ఏఈ సీహెచ్ రాజశేఖర్‌ను వివరణ కోరగా ఎక్కడైనా పైపుల స్కువర్ల వద్ద మురుగు నిల్వ ఉండి, నీరు పచ్చగా వస్తుండవచ్చని చెప్పారు. పరిశుభ్రమైన నీటి సరఫరాకు చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు.

నా దేశ భూభాగంలో ఇంచు కూడా తాకనివ్వను అనేంత తెగువ. శత్రు దేశ సైనికులను సరిహద్దులు దాటించే వరకూ పోరాడిన ధైర్యం. భరతమాత మాత కోసం ప్రాణాలైనా అర్పించేంత భక్తి.. నాడు దేశ సైనికుల వీరోచిత పోరాట ఫలితం కార్గిల్ యుద్ధంలో చారిత్రాత్మకమైన విజయం. అత్యంత క్లిష్ట సమయంలో పాకిస్థాన్ సైనికులను ఆక్రమిత భారత భూభాగం నుంచి తరిమికొట్టిన దినం. ఎప్పటికీ గుర్తుండిపోతుంది. ఈ గొప్ప విజయానికి నేటికి 26 ఏళ్లు. ఈ శుభసందర్భాన్ని పురస్కరించుకొని విజయోత్సవాలు జరుపుకునేందుకు యావత్తు దేశం సిద్ధమైంది. నాటి కార్గిల్ యుద్ధం విజయంలో జిల్లా నుంచి కూడా 22 మంది సైనికులు పాలుపంచుకున్నారు. వివిధ హోదాల్లో నాడు వీరోచితంగా పోరాడారు. నాటి పరిస్థితులు, అప్పటి విజయాన్ని గుర్తు చేసుకుంటూ నేడు పులకరించిపోతున్నారు. వీరిని నేడు కలెక్టర్ ఓ ఆనంద్ అధ్యర్యంలో నెల్లూరులోని తిక్కన ప్రాంగణంలో సన్మానించనున్నారు. వీఆర్సీ నుంచి కలెక్టరేట్ వరకూ సైనిక సంక్షేమ శాఖ అధ్వర్యంలో ఉదయం పది గంటలకు కార్గిల్ విజయోత్సవ ర్యాలీ జరగనుంది.

వారి త్యాగం.. మనకు ఫలం

- నేడు కార్గిల్ విజయోత్సవ దినం
- నాటి యుద్ధంలో జిల్లా వారు 22 మంది
- నగరంలో విజయోత్సవ ర్యాలీ.. పోరాటయోధులకు నేడు సత్కారం

'కార్గిల్'లో గెలిచినా వారికి దక్కని న్యాయం • కొన్నేళ్లుగా భూ పంపిణీలో అలసత్వం • ఇప్పుడిప్పుడే కదులుతున్న ఫైళ్లు

దేశ రక్షణ కోసం త్రివిధ దళాల్లో జిల్లా నుంచి వేల మంది పనిచేశారు. ఇంకా చాలా మంది పనిచేస్తున్నారు. వారిలో ప్రస్తుతం 1900 మంది వరకూ మాజీ సైనికులు జీవించి ఉన్నారు. వీరంతా పెన్షన్లు తీసుకుంటున్నారు. అలానే మరో 1100 మంది మాజీ సైనికుల సతీమణులకు పింఛన్లు అందుతున్నాయి. వీరందరి సంక్షేమాన్ని పర్యవేక్షించేందుకు జిల్లాలో సైనిక సంక్షేమ కార్యాలయం ఉంది. చట్ట ప్రకారం సైనికోద్యోగం నుంచి పదవీ విరమణ పొందాక ఆ మాజీ సైనికులకు జీవనోపాధి కోసం రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ భూములను పంపిణీ చేస్తుంటాయి. ఒక్కొక్కరికి గరిష్ఠంగా ఐదెకరాల వరకూ అందిస్తుంటారు. జిల్లాలో వేల మందికి ఇలా భూములు ఇచ్చారు. అయితే కొన్నేళ్లుగా ఈ ప్రక్రియలో తీవ్ర జాప్యం జరుగుతోంది. మాజీ సైనికుల పట్ల రెవెన్యూ శాఖ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. ఈ విషయంలో ప్రభుత్వాలు కూడా పెద్దగా పట్టించుకోకపోవడంతో పోరాటవీరులకు సకాలంలో న్యాయం జరగడం లేదు. జిల్లాలో సుమారు 90 మంది మాజీ సైనికులకు భూములు ఇవ్వాల్సి ఉంది. వీరంతా ఏళ్ల తరబడి రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ ఉన్నారు. అయితే దేశ సరిహద్దుల్లో శత్రువులతో పోరాడినంతగా దేశంలోపలి వ్యవస్థలతో పోరాడలేక వారంతా అలసిపోతున్నారు. మెట్టెం వెంకటేశ్వర్లు అనే ఓ మాజీ సైనికుడు 20 ఏళ్ల పాటు భూమి ఇవ్వండి అంటూ అధికారుల చుట్టూ తిరిగి చివరకు ఆ భూమి పొందకుండానే అసువులు బాసారు. యల్లల కృష్ణయ్య అనే మరో మాజీ సైనికుడికి నెల్లూరు రూరల్‌లోని నవలాకులతోటలో భూమి ఇవ్వగా దానిని మరొకరు ఆక్రమించారు. తన భూమి తనకు ఇప్పించండంటూ కొన్నేళ్లపాటు అధికారుల చుట్టూ తిరిగి చివరకు తనువు చాలించారు. ఇటువంటి పరిస్థితిని అనేక మంది మాజీ సైనికులు అనుభవిస్తున్నారు. అయితే ఇటీవల కలెక్టర్ ఆనంద్ చొరవతో మాజీ సైనికులకు భూములు ఇచ్చే ప్రక్రియలో అడుగులు ముందుకు పడ్డాయి. జిల్లా సైనిక సంక్షేమ అధికారి జీ హరికృష్ణ నిరంతరం పర్యవేక్షిస్తుండటంతో ఇప్పటికే పది మందికి అడ్వాన్స్‌డ్ పొజిషన్ కూడా ఇచ్చారు. విజయోత్సవ సంబరాల్లో భాగంగా శనివారం మరో ఇద్దరు మాజీ సైనికులకు కూడా పట్టాలు అందించనున్నారు. మిగిలిన వారికి కూడా త్వరగా భూ పట్టాలు అందిస్తే ఆయా కుటుంబాలకు న్యాయం జరుగుతుంది. అదే సమయంలో నెల్లూరులో సైనిక అమరవీరుల స్థూపం నిర్మించాలని ఎప్పటి నుంచో మాజీ సైనికులు కోరుతున్నారు. దీనిపై కూడా కలెక్టర్ సానుకూల నిర్ణయం తీసుకోవాలని వారు ఆశిస్తున్నారు.

- నెల్లూరు, (ఆంధ్రజ్యోతి)





ఎన్నో భయానక దృశ్యాలు చూశా

కార్గిల్ యుద్ధం జరిగే సమయంలో నేను శ్రీనగర్ బార్డర్ వద్ద యుద్ధంలో పాల్గొన్నాను. శ్రీనగర్ నుంచే అనేక యుద్ధ విమానాలు నిత్యం యుద్ధంలో పాల్గొనేవి. నేనే శ్రీనగర్‌లోని అడ్మిన్ కంట్రోల్ సెంటర్‌కు వింగ్ కమాండ్ అధికారిగా ఉన్నా. సైనికులకు భోజనం, దుస్తులు, ఆయుధాలు, యుద్ధానికి విమానాల ఏర్పాటు ఇలా అన్ని ఏర్పాట్లు చూస్తూ ఉండేవాడిని. 1999, మే నెల నుంచి జూలై వరకు జరిగిన కార్గిల్ యుద్ధం ఎంతో భయంకరమైనది. 24 గంటలూ యుద్ధం చేయాలి. రోడ్లపైనే నిద్ర పోయేవాళ్లం. విమానాల్లో సైనికుల శవాలు వస్తుంటే వాటిని దింపి, అదే విమానాల్లో తిరిగి వెళ్లి పాకిస్తాన్‌తో పోరాడారు. బాంబులు పడుతుంటే బంకర్‌లోకి పరుగులు తీసేవాళ్లం. ఇలా దేశం కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా కార్గిల్ యుద్ధం చేసి విజయం సాధించాము. కార్గిల్ యుద్ధంలో నేను చేసిన సేవలకు భారతప్రభుత్వం కార్గిల్ వార్‌స్టార్ అనే బిరుదును అందజేసింది.

- వల్లూరు శ్యామ్‌ప్రసాద్, వింగ్ కమాండర్



రాడార్ సిస్టంలో పనిచేశా..

కార్గిల్ యుద్ధం సమయంలో చండీఘర్ బేస్‌లో పనిచేశా. శ్రీనగర్, ఉదయ్‌పూర్, జమ్మూ ప్రాంతాల్లో యుద్ధం జరుగుతున్న సమయంలో యుద్ధ విమానాలతోపాటు సిపాయిల హెల్మెట్లలో జీపీఎస్ సిస్టం ఉండేది. ఎక్కడ ఉన్నా రాడార్ సిస్టం ద్వారా తెలుసుకునే వాళ్లం. ఈ సిస్టం అమెరికా, రష్యా వంటి అగ్ర రాజ్యాలకే పరిమితం. అప్పట్లో మనకు ఈ టెక్నాలజీలో ఇజ్రాయిల్ దేశం బాగా సహాయ సహకారాలు ఇచ్చింది. దాదాపు 200 కి.మీ దూరంలో ఉన్నా ఈ సిస్టం ద్వారా ఎక్కడ ఉన్నారో తెలిసిపోతుంది. శత్రుదేశం విమానాల్లోంచి కొన్ని మెటాలిక్ చిప్సలను వదిలేసేవి. వాటిని కూడా విమానాలుగా రాడార్ గుర్తిస్తుంది. దీంతో యుద్ధ విమానాలు ఎక్కువగా వస్తున్నా యం టూ తప్పుదోవ పట్టించే వారు. వాటిని గుర్తించే విభాగమైన రాడార్ సిస్టంలో నేనుకూడా పని చేశా. సముద్ర మట్టానికి 5 నుంచి 6వేల మీటర్ల ఎత్తులో యుద్ధం జరిగింది. అప్పటి ప్రధాని వాజ్‌పేయి ప్రభుత్వం ఎంతో సహకారం ఇచ్చింది. చని పోయిన జవాన్లను వారి సొంత ఊళ్లకు పంపించేవారు. 20 ఏళ్ల సేవలందించి 2002లో పదవీవిరమణ చేశాను. ఆంధ్ర ప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక వంటి ప్రాంతాల్లో జవాన్లను పెద్దగా పట్టించుకోరు. పంజాబ్, హర్యానా ప్రాంతా ల్లో దేవుడిలా చూస్తారు. ప్రభుత్వాలు హామీలు ఇవ్వడం తప్ప పెద్దగా ప్రోత్సాహకాలు లేవు. 2003లో టూరిజంలో ఉద్యోగంలో చేరా.

- కేవీ.సుబ్బా రెడ్డి, సర్జంట్, ఎయిర్‌ఫోర్స్ రేడియో ఫిట్టర్



మా వాహనాలపై బాంబులు వేశారు

ఇండియన్ ఆర్మీలో సప్లైలో డ్రైవర్‌గా 26ఏళ్లపాటు సర్వీస్ చేశాను. కార్గిల్ యుద్ధ సమయంలో మా వాహనాల మీద బాంబులు వర్షం కురిసింది. పాకిస్థాన్ వైపు నుంచి గ్రానైడ్ మా పక్క వాహనం మీద పడింది. అందులో నా సహచరుడు శ్రీనివాసు ప్రాణాలు విడిచాడు. కొంతమంది గాయపడ్డారు కూడా. అది చాలా బాధగా ఉన్నా ఈ ఘటన మాలో కసిని పెంచింది. ఆఖరికి శత్రువులపై విజయం సాధించాం.

- కళాధర్, ఆర్మీ విశ్రాంత డ్రైవర్



టైగర్ హిల్స్ దగ్గర బాంబుల వర్షం

ఆర్మీలో నేను సిగ్నల్స్ విభాగంలో ఆపరేటర్‌గా 17 సంవత్సరాల పాటు సర్వీస్ చేశాను. కార్గిల్ యుద్ధంలో టైగర్ హిల్ దగ్గర బాంబుల వర్షం కురిసింది. అందులో నా సహచరులు ఇద్దరు చనిపోయారు. కొంతమంది గాయపడ్డారు. అది చాలా బాధగా ఉన్నా అది మాలో కసిని పెంచింది.

- రవికుమార్, ఇండియాన్ ఆర్మీలో విశ్రాంత సిగ్నల్స్ ఆపరేటర్



యుద్ధంలో ధైర్యంగా పని చేశా

ఆర్మీ (సిగ్నల్స్)లో ఆపరేటర్‌గా చేశారు. 17 సంవత్సరాలు సర్వీస్ చేసి 2000లో పదవీ విరమణ చేశాను. 1999 కార్గిల్ యుద్ధ సమయంలో ఉదంపూర్ సెక్టార్‌లో 21 జేఏటీ రెజిమెంట్లో కమ్యూనికేషన్ ఆపరేటర్‌గా పని చేశాను. యుద్ధ సయయంలో ఎలాంటి భయం లేకుండా పాల్గొన్నా.

- మేడేపల్లి రత్నయ్య, ఆర్మీలో విశ్రాంత కమ్యూనికేషన్ ఆపరేటర్

మా సమస్యలు పరిష్కరించండి!

- బీపీసీఎల్ అధికారుల తీరుపై వెంకటాచలంలో ట్రాన్స్‌పోర్టర్ల నిరసన



ఆయిల్ ట్యాంకర్లతో నిరసన తెలుపుతున్న బీపీసీఎల్ ట్రాన్స్‌పోర్టర్లు

వెంకటాచలం, జూలై 25 (ఆంధ్ర జ్యోతి) : జిల్లా ఉన్నతాధికారులు సత్వ రమే స్పందించి నష్టాల ఊబి నుంచి తమను కాపాడాలని బీపీసీఎల్ (భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్) ట్రాన్స్‌పోర్టర్లు కోరారు. పుంజులూరుపాడు రైల్వే గేటు సమీపంలో భారత్ పెట్రోల్ బంకు వద్ద శుక్రవారం కృష్ణపట్నం పోర్టు రోడ్డుపై ట్రాన్స్‌పోర్టర్లు తమ ఆయిల్ ట్యాంకర్లను నిలిపి నిరసన వ్యక్తం చేశారు. తెలిపారు. బీపీసీఎల్ అధికారులు తమను తీవ్ర వేధింపులకు గురి చేస్తున్నట్లు ట్యాంకర్ల డ్రైవర్లు, హెల్పర్లతో కలిసి ట్రాన్స్‌పోర్టర్లు వాపోయారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ కృష్ణపట్నం పోర్టుకు అనుబం ధంగా ఉన్న బీపీసీఎల్ కంపెనీ డిపో నుంచి భారత్ పెట్రోల్ బంకులకు తరలించేందుకు టెండర్ల ద్వారా బీపీసీఎల్ కంపెనీకి ఆయిల్ ట్యాంకర్లను ఏర్పాటు చేశామన్నారు. బీపీసీఎల్ కంపెనీ ఇక్కడ ప్రారంభించిన నాటి నుండి తాము తక్కువ ధరలకే ఉమ్మడి నెల్లూరు, చిత్తూరు జిల్లాల్లోని భారత్ పెట్రోల్ బంకులకు ఆయిల్ రవాణా చేస్తున్నామన్నారు. నాటి పరిస్థితుల దృష్ట్యా తక్కువ ధరలకే టెండర్లు వేశామన్నారు. ఆరు నెలలలోపు పోర్టులో బొగ్గులారీలు తిరిగే రోడ్లపై కాకుండా ప్రత్యామ్నాయ రోడ్డు, గిట్టుబాటు బాడుగలు మొదలైన సమస్యలను పరిష్కారిస్తామని హామీ ఇచ్చారన్నారు. అయితే ఇంతవరకూ పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పోర్టులోని జీరో పాయింట్ వద్ద దాదాపు మూడుగంటలకుపైగా ట్యాంకర్లు వేచి ఉండాల్సిన పరిస్థితి ఉందన్నారు. స్థానికంగా బీపీసీఎల్‌లో పని చేస్తున్న అధికారులు అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారని, తమను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. బొగ్గు, ధూళి, పాడైన రోడ్లు, అత్యంత తక్కువ రవాణా ధరల కారణంగా తాము ఇప్పటికే తీవ్ర నష్టాల్లో కూరుకుపోయామన్నారు. ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో వెంటనే పరిశీలించి తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని కోరారు. నిరసన కార్యక్రమంలో గణేష్ లెమన్ ట్రేడర్స్ అధినేత మస్తాన్ నాయుడు, ట్రాన్స్‌పోర్టర్లు లోకేష్ తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ వాహనాల బ్యాటరీ దొంగల అరెస్ట్

నెల్లూరు(క్రైం), జూలై 25 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని పాత మున్సిపాలిటీ ఆఫీస్ ఆవరణలో నిలిపి ఉన్న మున్సిపల్ వాహనాలకు ఉండే బ్యాటరీలు దొంగలించుకు వెళ్లిన ఇద్దరు నిందితులను సంతపేట పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను సంతపేట స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ దశరథరామారావు శుక్రవారం మీడియాకు వెల్లడించారు. పాత మున్సిపాలిటీ కార్యాలయం ఆవరణలో నిలిపి ఉన్న చెత్తతోలే 17 ప్రభుత్వ వాహనాలకు ఉండే బ్యాటరీలను గుర్తుతెలియని దుండగులు ఈ ఏడాది ఫిబ్రవరి 3వ తేదీ దోచుకెళ్లారు. పోలీసులు సాంకేతికత ఆధారంగా దర్యాప్తు చేయగా నగరంలోని ఇసుకడొంక రిక్షా కాలనీకి చెందిన షేక్ షఫీ, అల్లీపురం టిడ్కో ఇళ్లలో ఉండే దాసరి అప్పారావు నిందితులుగా గుర్తించారు. వారిని ఈ నెల 24వ తేదీ రాత్రి పుట్టా ఎస్టేట్ వద్ద అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి రూ.81 వేల విలువ చేసే 17 బ్యాటరీలను స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ దశరథ రామారావు, ఎస్‌ఐ సుల్తాన్ బాషా, హెడ్‌కానిస్టేబుళ్ల సుబ్బారావు, లావణ్యకుమార్, కానిస్టేబుళ్ల సురేంద్ర, గోపి, అల్లభక్షును ఏఎస్పీ సీహెచ్ సౌజన్య అభినందించారు.

కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుపై పరిశీలన

అల్లూరు, (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే పథకాల అమలుపై కేంద్ర బృందం శుక్రవారం పరిశీలన చేపట్టింది. మండలంలోని తూర్పుగోగులపల్లిలో పర్య టించి లబ్ధిదారులను కేంద్ర ప్రభుత్వ పథ కాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పింఛన్లు, జాతీయ ఉపాధి హామీ తదితర అనేక ప్రభుత్వ పథకాల అమలు ఏ విధంగా జరుగుతుందో తెలుసుకునేందుకు తాము వచ్చామని, ఇందు లో ఏమైనా తేడాలు, సమస్యలు, పథకాలు లబ్ధిదారుడికి చేకూర్చేందుకు ఇంకా సులువైన మార్గాలు ఉన్నాయా అనే అంశాలను తెలుసుకుంటున్నామన్నారు. లబ్ధిదారులను నేరుగా కలుసుకొని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ డెవలప్‌మెంట్ బృందం సభ్యుడు డాక్టర్ ప్రశాంత్‌కుమార్, స్థానిక అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

న్యాయమూర్తుల పదవులు భర్తీ చేయాలి

- ఐఏఎల్ ఆందోళన

నెల్లూరు (లీగల్), (ఆంధ్రజ్యోతి) : దేశంలో న్యాయమూర్తుల పదవులను వెంటనే భర్తీ చేయాలని, న్యాయవాదుల డెత్ బెనిఫిట్స్‌ను వెం టనే విడుదల చేయాలని ఇండియన్ అసోసి యేషన్ అఫ్ లాయర్స్ అధ్వర్యంలో శుక్రవారం జిల్లా కోర్టు ప్రాంగణంలో న్యాయవాదులు నిరసన తెలిపారు. సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్ వేనాటి చంద్రశేఖర్ రెడ్డి, డిప్యూటీ జనరల్ సెక్రటరీ అరిగెల నాగేంద్ర సాయి, ప్రధాన కార్యదర్శి ఎం బ్రహ్మం మాట్లా డుతూ న్యాయవాదులకు ప్రస్తుతం ఇస్తున్న వెల్ఫేర్ ఫండ్‌ను రూ.ఆరు లక్షల నుంచి పది లక్షలకు పెంచాలని, న్యాయవాద కుటుంబాలకు రావలసిన డెత్ బెనిఫిట్స్ వెంటనే రిలీజ్ చేయాలని డిమాండ్ చేశారు. న్యాయవాదుల రక్షణ చట్టాన్ని వెంటనే అమలులోకి తేవాలని ప్రభుత్వాన్ని కోరారు.

మున్సిపల్ కార్మికుల పనులు ప్రైవేట్‌కు అప్పగించొద్దు

- రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చంద్ర రాజగోపాల్



సమావేశంలో మాట్లాడుతున్న చంద్ర రాజగోపాల్

నెల్లూరు (వైద్యం), జూలై 25 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ పారిశుధ్య కార్మికుల పను లను ప్రైవేట్ కాంట్రాక్టర్లకు అప్పగించే విధానాన్ని ప్రభుత్వం రద్దు చేయాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చంద్ర రాజగోపాల్ డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పీ4 పేరుతో పేదలను ధనవంతులను చేస్తా మంటున్న రాష్ట్ర ప్రభుత్వం దళిత, గిరిజనులు ఎక్కువగా ఉండే పారిశుధ్య కార్మికులపై చిన్న చూపు చూస్తోందని విమర్శించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకమరాజు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు చేసే పోరాటంలో ప్రజలను భాగ స్వాములను చేస్తామని చెప్పారు. ప్రభుత్వం బేషజాలకు పోకుండా కార్మికుల న్యాయమైన కోర్కెలను నెరవేర్చాలని కోరారు. ఈ సమా వేశంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీరాములు, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు శివకు మారి, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నరసింహ, రమణ, అవాజ్ జిల్లా కార్యదర్శి రషీద్ తదితరులు పాల్గొన్నారు.

పరిహారం చెల్లించకుండానే రోడ్డు నిర్మిస్తున్నారని రైతు నిరసన



నిరసన తెలుపుతున్న రైతు కుటుంబం

సీతారామపురం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): తనకు పరి హారం చెల్లించకుండానే రోడ్డు నిర్మిస్తున్నారని గుండుపల్లి గ్రామానికి చెందిన రైతు మామిడి భాస్కర్ శుక్రవారం కుటుంబ సభ్యులతో కలిసి నిరసన వ్యక్తం చేశాడు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సర్వేనెంబర్ 93.3లో తనకు 64 సెంట్లు వారసత్వ భూమి ఉండగా దానిలో 50 సెంట్లు హైవే రోడ్డు నిర్మాణానికి పోతుందన్నారు. అధికార యంత్రాంగం నిర్లక్ష్య వైఖరి కారణంగా అందరితో పాటు తాను నష్టపరిహారం పొందలేక పోయానన్నారు. పరిహారం అందివ్వకుండానే పోలీసు బలగాలను దింపి నేషనల్ హైవే పనులను చేపట్టడం ఎంతవరకు సమంజసమని ఆయన ఆవేదన వ్యక్తం చేశాడు. కాగా, ఈ విషయంపై తహసీల్దార్, కాంట్రాక్టర్లను వివరణ కోరగా... హైవే రోడ్డుకు పోయిన భూమికి సంబంధించి నష్టపరిహారం అందరితోపాటు అతనికి కూడా చెల్లించేలా చర్యలు చేపట్టామని, ఈలోగా అతని దాయాదులు ఆక్షేపణలు తెలిపి కోర్టును ఆశ్రయించడంతో నష్టపరిహారం చెల్లించేందుకు అంతరాయం ఏర్పడిందన్నారు. ఈ వ్యవహారం కోర్టు పరిధిలో ఉండటంతో పరిష్కారం లభించేంత వరకు తాము వేచి ఉండలేమని, అందుకే ఉన్నతాధికారుల ఆదేశాలతో రోడ్డు నిర్మాణ పనులు చేయించడం జరిగిందన్నారు.

చేప పిల్లల నర్సరీపై ముగిసిన శిక్షణ

నెల్లూరు(వ్యవసాయం), జూలై 25(ఆంధ్రజ్యోతి): చేప పిల్లల నర్సరీ నిర్వహణ, చెరువుల్లో మేత సంకలితాల ప్రాముఖ్యతపై నెల్లూరు కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే)లో ఐదు రోజులుగా జరుగుతున్న శిక్షణ తరగతులు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా రైతులతో చర్చాగోష్టి నిర్వహిం చారు. వారు అడిగిన ప్రశ్నలకు శాస్త్రవేత్తలు హరిసాదు, ఎస్ లోకేష్‌బాబు, సూరజ్ మండల్ సమాధానమిచ్చారు. రైతులంతా గ్రూపులుగా ఏర్పడి సమస్యలను కలసికట్టుగా పరిష్కరించుకోవాలని సూచించారు. జాతీయ మత్స్య అభివృద్ధి బోర్డు (ఎన్ఎఫ్‌డీబీ) సౌజన్యంతో జరిగిన ఈకార్యక్రమంలో ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాల ముఖ్య కార్యనిర్వాహక అధికారి డాక్టర్ యోగ నరసింహ నాయుడు కూడా పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ కార్యదర్శి పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(విద్య), జూలై 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో 2025-2027 సంవత్సరాలకు జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య (ఎస్‌జీఎఫ్) కార్యదర్శి నియామకానికి సంబంధించి అర్హులైన పీడీ, పీఈటీల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈవో బాలాజీరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన వారు ఈనెల 31వతేదీలోపు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అవసరమైన ధ్రువపత్రాలతో పాటు సుముఖత లేఖను సమర్పించాలని కోరారు. ఎస్‌జీఎఫ్‌కు సంబంధించిన పూర్తి విధివిధానాలు deonel-lore50webs.com వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

ప్రజాస్వామ్యంలో ప్రజల ఆశీర్వాదమే కొలమానం

- గృహ నిర్మాణ శాఖ మంత్రి పార్థసారథి



ఉలవపాడు : ప్రజలకు కరపత్రాలు అందచేస్తున్న మంత్రి పార్థసారథి, ఎమ్మెల్యే ఇంటూరి

ఉలవపాడు/వింజమూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : ప్రజాస్వామ్యంలో ప్రజల ఆశీర్వాదమే ఏ ప్రభుత్వానికైనా కొలమానమని, అంతేకానీ రప్పా.. రప్పా నరుకుతాం, మా ప్రభుత్వం వస్తే ఒక్కొక్కరి అంతుచూస్తామంటే ప్రజలు అంతకుఅంత చెల్లిస్తారని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. శుక్రవారం నెల్లూరు రూరల్, వింజమూరు, ఉలవపాడు మండలాల్లో జరిగిన సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమాల్లో స్థానిక ఎమ్మెల్యేలతో కలిసి మంత్రి పాల్గొన్నారు. ఇంటింటికి తిరుగుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన పథకాల లబ్ధితోపాటు ప్రభుత్వ పనితీరును ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఉలవపాడు మండలం భీమవరం గ్రామంలో విలేకరులతో మంత్రి పార్థసారథి మాట్లాడుతూ వైసీపీ హయాంలో రైతులను ఆదుకున్నది లేదని, రూ.1637 కోట్ల ధాన్యం డబ్బులు 21 రోజుల్లో చెల్లిస్తానని చెప్పి ఆరునెలలు గడిచినా పట్టించుకోకపోవడంతో ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ బకాయిలు చెల్లించిందన్నారు. మామిడి, పొగాకు, కొబ్బరి రైతులకు బాసటగా నిలిచిందని స్పష్టం చేశారు. పక్కా గృహాల లబ్ధిదారులకు రూ.1000 కోట్ల బకాయిలు చెల్లించామని అన్నారు. చెప్పులు కుట్టుకొని జీవించే దళితుడిని తన పక్కనే కారులో కూర్చోబెట్టుకుని అతని జీవన ప్రమాణాలు, కష్టసుఖాలు చర్చిస్తూ చంద్రబాబు వెళ్లారని, జగన్ మాత్రం నేరచరిత కలిగిన గంజాయి బ్యాచ్ ఇళ్లకు వెళ్లి పరామర్శలు చేస్తున్నాడని రాష్ట్ర ప్రజలకు ఎలాంటి సందేశం ఇస్తున్నారో జగన్ చెప్పాలని ప్రశ్నించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలోనూ మంత్రి మాట్లాడారు. సుమారు రూ.10 లక్షల విలువ చేసే సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు. గ్రామంలో సిమెంట్ రోడ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటూరి మాట్లాడుతూ కరేడు భూసేకరణలో ప్రజలకు ఎలాంటి కష్టం రాకుండా చూసుకుంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు రాచగల్లు సుబ్బారావు, శ్రీనివాసులు, జాజుల రవి తదితరులు పాల్గొన్నారు.

- వింజమూరులోని యాదవ్‌బజార్‌లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఉదయగిరి ఎమ్మె ల్యే కాకర్ల సురేష్‌తో మంత్రి పార్థసారథి పాల్గొన్నారు. ముందుగా మంత్రికి ఎమ్మెల్యే ఘన స్వాగతం పలికి సత్కరించారు. అనంతరం యాదవ్ బజార్‌లోని ప్రతి గడపకు వెళ్లి ప్రజలతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వంశీకృష్ణ, తహసీల్దారు హమీద్, ఎంపీడీవో శ్రీనివాసులురెడ్డి, హౌసింగ్ డీడీ వేణుగోపాల్, ఈఈ నారాయణరెడ్డి, జడ్పీ మాజీ చైర్మన్ పి.చెంచలబాబు, నాయకులు నర్సారెడ్డి, చైతన్య, సర్పంచ్ సృజన తదితరులు పాల్గొన్నారు.

వెంగమాంబ ఆలయ హుండీల లెక్కింపు



హుండీలను లెక్కిస్తున్న సిబ్బంది

దుత్తలూరు (ఉదయగిరి), జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్రవాడలో ఉన్న వెంగమాంబ పేరంటా లమ్మ ఆలయంలో శుక్రవారం ఆలయ కార్యనిర్వా హణాధికారి వెట్టి గుంట ఉషశీల ఆధ్వర్యంలో కోవూరు దేవదాయ ఇన్‌స్పెక్టర్ నాగమల్లేశ్వరరాజు పర్యవేక్షణలో ఆలయంలో వివిధ చోట్ల ఏర్పాటు చేసిన హుండీలను లెక్కించారు. ఆయా హుండీల ద్వారా రూ.24,68,691 నగదు, బంగారం 6, వెండి 307 గ్రాములు వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీజీబీ సిబ్బంది, ఎస్‌బీఐ విశ్రాంత ఉద్యోగులు, ఆలయ అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.